
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 309

మంగళవారం 30-1-2024



5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

వచ్చే మూడేళ్లలో భారత్ పురోగతిపై ఆర్థికశాఖ నివేదిక

-13లో



..బలం సగమే!

45 శాతం మేరకు పోషకాలు కోల్పోయిన వరి గోధుమలు..

-11లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అర నిమిషంలో నిద్రపోతా

అధిక సమయం స్క్రీన్‌లకు అతుక్కుపోతే అది మీ నిద్రపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని విద్యార్థులను మోదీ సున్నితంగా హెచ్చరించారు.

- వివరాలు 6లో



సోరెన్ కోసం 'ఈడీ' పడిగాపులు

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను ప్రశ్నించేందుకు వెళ్లిన ఈడీ అధికారులకు చేదు అనుభవం ఎదురైంది.

- వివరాలు 6లో



భయానక ఉదంతమిది

ఏఐతో సృష్టిస్తున్న డీప్‌ఫేక్ ఫొటోలు, వీడియోల ధోరణి అత్యంత భయంకరమైనదని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అన్నారు.

- వివరాలు 6లో



ముయిజ్జుపై అవిశ్వాసం

మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం ఎండీపీ సిద్ధమవుతోంది.

- వివరాలు 6లో

రెండు దరఖాస్తులు చాలు

ప్రభుత్వ కాలేజీలకు ఒకటి.. ప్రైవేటు కాలేజీలకు మరొకటి..

దేశవ్యాప్తంగా అన్ని ఎంబీబీఎస్ సీట్లకు ఒకేసారి కౌన్సెలింగ్

మెరిట్‌తో ఏ రాష్ట్రంలోని కాలేజీలోనైనా ఓపెన్ కేటగిరీ సీట్లు పొందొచ్చు

- జాతీయ వైద్య మండలి విప్లవాత్మక నిర్ణయం..
- దేశవ్యాప్తంగా లక్షకుపైగా సీట్లు అందుబాటులో..
- రెండు దరఖాస్తులు చేస్తే చాలు.. అన్నింటికీ పోటీ
- 2024–25 నుంచే కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో వైద్య విద్య కౌన్సెలింగ్, అడ్మిషన్ల ప్రక్రియను జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) సరళతరం చేసింది. ఎయిమ్స్ వంటి జాతీయస్థాయి మెడికల్ కాలేజీలతోపాటు రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం జరిగే కౌన్సెలింగ్‌లకు పదుల సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు దేశవ్యాప్తంగా ఉన్న లక్షకుపైగా ఎంబీబీఎస్ సీట్లకు కేవలం రెండు దరఖాస్తులతో పోటీపడొచ్చు. ఇందులో ప్రైవేటు కాలేజీల కోసం ఒకటి, ప్రభుత్వ కాలేజీల కోసం మరో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఎక్కడ సీటు వస్తే అక్కడ చేరవచ్చు. విద్యార్థి కోరుకున్నచోట సీటు రాకుంటే.. తదుపరి కౌన్సెలింగ్‌లలో పాల్గొనవచ్చు. దీనిపై త్వరలోనే ఆదేశాలు వెలువడనున్నాయని ఎన్ఎంసీ వర్గాలు తెలిపాయి. 2024–25 వైద్య విద్యా సంవత్సరం నుంచే ఈ విధానం అమల్లోకి రానుందని వెల్లడించాయి.

జాతీయ స్థాయి మెరిట్ అయినా వేర్వేరుగా..: దేశవ్యాప్తంగా 681 మెడికల్ కాలేజీల్లో 1.04 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంఎస్,

మిగతా 10వ పేజీలో ▶



ఒకేసారి విస్తృతంగా కౌన్సెలింగ్

ప్రస్తుత నిబంధనల మేరకు అభ్యర్థులు జాతీయ స్థాయి మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్ సీట్లకు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. డీమ్డ్ వర్సిటీల్లోని కాలేజీలకు వేరుగా, వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు వేర్వేరుగా దరఖాస్తులు చేసుకోవాలి. ఇలా పదుల సంఖ్యలో, కొందరైతే 50 నుంచి 60 దరఖాస్తులు చేసిన సందర్భాలూ ఉన్నాయి. రాష్ట్రాల్లోని కాలేజీల్లో 15% జాతీయ స్థాయి ఓపెన్ కోటాకు ఏ రాష్ట్రంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటివరకు వీటికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ జరిగేది. ఆ కౌన్సెలింగ్ పూర్తయ్యాక రాష్ట్రాల్లోని మిగతా కన్వీనర్ కోటా సీట్లకు కౌన్సెలింగ్ జరిపేవారు. ఈ ఏడాది నుంచి జాతీయ, రాష్ట్రస్థాయి సీట్లన్నింటికీ ఒకేసారి.. అంటే ఒకే తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

ముగ్గురు 'పెద్దలు' ఎవరో!

తెలంగాణ నుంచి మూడు రాజ్యసభ సీట్లు ఖాళీ

- ఈసారి దక్కనున్న 2 స్థానాలపై కాంగ్రెస్‌లో చర్చ.. సోనియా రాష్ట్రం నుంచి లోక్‌సభకు పోటీ చేస్తే ఓకే.. లేదంటే రాజ్యసభకు..
- కుదరని పక్షంలో మరో జాతీయ నేతకు చాన్స్
- రెండో సీటు కోసం పెద్ద సంఖ్యలో ఆశావహులు.. నేడు పీఏసీ భేటీ
- పదవీ కాలం పూర్తయ్యే ముగ్గురూ బీఆర్ఎస్ ఎంపీలే
- అసెంబ్లీ సంఖ్యాబలంతో బీఆర్ఎస్ నుంచి ఒక్కరే..
- బీసీ సామాజికవర్గానికి చెందిన వారికే అవకాశం?



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ రెండో తేదీన ఖాళీ అయ్యే మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి సంబంధించిన ద్వైవార్షిక ఎన్నిక షెడ్యూలును కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. బీఆర్ఎస్ తరఫున రాజ్యసభ సభ్యులుగా ఉన్న వద్దిరాజు రవిచంద్ర, బడుగుల లింగయ్య యాదవ్, జోగినపల్లి సంతోష్‌కుమార్‌ల పదవీ కాలం పూర్తి కానుండటంతో, ఆ స్థానాల భర్తీకి ఈ ఎన్నిక జరుగుతోంది. ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ జారీ కానుండగా, 27న ఎన్నిక జరగనుంది. అయితే 15వ తేదీలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. దీంతో రాష్ట్ర అసెంబ్లీలో సంఖ్యాపరంగా ఎక్కువ సంఖ్యలో ఓట్లు కలిగి ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల్లో సందడి మొదలైంది. పలువురు నేతలు పెద్దల సభలో ప్రవేశించేందుకు ఆసక్తి చూపుతుండగా, ఎవరికి చాన్స్ దక్కుతుందనే చర్చ రెండు పార్టీల్లో జరుగుతోంది. ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాల్లో.. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి కాంగ్రెస్‌కు రెండు, బీఆర్ఎస్‌కు ఒక స్థానం చొప్పున దక్కే అవకాశం ఉంది. అయితే రాజ్యసభ ఎన్నికల్లో విప్ వర్తించదనే నిబంధనను ఆసరాగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ మూడో అభ్యర్థిని కూడా బరిలోకి దించే అవకాశం లేకపోలేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇటీవలి కాలంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను కలవడం, ఇటీవలి దావోస్ పర్యటన అనంతరం లండన్‌లో

మిగతా 3వ పేజీలో ▶

ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలు

- 15 రాష్ట్రాల్లో 56 స్థానాలకు జరగనున్న ఎన్నికలు
- షెడ్యూల్‌ను విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

6లో

న్యూస్‌రీల్

2023లో భారతీయులకు 14 లక్షల వీసాలు



2023లో భారతీయులకు 14 లక్షల వీసాలను జారీ చేసినట్లు ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయం తెలిపింది. 2022తో పోలిస్తే ఇది 60% ఎక్కువని వివరించింది. ఏ దేశానికీ ఇంత పెద్ద సంఖ్యలో వీసాలు జారీ కాలేదని పేర్కొంది. అమెరికాలో చదివే 10 లక్షల పైచిలుకు అంతర్జాతీయ విద్యార్థుల్లో 2.5 లక్షల మంది భారతీయులేనని ఢిల్లీ ఎంబసీ తెలిపింది.

- వివరాలు 6లో ▶

సర్కారు సీరియస్.. సీఎంఆర్ వాపస్!



కస్టమ్ మిల్లింగ్ రైస్ విషయంలో రాష్ట్ర సర్కారు కఠినంగా వ్యవహరిస్తుండటంతో రైస్‌మిల్లర్లు దారికి వస్తున్నారు. మిల్లుల్లో మర ఆడిస్తూ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించే పనిలో పడ్డారు. 'కొత్తగా ధాన్యం ఇస్తేనే.. పాత బకాయిలు చెల్లిస్తా!. లేకుంటే మిల్లు మూసేస్తా'నంటూ సూర్యాపేట కలెక్టర్‌కు కోదాడలోని ఓ మిల్లర్ రాసిన లేఖ కలకలం రేపుతోంది.

- వివరాలు 5లో ▶

అమ్మానాన్నా సారీ.. నేను ఓడిపోయాను..!



రాజస్తాన్‌లోని కోటాలో జేఈఈకి ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని నిహారిక సింగ్ (18) ఉరివేసుకుని తనువు చాలించింది. 'పరీక్షా పే చర్చా'లో ప్రధాని మోదీ మాట్లాడటానికి కొద్దిసేపటి ముందే ఈ విషాదం చోటుచేసుకుంది.

- వివరాలు 6లో ▶



పారిపోతున్న వారికి గేటు దగ్గర కాపుకాసి మరీ స్పీచ్‌లు ఇస్తున్నారు!!

వైద్యారోగ్య శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి రాజనర్సింహ, సీఎస్ శాంతికుమారి



ఆరోగ్యశ్రీకి రేషన్ కార్డు నిబంధన సడలింపు?

ఈ అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

- 3 నెలలకోసారి ప్రైవేటు ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించాలి
- మెడికల్ కాలేజీ ఉన్న ప్రతిచోటా పారామెడికల్, నర్సింగ్ కాలేజీలు
- అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు సిద్ధం చేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహతో కలసి వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం వర్తించాలంటే తెల్లరేషన్ కార్డు తప్పనిసరన్న నిబంధనను సడలించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నిబంధన కారణంగా తెల్లరేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన వైద్య, ఆరోగ్య శాఖపై మంత్రి దామోదర రాజనర్సింహతో కలసి సమీక్షించారు. ప్రధానంగా రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అమలు తీరు, నిధుల విడుదలపై సీఎం అధికారులతో చర్చించారు. ప్రతి నెలా ప్రభుత్వ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ

మిగతా 2వ పేజీలో ▶

మళ్లీ 'పౌరసత్వ' రగడ..!

- వారంలో సీఏఏ అమలు ఖాయం
- పౌరసత్వ (సవరణ) చట్టంపై కేంద్రం
- నాలుగేళ్ల కిందే రూపొందిన చట్టం
- వ్యతిరేకిస్తున్న పలు రాష్ట్రాలు, విపక్షాలు
- తీవ్ర ఆందోళనలు, నిరసనలు, కేసులు



సీఏఏను వారంలో దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ ప్రకటించడంతో తాజాగా ఈ అంశం దుమారం రేపుతోంది. 2019లోనే మోదీ సర్కారు సీఏఏ చట్టం చేసినా దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత, ఆందోళనలతో దాని అమలు వాయిదా పడుతూ వస్తోంది. కానీ సీఏఏ అమలుపై బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ సర్కారు పట్టుదలగా ఉందని ఇటీవలి వరుస పరిణామాలు చెబుతున్నాయి.

- వివరాలు 6లో

హెచ్ఎండీఏలో 'ఏసీబీ' ప్రకంపనలు

మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపై దాడుల నేపథ్యం

- ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని అధికారులు, సిబ్బందిలో ఆందోళన
- గత మూడేళ్లలో ప్రణాళికా విభాగం ఇచ్చిన అనుమతులపై ఏసీబీ దృష్టి
- బాలకృష్ణకు ప్రధాన అనుచరులుగా వ్యవహరించిన అధికారులపై నజర్

2లో





దక్షిణ, ఉత్తర డిస్కమ్‌ల డైరెక్టర్ల తొలగింపు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎండీలకు ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ ఆదేశం
- 11 మంది డైరెక్టర్లలో ఇద్దరిని మాత్రమే నిబంధనల ప్రకారం నియమించారు
- వారిద్దరినీ కూడా 2013లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియమించారన్న రిజ్వీ
- వచ్చే నెలలో కొత్త డైరెక్టర్ల నియామకం?

2లో

ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్ పోస్టులకు నోటిఫికేషన్

వివరాలు 2లో

అవసరమైతే సిట్టింగ్‌లూ చేంజ్!

లోక్‌సభకు అభ్యర్థుల ఎంపికపై బీఆర్ఎస్ కసరత్తు

సిట్టింగ్ ఎంపీలు కొందరిని మార్చాలని భావిస్తున్న కేసీఆర్

- ఇప్పటికి ముగ్గురికే గ్రీన్‌సిగ్నల్.. మరో మాజీ ఎంపీకీ పచ్చజెండా
- నిజామాబాద్‌లో పోటీకి ఎమ్మెల్సీ కవిత దూరం
- మెదక్‌లో ఆశావహులు అరడజనుకు పైనే..



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పీఠానికి దూరమైన భారత్ రాష్ట్ర సమితి త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలుపొందాలని భావిస్తోంది. ఎన్నికల సన్నద్ధత, ప్రచారం తదితరాలపై దృష్టి సారిస్తూనే అభ్యర్థుల ఎంపిక పైనా కసరత్తు జరుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటూ కేవలం గెలుపు గుర్రాలనే అభ్యర్థులుగా బరిలోకి దింపాలని పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. అవసరమైన చోట సిట్టింగులను కూడా మార్చే సూచనలు కనిపిస్తున్నాయి. వీలైనంత త్వరగా అభ్యర్థుల ఎంపిక కసరత్తు పూర్తి చేసినా రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల జాబితా వెలువడిన తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థుల పేర్లు వెల్లడించాలని నిర్ణయించారు. అయితే ఇప్పటికే 4 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ అధినేత కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వారు క్షేత్ర స్థాయిలో సన్నాహాలు ముమ్మరం చేస్తున్నారు.

1న కేసీఆర్ అభిప్రాయ సేకరణ

గత ఎన్నికల్లో 17 లోక్‌సభ స్థానాలకు గాను 9 చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందిన సంగతి తెలిసిందే. కాగా మరోసారి మెజారిటీ సీట్ల సాధనపై కన్నేసిన బీఆర్ఎస్.. ఇప్పటికే రాష్ట్రంలోని లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా పార్టీ కేడర్‌తో సన్నాహక సమావేశాలు

మిగతా 5వ పేజీలో ▶

పోయే నేతలను బతిమాలొద్దు

కొత్త నాయకత్వాన్ని తయారుచేద్దాం: కేటీఆర్

3లో

క్లుప్తంగా...

బీసీలకు డిప్యూటీ సీఎం ఇవ్వాలి: ఆర్. కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు ఐదు మంత్రి పదవులు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీలకు అనేక వాగ్దానాలు చేశారని, ముఖ్యమంత్రి ఆ వాగ్దానాలను అమలు చేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గత మంత్రివర్గంలో బీసీల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని, వచ్చే విస్తరణలో బీసీలకు న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలో సమర్థులైన బీసీ నాయకులు ఉన్నారని, వారి సేవలను గుర్తించి పార్టీలో, ప్రభుత్వంలో పదవులు ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దని కోరారు. వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని, ఇంజనీరింగ్ విద్యార్థులకు పూర్తి స్థాయి ఫీజులు మంజూరు చేయాలని, బీసీ బంధు పథకం ద్వారా ప్రతి బీసీ కుటుంబానికి రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరారు. మంత్రివర్గంలో 50 శాతం కోటా కల్పించాలని కోరారు.

1 నుంచి 'కిసాన్ అగ్రి షో 2024'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అతిపెద్ద వ్యవసాయ ప్రదర్శన 'కిసాన్ అగ్రి షో 2024'(2వ ఎడిషన్)కు హైదరాబాద్ సిద్ధమవుతోంది. నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో భాగంగా వ్యవసాయరంగ నిపుణులు, రైతులు, ఔత్సాహికులు పాల్గొననున్నారు. వ్యవసాయ రంగాన్ని నూతన ఒరవడులతో విప్లవాత్మకంగా మార్చేందుకు ఏర్పాటు చేయనున్న ఈ ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభించనున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనకు తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి 140కి పైగా ఎగ్జిబిటర్లు, 20 వేలకుపైగా సందర్శకులు వస్తారని అంచనా. ఈ వేదికలో విజ్ఞాన మార్పిడికిగాను విభిన్న కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు.

'ప్రివెంటివ్ డిటెన్షన్' సలహామండలి నియామకం

సాక్షి, హైదరాబాద్: ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ యాక్ట్) సలహామండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. మండలి చైర్మన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్‌కే జైశ్వాల్, సభ్యులుగా జిల్లా మాజీ జడ్జీలు ఎస్.బజీరంగ్‌బాబు, నాగమారుతిశర్మను నియమించారు. పీడీయాక్ట్ కింద ఎవరినైనా నిర్బంధంలోకి తీసుకునే ముందు పోలీసులు ఈ మండలి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.


'వీఆర్వోలను తిరిగి రెవెన్యూలోకి తీసుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునర్‌నిర్మించాలని, ఇతర శాఖల్లోకి పంపిన వీఆర్వోలను తిరిగి రెవెన్యూలోకి తీసుకోవాలని రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ట్రెసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, గౌతమ్ కుమార్, పూర్వ వీఆర్వో జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీశ్ తదితరులు కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి వీఆర్వోల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ట్రెసా నేతలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ హరలే సుధాకర్‌రావు, కో చైర్మన్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డిస్కమ్‌ల డైరెక్టర్ల తొలగింపు

ఉత్తర, దక్షిణ డిస్కమ్‌లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆ సీఎండీలకు రిజ్వీ ఆదేశం

- 11 మంది డైరెక్టర్లలో ఇద్దరినే నిబంధనల ప్రకారం నియమించారు
- వారిద్దరినీ 2013లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియమించారన్న రిజ్వీ
- వచ్చే నెలలో కొత్త డైరెక్టర్ల నియామకం?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థల్లోని డైరెక్టర్లను ప్రభుత్వం తొలగించింది. వారి తొలగింపు తక్షణమే అమలులోకి వస్తుందని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి మహమ్మద్ రిజ్వీ సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. వీరి స్థానంలో కొత్త వారిని నియమించేందుకు 2012లో జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని డిస్కమ్‌ల సీఎండీలను ఆయన ఆదేశించారు. దక్షిణ, ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థల్లో మొత్తం 11 డైరెక్టర్లు కొనసాగుతున్నారు. ఈ 11 మందిలో కేవలం ఇద్దరు డైరెక్టర్లు టి.శ్రీనివాస్ (డైరెక్టర్, ప్రాజెక్ట్స్), టీఎస్ఎన్‌పీడీసీఎల్ వెంకటేశ్వరరావు (డైరెక్టర్ హెచ్‌ఆర్) మాత్రమే 2013లో నిబంధనలకు అనుగుణంగా డైరెక్టర్లుగా నియామకమయ్యారని పేర్కొన్నారు. మిగిలిన తొమ్మిదిమంది డైరెక్టర్లు ఆరేళ్ల క్రితం ఎలాంటి నిబంధనలు పాటించకుండా నియామకమయ్యారని ఆ ఉత్తర్వుల్లో రిజ్వీ స్పష్టం చేశారు.

తొలగించిన ఆ 11మంది ఎవరెవరంటే..

సోమవారం తొలగించిన 11 మంది డైరెక్టర్లలో దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలోని జె. శ్రీనివాస్‌రెడ్డి(ఆపరేషన్స్), శ్రీనివాస్(ప్రాజెక్ట్స్), కె.రాములు(కమర్షియల్, ఎనర్జీ ఆడిట్), జీ. పార్వతం(హెచ్‌ఆర్), సీహెచ్ మదన్‌మోహన్‌రావు(ప్రణాళిక, నిర్వహణ), ఎస్,స్వామిరెడ్డి(ఐపీసీ అండ్ ఆర్ఏసీ), గంపా గోపాల్(ఎనర్జీ ఆడిట్).. కాగా ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో బి. వెంకటేశ్వరరావు (హెచ్‌ఆర్), పి.మోహన్‌రెడ్డి (ప్రాజెక్ట్స్), పి. సంధ్యారాణి (కమర్షియల్), పి. గణపతి(ఐపీసీ అండ్ ఆర్ఏసీ) ఉన్నారు.

కొత్త డైరెక్టర్ల కోసం దరఖాస్తుల స్వీకరణ.. ఇంటర్వ్యూలు

అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు నిర్వహించి కొత్త డైరెక్టర్లను నియమించనున్నట్లు సమాచారం, ఇప్పటికే జెన్‌కో, ట్రాన్స్‌కోలో డైరెక్టర్లకు ప్రభుత్వం ఉద్వాసన పలికిన విషయం విదితమే. ఇప్పుడు పంపిణీ సంస్థల డైరెక్టర్లకు కూడా ఉద్వాసన పలకడం ద్వారా విద్యుత్ సంస్థలను పూర్తిగా ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు వేసినట్లయింది. ఏళ్ల తరబడి డైరెక్టర్లుగా వాళ్లే కొనసాగడం వల్ల విద్యుత్ సంస్థల్లో పురోగతి లేకుండా పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ పంపిణీ సంస్థలు పెద్ద ఎత్తున నష్టాలు చవిచూస్తున్నప్పటికీ.. నష్టాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై వాళ్లు దృష్టి పెట్టలేదన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా రూ.వేల కోట్లలో నష్టాలు పేరుకుపోయే పరిస్థితులు నెలకొన్నాయన్న వాదనలున్నాయి, కాగా, వచ్చేనెలలో ఈ డైరెక్టర్ల పోస్టుల భర్తీ పూర్తి చేయనున్నట్లు సమాచారం.

ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్ పోస్టులకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (టీఎస్ ట్రాన్స్‌కో), తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పాదన సంస్థ (టీఎస్ జెన్‌కో)లలో కొత్త డైరెక్టర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసింది. ట్రాన్స్‌కో డైరెక్టర్ (గ్రిడ్, ట్రాన్స్‌మిషన్), డైరెక్టర్(ఫైనాన్స్), డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) పోస్టులతోపాటు జెన్‌కో డైరెక్టర్ (జలవిద్యుత్), డైరెక్టర్ (థర్మల్, ప్రాజెక్టులు), డైరెక్టర్ (హెచ్‌ఆర్ అండ్ ఐఆర్), డైరెక్టర్ (కోల్–లాజిస్టిక్స్), డైరెక్టర్ (ఫైనాన్స్–కమర్షియల్) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించింది. దరఖాస్తుదారుల వయసు 62 ఏళ్లలోపు ఉండాలని స్పష్టం చేసింది. ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 1ని చివరి తేదీగా నిర్ణయించింది. త్వరలోనే డిస్కమ్‌ల డైరెక్టర్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక..

ట్రాన్స్‌కో, జెన్‌కో, టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ సంస్థల్లో డైరెక్టర్లుగా సంబంధిత విభాగాల్లో అనుభవం, పరిజ్ఞానం కలిగిన అర్హులైన ఇన్‌సర్వీస్, రిటైర్డ్ విద్యుత్ అధికారులను ప్రభుత్వం ఎంపిక చేయనుంది. డైరెక్టర్ల నియమకానికి మార్గదర్శకాలను జారీ చేస్తూ 2012 మే 14న జారీ చేసిన జీవో 18 ప్రకారం.. ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించి ఒక్కో డైరెక్టర్ పోస్టుకు ముగ్గురి పేర్లతో షార్ట్ లిస్టును రూపొందించి ప్రభుత్వానికి సిఫారసు చేయనుంది. ఈ కమిటీలో ఆయా విద్యుత్ సంస్థల సీఎండీలు కన్వీనర్లుగా, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల శాఖ ముఖ్యకార్యదర్శి, ప్రభుత్వం నామినేట్ చేసే విద్యుత్‌రంగ ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ సభ్యులుగా ఉండనున్నారు. కమిటీ సిఫారసు చేసిన షార్ట్ లిస్టు లోని ముగ్గురు వ్యక్తుల నుంచి ఒకరిని డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

ఇక పదవీ కాలం రెండేళ్లు మాత్రమే..

డైరెక్టర్ పదవి కాలం రెండేళ్లు మాత్రమే. పనితీరును మదించడం ద్వారా సెలక్షన్ కమిటీ సిఫారసులతో మరో ఏడాది, ఆ తర్వాత కూడా ఇంకో ఏడాది పొడిగించడానికి వీలుంది.

సర్పంచ్‌ల పోరాటం న్యాయమైనదే: సంజయ్



కరీంనగర్ టౌన్/గంగాధర: సర్పంచ్‌ల పోరాటం న్యాయమైనదేనని.. తమ పార్టీ అధినాయకత్వంతో మాట్లాడి వారి ఆందోళనకు మద్దతునిస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం చర్లపల్లిలో సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీ కాలం ఫిబ్రవరి 1 నుంచి ముగుస్తున్న నేపథ్యంలో వారి పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాలను, సర్పంచులకు చేసిన మోసాలను సరిదిద్దాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్‌కూడా బీఆర్ఎస్ మాదిరిగా నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు గొడ్డలి పెట్టుగా మారిన 317 జీవోను సవరించాలని బండి సంజయ్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో పదికి పైగా స్థానాల్లో బీజేపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కారు సర్వీసింగ్‌కు పోయిందనీ కేటీఆర్ అంటున్నారనీ.. కానీ రిపేరు కూడా పనికి రాకుండా పోయిందని, పాత సామానోళ్లు కూడా ఆ డొక్కు కారును కొనే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. 'మాట్లాడితే ముస్లింల గురించి మాట్లాడుతున్నవ్ కదా.. హిందూ ధర్మమంటే నీకు గిట్టదు కదా.. మసీదు పెట్టుకోండి' అంటూ కేటీఆర్ నుద్దేశించి బండి విమర్శించారు.

మధ్యస్థంగానే జేఈఈ మెయిన్

- కఠినంగా మ్యాథ్స్, కాస్త క్లిష్టంగా కెమిస్ట్రీ.. ఫిజిక్స్ సులభంగా ఉందన్న విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీలు సహా ఇతర కేంద్ర నిధులతో నడిచే ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ) మెయిన్ పేపర్-1ను ఉదయం, మధ్యాహ్నం కలిపి రెండు షిఫ్టుల్లో నిర్వహించింది. ఈ పరీక్షలో మ్యాథమెటిక్స్ నుంచి కఠినమైన, సుదీర్ఘమైన ప్రశ్నలు వచ్చాయని... కెమిస్ట్రీలో ప్రశ్నల క్లిష్టత మధ్యస్థంగా ఉండగా, ఫిజిక్స్ నుంచి అడిగిన ప్రశ్నలు సులభంగానే ఉన్నట్లు విద్యార్థులు, నిపుణులు పేర్కొన్నారు. మ్యాథమెటిక్స్‌లో గత ప్రశ్నపత్రాల్లో ఇచ్చిన ప్రశ్నల మోడల్స్ ఎక్కువగా పునరావృతమయ్యాయి. ట్రిగ్నోమెట్రీ ఈక్వేషన్స్, బైనామియల్ కోఎఫీషియంట్స్, స్కేలార్ ట్రిపుల్ ప్రొడక్ట్స్ అంశాలను సిలబస్ నుంచి తొలిగించినప్పటికీ వాటిపై ప్రశ్నలు ఇవ్వడం గమనార్హం.

ఆరోగ్యశ్రీకి రేషన్ కార్డు నిబంధన సడలింపు?

▶ మొదటి పేజీ తరువాయి

బిల్లులు విధిగా విడుదల చేయాలన్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులను ప్రతి 3 నెలలకోసారి విడుదల చేసేలా ఒప్పందం కుదుర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుసంధానంగా ఉన్న బోధన ఆసుపత్రులు, ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 270 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని చెప్పారు.

సత్వరమే 'టిమ్స్'పూర్తి చేయాలి...

వరంగల్, ఎల్బీ నగర్, సనత్‌నగర్, అల్వాల్‌లలో చేపడుతున్న తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ ఉన్న ప్రతి చోటా నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కాలేజీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం కామన్ పాలసీని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కొడంగల్‌లో వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు.

డిజిటల్ హెల్త్ ప్రొఫైల్.. డిజిటల్ కార్డులు..

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును ఒక యునిక్ నంబర్‌తో అనుసంధానించాలని.. దీంతో అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యం అందిండానికి వీలవుతుందన్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుతో ఆరోగ్యశ్రీని అనుసంధానం చేయాలని చెప్పారు.

బీబీనగర్ ఎయిమ్స్...

బీబీనగర్ ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం రేవంత్ చెప్పారు. ఎయిమ్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని... తద్వారా ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆసుపత్రులపై భారం తగ్గుతుందన్నారు. ఈ మేరకు ఎయిమ్స్‌ను సందర్శించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవల కోసం అవసరమైతే తానే స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి వివరిస్తానని సీఎం పేర్కొన్నారు. ఉస్మానియా ఆసుపత్రి విస్తరణలో నెలకొన్న సమస్యలను అధికారులు సీఎంకు వివరించగా ఉస్మానియా హెరిటేజ్ భవనానికి సంబంధించిన వ్యవహారం కోర్టులో ఉన్నందున కోర్టు సూచనల ప్రకారం ఎలా ముందుకెళ్లాలో నిర్ణయం తీసుకుందామని సీఎం అన్నారు.

ఫార్మా కంపెనీల సీఎస్‌ఆర్...

మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో హౌస్ కీపింగ్ మెయింటెనెన్స్ బాధ్యతను పెద్ద ఫార్మా కంపెనీలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధులను ఉపయోగించి హౌస్ కీపింగ్ సేవలను మెరుగుపరచాలని సీఎం కోరారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో ఏదో ఒక ఆసుపత్రిని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జూనియర్ డాక్టర్లు, ఆశ వర్కర్లు, స్టాఫ్ నర్సులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు అందించేలా చూడాలన్నారు. 108, 102 సేవల పనితీరుపై వాకబు చేసిన సీఎం.. అవి మరింత మెరుగైన సేవలు అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, కమిషనర్ కర్ణన్, డ్రగ్ కంట్రోల్ డీజీ కమలహాసన్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సీఈఓ విశాలాచ్చి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం కడదాం..

'సాక్షి ఎక్సలెన్స్ అవార్డు'లకు ఎంట్రీల ఆహ్వానం ● చివరి తేదీ: మార్చి 30, 2024



సాక్షి,హైదరాబాద్: 'ప్రతిభ ఏదైనా పట్టం కడదాం. రంగం ఏదైనా ప్రతిభే కొలమానం.'అంటూ ప్రతి ఏటా వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి 'సాక్షి'ఎక్సలెన్స్ అవార్డులను ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. త్యాగం, నైపుణ్యం, ప్రతిభ, కళ ఎక్కడ ఏ రూపంలో ఉన్నా.. 'సాక్షి' వెలికితీసి గౌరవిస్తోంది. సమాజ హితం కోరే ముఖ్యులతో ఏర్పాటైన 'జ్యూరీ'అవార్డుల కోసం వచ్చిన ఎంట్రీల నుంచి విజేతలను నిర్ణయించి ప్రకటిస్తోంది. ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా 'సాక్షి' ఎక్స్‌లెన్స్ అవార్డుల'కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. 2023కు సంబంధించి ఎంట్రీలు పంపవచ్చు. అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైంది. ఆసక్తిగల వారు మార్చి 30, 2024 సాయంత్రం 6 గంటల వరకు ఎంట్రీలను పంపించవచ్చు. ఈసారి కూడా ఎంట్రీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే వెసులుబాటు ఉంది. ప్రతిభను గుర్తెరిగిన ఇతరులెవరైనా.. ఆయా వ్యక్తులు, సంస్థల తరఫున కూడా ఎంట్రీలను పంపవచ్చు. కొన్ని అంశాల్లో యువతరానికి, ప్రవాస భారతీయులకు కూడా అవార్డులు ఉన్నాయి. సందర్భాన్ని బట్టి 'జ్యూరీ ప్రత్యేక ప్రశంస' కూడా లభించవచ్చు. నైపుణ్యాలను ప్రశంసించడం, సేవలను కొనియాడటం, సాధనను అభినందించడం ఎవరైనా చేయదగినవే. ఈ భావన కలిగినవారంతా తమ ఎరుకలో ఉన్న ఇటువంటి ప్రతిభామూర్తులను గుర్తించి, వారి పేర్లను ప్రతిపాదిస్తూ అవార్డుల కోసం ఎంట్రీలను పంపుతారని 'సాక్షి' అభిలషిస్తోంది. 'సాక్షి' చేస్తున్న ఈ కృషికి అందరూ చేయూతనివ్వండి. నామినేషన్‌ల ఎంట్రీలను నేరుగా అప్లికేషన్‌ఫారంలో ఇచ్చిన చిరునామాకు పంపించవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు www.sakshiexcellenceawards.com వెబ్‌సైట్‌కు లాగిన్ కావచ్చు. పూర్తి వివరాల కోసం పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 040–23256134 నంబర్‌పై గానీ, మెయిల్ ఐడీలో గానీ సంప్రదించవచ్చు.

sakshiexcellenceawards@sakshi.com

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

కేటగిరీలు ఇలా:

ప్రధాన అవార్డులు (జ్యూరీ బెస్ట్)

- ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్
- ఎక్సలెన్స్ ఇన్ సోషల్ డెవలప్ మెంట్
- ఎక్సలెన్స్ ఇన్ హెల్త్ కేర్ – వ్యక్తి/ సంస్థ
- ఎక్సలెన్స్ ఇన్ ఫార్మింగ్
- బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్– లార్జ్ స్కేల్
- బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ – స్మాల్/ మీడియం
- ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఇండివిడ్యువల్
- ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్– కార్పొరేట్
- ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఎన్‌జీఓ

యంగ్ అచీవర్స్ (జ్యూరీ బెస్ట్)

- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ – ఎడ్యుకేషన్
- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ – సోషల్ సర్వీస్
- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఇండివిడ్యువల్
- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – కార్పొరేట్
- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఎన్‌జీఓ

సంయుక్త సర్వే చేయాల్సిందే

- పోలవరం ముంపుపై తెలంగాణ పట్టు
- త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు పీపీఏ, ఏపీ, తెలంగాణ అంగీకారం
- ప్రాజెక్టు కార్యాలయం తరలింపునకు తెలంగాణ సమ్మతి

సాక్షి, హైదరాబాద్: పోలవరం బ్యాక్ వాటర్ వల్ల తలెత్తే ముంపుపై సంయుక్త సర్వే చేయాల్సిందేనని తెలంగాణ స్పష్టం చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని సీడబ్ల్యూసీకి చెందిన కృష్ణా, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ (కేజీబీవో)లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమావేశం జరిగింది. పీపీఏ చైర్మన్ శివనందన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏపీ నుంచి ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ సి.నారాయణరెడ్డి హాజరుకాగా.. తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ అంతర్‌రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్ కుమార్, కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలవరం బ్యాక్ వాటర్ వల్ల కలిగే ముంపుపై సంయుక్త సర్వే చేపట్టాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)తో పాటు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టుతో ముంపు ఉంటుందని ఏపీ అందించిన డేటా ఆధారంగానే తేలిందని, ఈ నేపథ్యంలో వర్షాకాలంలోపు సంయుక్త సర్వే చేపట్టి, ముం పునకు గురయ్యే ప్రాంతాల రక్షణకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ కోరింది. దీనిపై తొలుత అభ్యంతరం వ్యక్తం చేసిన ఏపీ, ఎట్టకేలకు అంగీకారం తెలిపింది. సంయుక్త సర్వే చేయడానికి అవసరమైన లాంఛనాలు పూర్తిచేయడానికి వీలుగా త్రిసభ్య కమిటీ (తెలంగాణ, ఏపీ, పీపీఏలకు చెందిన చీఫ్ ఇంజనీర్లు) వేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు త్వరలోనే కమిటీని వేసి, మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇక పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) కార్యాలయాన్ని రాజమహేంద్రవరానికి తరలించడానికి సమ్మతి తెలుపుతూ తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇచ్చిన లేఖను తెలంగాణ ప్రతినిధులు పీపీఏకి అందించారు. కాగా, పీపీఏ క్యాంపు కార్యాలయం మాత్రం హైదరాబాద్‌లోనే ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు గెజిట్ ప్రకారం పీపీఏలో తమ రాష్ట్రం నుంచి కూడా అధికారులను నియమించాలని తెలంగాణ కోరింది.

2026 నాటికి దేవాదుల పూర్తిచేస్తాం

- ప్రాధాన్య జాబితాలో రాజీవ్ బీమా, ఎస్సారెస్పీ–2, ఇందిరమ్మ వరద కాలువ
- సీడబ్ల్యూసీ సమీక్షలో నివేదించిన తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: భూసేకరణతో పాటు పలు సమస్యలు ముడిపడి ఉన్నందున 2026కి దేవాదుల ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేసామని కేంద్రానికి తెలంగాణ వెల్లడించింది. సోమవారం సత్వర సాగునీటి వినియోగ పథకం (ఏఐబీపీ) ప్రాజెక్టులపై కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) సమీక్ష చేసింది. జగన్నాథపూర్ ప్రాజెక్టు కోసం రూ.100 కోట్లు ఇచ్చినా.. హెడ్‌వర్క్ పూర్తి చేయలేదని, ఆ నిధులను రుణంగా మార్చుకోవాలని సీడబ్ల్యూసీ ప్రతిపాదించింది. దీంతో రెండు, మూడునెలల్లో హెడ్‌వర్క్ పూర్తి చేస్తామని తెలంగాణ అధికారులు నివేదించగా.. సీడబ్ల్యూసీ అధికారులు అంగీకరించారు. ఖమ్మంలో ఎస్సారెస్పీ రెండో దశ ఆయకట్టు పనులు చేయలేమని, భూసేకరణ ఎకరానికి రూ.80 లక్షల దాకా ఉండటం వల్ల సాధ్యంకాదని అధికారులు నివేదించగా.. సీడబ్ల్యూసీ దీనికి అంగీకారం తెలిపింది. ఇందిరమ్మ వరద కాలువను ఎప్పటిలోగా పూరి చేస్తారని సీడబ్ల్యూసీ అధికారులు ఆరా తీయగా.. భూసేకరణ కేసులతో ఈ పథకం పనులు ముడిపడి ఉన్నాయని, సాధ్యమైనంత త్వరలో పూర్తిచేస్తామని అధికారులు నివేదించారు. దేవాదుల, రాజీవ్ బీమా, ఇందిరమ్మ వరద కాలువ, ఎస్సారెస్పీ రెండో దశను ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో ప్రభుత్వం చేర్చనుందని, రానున్న బడ్జెట్లో నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు. పదిరోజుల్లోగా ఈ ప్రాజెక్టును ఏ విధంగా పూర్తిచేస్తామనే దానిపై నివేదికను సమర్పిస్తామని తెలిపారు. సమావేశంలో తెలంగాణ నుంచి కరీంనగర్ ఈఎన్సీ శంకర్‌తో పాటు ఆయా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏలో 'ఏసీబీ' ప్రకంపనలు

మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపై దాడుల నేపథ్యం

- ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని అధికారులు, సిబ్బందిలో ఆందోళన.. గత మూడేళ్లలో ప్రణాళికా విభాగం ఇచ్చిన అనుమతులపై ఏసీబీ దృష్టి
- బాలకృష్ణకు ప్రధాన అనుచరులుగా వ్యవహరించిన అధికారులపై నజర్

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏలో ఏసీబీ దాడులు ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపై దాడుల నేపథ్యంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోననే ఆందోళన నెలకొంది. బాలకృష్ణ ఇంటిపై దాడులు అనంతరం ఏసీబీ అధికారులు తమ దర్యాప్తులో భాగంగా హెచ్‌ఎండీఏపై దృష్టి సారించారు. గత మూడేళ్లలో ప్రణాళికా విభాగం నుంచి ఇచ్చిన అనుమతులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం సెలవు దినమైనప్పటికీ ప్రణాళికా విభాగానికి చెందిన ప్లానింగ్ అధికారులు, ఏపీఓలు, జేపీలు, ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. మరోవైపు ఈ మూడేళ్ల అనుమతులకు సంబంధించిన ఫైళ్లను హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్‌కు కూడా అధికారులు అందజేశారు. శంకర్‌పల్లి, శంషాబాద్, ఘటకేసర్, మేడ్చల్ జోన్‌లలో పెద్ద సంఖ్యలో వివిధ రకాల అనుమతుల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. టీఎస్‌బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొందరు అధికారులు 'డాక్యుమెంట్‌ల పరిశీలన'సాకుతో అక్రమార్జన కోసం నిబంధనలను ఉల్లంఘించి అనుమతులు ఇచ్చారు. కన్జర్వేషన్ జోన్‌లలో ఉన్న భూములను యథేచ్ఛగా కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌లలోకి మార్చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ పరిధిలోనూ ఇలాంటి అక్రమాలు చాలా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికలకు ముందు వట్టినాగులపల్లి ప్రాంతానికి చెందిన సుమారు 70 భూమార్పిడి ఫైళ్లకు ఆగమేఘాల మీద అనుమతులు ఇవ్వడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అదే తరహాలో మరిన్ని అక్రమ అనుమతులు ఇచ్చినట్లు లభించిన సమాచారం ఆధారంగా ఏసీబీ అధికారులు హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగంపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఔటర్ సమీపంలో ఉన్న మణికొండ, పుప్పాలగూడ, కోకాపేట్, నార్సింగి, మంచిరేవుల, తదితర ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రోత్ కారిడార్‌లో భవిష్యత్తులో వాహనాల రద్దీని నియంత్రించేందుకు సమాంతర రహదారుల కోసం కేటాయించిన భూముల్లో పలుచోట్ల ఇలాంటి ఉల్లంఘనలు జరిగినట్లు తెలిసింది. మరోవైపు బాలకృష్ణ ఇంటిపై దాడులు, అతడి అరెస్టు, రిమాండ్ అనంతరం వెలుగులోకి వచ్చిన అక్రమ ఆస్తులకు సంబంధించి రోజుకో కొత్త విషయం బయట పడుతుండడంతో హెచ్‌ఎండీఏ అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

అడ్డగోలుగా అనుమతులు

ప్రస్తుతం ఏసీబీ.. బాలకృష్ణకు నమ్మిన బంట్లుగా ఉండి ఆయనకు అన్ని విధాలుగా సహకరించిన కొందరు అధికారులపై ప్రధానంగా ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. లే అవుట్‌లు, భవన నిర్మాణాలు, ప్రత్యేకించి హైరైజ్ భవనాల కోసం అడ్డగోలుగా అనుమతులు ఇచ్చారు. కొన్నిచోట్ల పర్యావరణ సంస్థలు విధించిన ఆంక్షలను సైతం పక్కన పెట్టి, నీటి వనరులు ఉన్న చోట భవనాలకు అనుమతులిచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే పారిశ్రామిక ప్రాంతాల్లో నివాస సముదాయాలు వెలిశాయి. ఇలాంటి అనుమతులను ఇచ్చేందుకు ఒకరిద్దరు ఏపీఓ స్థాయి అధికారులు బాలకృష్ణకు ప్రధాన అనుచరుల మాదిరి వ్యవహరించినట్లు సమాచారం. ఈ క్రమంలో వారు సైతం రూ.కోట్లలో అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక కీలకమైన జోన్‌లో పని చేస్తున్న ఒక ఏపీఓ బాలకృష్ణకు అత్యంత సన్నిహితుడిగా ఉండి అన్ని రకాల వ్యవహారాలు చక్కబెట్టినట్లు తెలిసింది. దీంతో ఏసీబీ అధికారులు ఆ ఏపీఓపై ప్రధానంగా దృష్టి సారించినట్లు సమాచారం. మరోవైపు బాలకృష్ణపై ఏసీబీ దాడుల అనంతరం ఒకరిద్దరు వ్యక్తిగత కారణాలు చూపుతూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం గమనార్హం.

ఏకపక్షంగా అనుమతులు ఇచ్చారు

- హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణపై ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు
- హైకోర్టుకు తప్పుడు అఫిడవిట్ ఇచ్చారంటున్న సూర్యప్రకాశ్

సాక్షి, హైదరాబాద్ : పుప్పాలగూడలోని భూమి విషయంలో హెచ్‌ఎండీఏ డైరెక్టర్ హోదాలో శివబాలకృష్ణ ఏకపక్షంగా రఘురామ్ ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి అనుమతులు ఇచ్చారంటూ పి.సూర్యప్రకాశ్ ఆరోపించారు. ఏసీబీ డీజీ సీవీ.ఆనంద్ అందుబాటులో లేకపోవడంతో ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుదీంద్రకు ఫిర్యాదు, తన వద్ద ఉన్న ఆధారాలను సోమవారం పి.సూర్యప్రకాశ్ సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా భూమి విషయంలో శివబాలకృష్ణ అవినీతికి పాల్పడడంపై ఏసీబీలో ఫిర్యాదు చేశాం. పుప్పాల్‌గూడలో మాకు సర్వే నంబర్ 447లో 6 ఎకరాల 36 గుంటల భూమి ఉంది. దానిలో హెచ్‌ఎండీఏ నుంచి అక్రమంగా రఘురామ్ ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు టెక్నికల్ అప్రూవల్స్ ఇచ్చారు. ఈ భూమి విలువ రూ.500 నుంచి రూ.600 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పుడు ఆ భూమిలో రఘురామ్ కన్‌స్ట్రక్షన్స్, ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ కలిపి జాయింట్ వెంచర్ చేస్తున్నారు. రఘురామ్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని డా. సచ్చితానందరావు, ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని ప్రదీప్‌రెడ్డి ఉన్నారు. 24 అంతస్థుల నుంచి 36 అంతస్థుల వరకు రెసిడెన్షియల్ టవర్స్ కడుతున్నారు. అయితే, 2022లో హైకోర్టులో కేసు నడుస్తుండగా కౌంటర్ అఫిడవిట్‌ను శివబాలకృష్ణ ఫైల్ చేశారు. 'అది ఫాల్స్ అఫిడవిట్ అని మేం ఏసీబీకి ఫిర్యాదు చేశాం. శివబాలకృష్ణ అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాలన్నీ అబద్ధాలని ఏసీబీ అధికారులకు దృష్టికి తెచ్చాం. రేపు సీవీ ఆనంద్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం. మేం ఇచ్చిన ఫిర్యాదును ఇన్‌వార్డ్‌లో రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు.

సర్వీసు నుంచి తొలగించేందుకు చర్యలు !

ఏసీబీకి చిక్కిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ బాలకృష్ణను సర్వీసు నుంచి తొలగించేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు యోచిస్తున్నట్టు తెలిసింది. ఈ అంశంపై హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులు న్యాయపరమైన సలహాలు తీసుకుంటున్నట్టు సమాచారం. మరోవైపు బాలకృష్ణ హామీతో ఫైల్స్‌పై సంతకాలు చేసిన ఉద్యోగులకు ఏసీబీ నోటీసులు పంపుతున్నట్టు తెలిసింది.

క్లుప్తంగా...

విధులకు టైంకు రాకపోతే ఎలా?

- పీసీబీ ఉద్యోగులపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం



వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సురేఖ

సాక్షి, హైదరాబాద్, సనత్‌నగర్: ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడం, నిర్ణీత సమయానికి ఆఫీసుకు రాకుండా ఇష్టారీతిన వ్యవహరించే ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) అధికారులు, సిబ్బంది పనితీరులో నిర్లక్ష్యం సహించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం సనత్ నగర్‌లోని టీపీసీబీ కార్యాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కార్యాలయంలోని ప్రతి సెక్షన్‌లోనూ కలియ తిరిగి ఫైళ్ళను పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను అడిగి తెలు సుకున్నారు. కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న పరిశోధనలు, చర్యల పురోగతిని గురించి ఆరా తీశారు. బయోమెట్రిక్ హాజరు పట్టికను పరిశీలించి సరైన వివరాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

ప్రమాణ స్వీకారానికి వచ్చి తిరుగుముఖం

చైర్మన్ అందుబాటులో లేక వెనుదిరిగిన కోదండరాం, ఆమెర్ అలీఖాన్

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన ప్రొఫెసర్ కోదండరాం, ఆమెర్ అలీఖాన్ ప్రమాణ స్వీకారం చేసేందుకు సోమవారం శాసనమండలికి వచ్చారు. అయితే శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో రెండు గంటల పాటు వేచి చూసి తిరిగి వెళ్లిపోయారు. మండలి చైర్మన్ గొంతు నొప్పితో బాధ పడుతున్నందున రాలేక పోతున్నారని మండలి సచివాలయ సిబ్బంది కోదండరాంకు తెలిపారు. చైర్మన్‌కు ముందస్తు సమాచారం ఇవ్వకుండా వచ్చామని, మంగళవారం ఉదయం 9.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తామని మండలి కార్యదర్శికి కోదండరాం, ఆమెర్ అలీఖాన్ సమాచారం ఇచ్చి తిరుగుముఖం పట్టారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో కోదండరాం మాట్లాడుతూ తమకు కూడా రాజ్యాంగ నిబంధనలు తెలుసని, కొన్ని అంశాలను పదే పదే వివాదం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు.

రాష్ట్రాల ఆస్తులు విభజించండి

కేంద్ర హోంశాఖకు మల్లు రవి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: రెండు రాష్ట్రాల అంగీకారం మేరకు ఢిల్లీలోని తెలంగాణ, ఏపీ ఆస్తులను విభజించాలని ఢిల్లీలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి కేంద్ర హోంశాఖకు విజ్ఞప్తి చేశారు. తెలుగు రాష్ట్రాల ఆస్తుల విభజనపై సోమవారం కేంద్ర హోంశాఖ కార్యాలయంలో అదనపు కార్యదర్శితో మల్లు రవి, తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ సమావేశమయ్యారు. అనంతరం మల్లు రవి తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలోని ఆస్తుల పంపకాలపై ఇప్పటికే రెండు రాష్ట్రాలు తమ ప్రతిపాదనలను కేంద్ర హోంశాఖకు పంపాయని, త్వరగా ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరామన్నారు. అందుకు హోంశాఖ కార్యదర్శి సముఖత వ్యక్తం చేశారని తెలిపారు.

రేవంత్‌రెడ్డి పీపుల్స్ సీఎం

ఏఐసీసీ మీడియా ఇన్‌చార్జి సునీతాపాల్

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల కోసం ఆలోచిస్తున్నారని, అందుకే ఆయన పీపుల్ సీఎం అని ఏఐసీసీ మీడి యా ఇన్‌చార్జి సునీతాపాల్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో అధికార ప్రతినిధులు భవానిరెడ్డి, జ్ఞానసుందర్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. సర్కార్ ఏర్పడి ఇంకా 50 రోజులు కూడా కాలేదు... అప్పుడే విపక్షాలు విమర్శలు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తా మని ఆమె స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబం మొన్నటి వరకు ప్రజలను దోచుకున్నదని ఆరోపించారు. భవానిరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ 30 లక్షల మందికి ఉద్యోగాలు ఎక్కడిచ్చారో ఎమ్మెల్సీ కవిత చెప్పాలని డిమాండ్ చేశారు. జ్ఞానసుందర్ మాట్లాడుతూ వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని స్పష్టం చేశారు.

ఫిబ్రవరి 8, 9 తేదీల్లో బీసీల చలో ఢిల్లీ

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన జాజుల

కవాడిగూడ (హైదరాబాద్): కులగణనపై బీజేపీ తన వైఖరి వెల్లడించకుండా బీసీల పట్ల వివక్ష చూపుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో చేపట్టనున్న బీసీల చలో ఢిల్లీ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి కులగణన చేపట్టాలని బీసీలు కోరుతుంటే.. బీజేపీ ఇంటింటికీ తిరిగి అక్షింతలు పంచడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఫిబ్రవరి 8న ఢిల్లీలోని పార్లమెంటు వద్ద బీసీల ధర్నా, 9న జాతీయ ఓబీసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు జాజుల వెల్లడించారు.

పోయే నేతలను బతిమాలొద్దు

- కొత్త నాయకత్వాన్ని తయారు చేద్దాం
- కారు ఓవర్ లోడ్ అయింది.. దిగిపోయే వాళ్లను వెళ్లనిద్దాం
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం అధ్వానం
- ఎంపీ ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ వస్తారు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



చేవెళ్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

చేవెళ్ల, వికారాబాద్: 'ఒకరిద్దరు నాయకులు పార్టీ నుంచి పోయినంత మాత్రాన బాధ పడేది ఏమీ లేదు.. మీరు అండగా ఉండండి చాలు.. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల్లో చాకుల్లాంటి కొత్త నాయకులను తయారు చేసుకుందాం'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యా నించారు. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో సోమవారం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''ప్రజ లు పదేళ్లు మనకు అధికారం ఇచ్చారు. వంద స్పీడ్‌తో కారు పాలన జోరుగా సాగింది. కారు ఇప్పుడు సర్వీసింగ్‌కు వెళ్లింది అంతే.. బాధపడాల్సిన పనిలేదు. గ్రామాల్లో కారు ఓవర్ లోడ్ అయిన మాట వాస్తవమే. అందుకే దిగిపోయే ముగ్గురు, నలుగురు నాయకులను వెళ్లిపోనిద్దాం,. పోయే వాళ్లను బతిమిలాడాల్సిన పని లేదు''అని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గైర్హాజరు

చేవెళ్లలో నిర్వహించిన సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య గైర్హాజరయ్యారు. ఆదివారం రాత్రి ఇంట్లో మెట్లపై కాలుజారి పడటంతో గాయమైందని అందుకే ఆయన సమావేశానికి రాలేకపోయారని కేటీఆర్ తెలిపారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేవీ రాడార్ ఏర్పాటు ప్రమాదకరం

''వికారాబాద్ జిల్లాలో ఏర్పాటు చేస్తామంటున్న వెరీలో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ప్రజలకు, వన్య ప్రాణులకు ఎంతో ప్రమాదకరం.. దీని నుంచి వెలువడే రేడియేషన్ ఈ ప్రాంతంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందుకే మేము అధికారంలో ఉన్న పదేళ్ల పాటు నేవీ రాడార్ ఏర్పాటును అడ్డుకున్నాం 'అని కేటీఆర్ తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు వేల ఎకరాల భూమి తీసుకుని.. 12 లక్షల చెట్లు నరికేసి ఇక్కడ ఏర్పాటు చేసే నేవీ రాడార్ స్టేషన్‌తో ఈ ప్రాంతానికి ఒరిగేదేమిటని ప్రశ్నించారు. ఈసీ, మూసీ నదులకు జన్మస్థానమైన ఈ ప్రదేశంలో ఇలాంటి రాడార్ స్టేషన్ ఏర్పాటు తగదని సూచించారు.

అలాగైతే కవితపై అసలు కేసే పెట్టేవారు కాదు

బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని అందుకే కవితను అరెస్టు చేయలేదని కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారని, బీజేపీతో తాము జతకలిస్తే అసలు కవితపై కేసే పెట్టి ఉండేవారు కాదని కేటీఆర్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తీస్మార్‌ఖాన్‌లు.. ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, బండి సంజయ్, రఘునందన్ పోటీ చేసిన చోట కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థులను నిలబెడితే.. వారిని ఓడించింది బీఆర్‌ఎస్ కాదా..? అని ప్రశ్నించారు.

హామీలపై కాంగ్రెస్‌ను వదిలేది లేదు..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే వదిలిపెట్టేది లేదు.. బట్టలు ఊడదీసి చేవెళ్ల గడ్డపైనే నిలబెడుదాం అని కేటీఆర్ అన్నారు. గడిచి న యాభై రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ కావాల్సినంత వ్యతిరేకతను మూటకట్టుకుందని తెలిపారు. మార్పు కావాలనుకున్న ప్రజలే ఇప్పుడు బాధపడుతున్నారని, రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాల న్న ప్రభుత్వం వచ్చిందని ఆవేదన చెందుతున్నారని చెప్పారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సాధారణ కార్యకర్త కన్నా అధ్వానంగా ఉందని కేటీఆర్ విమర్శించారు. ఫిబ్రవరి 1న ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మన నాయకుడు కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి వస్తారని కేటీఆర్ వివరించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై అకారణంగా నోరు పారేసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెంటనే ఆయనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు డిమాండ్ చేశారు. సందీప్‌రెడ్డితో కేటీఆర్ సోమవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలను అడ్డుకుంటామనీ, బీఆర్‌ఎస్ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసానిచ్చారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కోమటిరెడ్డి ప్రతి ఒక్కరిపైనా నోరు పారేసుకుంటున్నారని ఆరోపించారు. రైతుబంధు అడిగితే రైతులను చెప్పుతో కొట్టమని తన అహంకారాన్ని బయట పెట్టుకున్న మంత్రి తాజాగా జెడ్పీ చైర్మన్‌పై అదే నోటి దురుసు చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి తీరును ప్రజలు గమనిస్తున్నారనీ, ఆయనకు ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

ముగ్గురు 'పెద్దలు' ఎవరో!

▶ మొదటి పేజీ తరువాయి

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో సీఎం భేటీ, తదితర పరిణామాలను ప్రస్తావిస్తున్నా యి. అయితే బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం మిత్రపక్షం ఎంఐఎం సహకారంతో ఒక సభ్యుడిని సునాయాసంగా గెలిపించుకుంటామనే ధీమా వ్యక్తం చేస్తోంది.

ఒకటి ఢిల్లీకి, మరొకటి స్థానికులకు

రెండు రాజ్యసభ స్థానాలు ఖచ్చితంగా దక్కనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఒక స్థానాన్ని ఢిల్లీ కోటాలో అధిష్టానం చెప్పిన వారి కోసం రిజర్వు చేయాలని భావిస్తోంది. పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీని రాష్ట్రం నుంచి లోక్‌సభకు పోటీ చేయాల్సిందిగా కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ ఇప్పటికే తీర్మానం ఆమోదించింది. అలా వీలు కాని పక్షంలో కనీసం ఇక్కడ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించాలని పార్టీ నేతలు కోరుతున్నారు. ఇందుకు కూడా సోనియా మొగ్గు చూపని పక్షంలో ఇతర రాష్ట్రాలకు చెందిన జాతీయ స్థాయి నేతల్లో పార్టీ ఎంపిక చేసే ఒకరిని తెలంగాణ నుంచి పెద్దల సభకు పంపాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది.

నేడు టీపీసీసీ పీఏసీ భేటీలో చర్చ!

మరో సీటుపై పార్టీ నేతలు పలువురు ఆశలు పెట్టుకున్నారు. అయితే అభ్యర్థి ఎంపికలో సామాజికవర్గ సమీకరణలు కీలకం కావడంతో ఎస్సీ మాదిగ లేదా రెడ్డి లేదా బీసీలకు చాన్స్ దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. గాంధీభవన్‌లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ జరగనుంది. ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల సన్నద్ధత, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలతో పాటు రాజ్యసభకు కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన చర్చ కూడా జరిగే అవకాశముందని చెబుతున్నారు.

అరడజనుకు పైగానే ఆశావహులు

రాష్ట్రం నుంచి రాజ్యసభలో అడుగు పెట్టడంపై కాంగ్రెస్ నుంచి పలువురు సీనియర్ నేతలు ఆసక్తి చూపుతున్నారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మాజీ కేంద్ర మంత్రులు బలరామ్ నాయక్, రేణుకా చౌదరి, సర్వే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు చిన్నారెడ్డి, వంశీచంద్‌రెడ్డి, సంపత్ కుమార్, వీహెచ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

బీఆర్‌ఎస్ తరఫున ఎవరో?

రాష్ట్రం నుంచి ఏడుగురు సభ్యులు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తుండగా అందరూ బీఆర్‌ఎస్‌కు చెందిన వారే కావడం గమనార్హం. ప్రస్తుతం ముగ్గురు రిటైర్ కానుండగా ఒక సీటు మాత్రం తిరిగి పార్టీకి దక్కనుంది. ఈ స్థానంలో తనకు మరోమారు అవకాశం ఇవ్వాల్సిందిగా వద్దిరాజు రవిచంద్ర కోరుతున్నారు. 2018 ఏప్రిల్ 13న రాజ్యసభ ఎంపీగా ఎన్నికైన బండా ప్రకాశ్ తన ఆరేళ్ల పదవీకాలం పూర్తి కాకుండానే 2022 మే 30న తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన ప్రకాశ్ ప్రస్తుతం మండలి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, ఖాళీ అయిన రాజ్యసభ సీటుకు బీఆర్‌ఎస్ తరఫున వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనకు సుమారు రెండేళ్ల పాటు మాత్రమే రాజ్యసభ ఎంపీగా అవకాశం దక్కినందున మరోమారు చాన్స్ ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. అయితే సామాజికవర్గ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని బీసీ వర్గానికి చెందిన వారికి బీఆర్‌ఎస్ అవకాశం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్‌ఎస్ తరఫున డాక్టర్ కె.కేశవరావు (మున్నూరు కాపు), దామోదర్ రావు (వెలమ), పార్థసారథి రెడ్డి (రెడ్డి), కేఆర్ సురేశ్‌రెడ్డి (రెడ్డి) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్నూరుకాపు, ముదిరాజ్, యాదవ లేదా గౌడ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కేసీఆర్ ఎంపిక చేస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే మాజీ టీపీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు మరికొన్ని పేర్లు కూడా పరిశీలనకు వచ్చే అవకాశముందని అంటున్నారు.

విద్యుత్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

వేసవిలో కోతలు లేకుండా కరెంటు సరఫరా చేస్తాం: భట్టి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరాపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆరోపించారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇలాంటి ప్రచారం చేస్తోందని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. వచ్చే వేసవిలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని, ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఆయన సోమవా రం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రం అంధకారంలో ఉండాలని కలలుగంటున్న బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నిజ స్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో విద్యుత్ సరఫరా గత సంవత్సరంతో పోలిస్తే 2023 డిసెంబర్ 07 నుంచి మెరుగుపడిందని వివరించారు. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో ప్రతిరోజూ సగటున 207.7 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశామని, 2022 డిసెంబర్లో సగటున 200 మిలియన్ యూనిట్లు మాత్రమే సరఫరా చేశారని చెప్పారు. వచ్చే నెల ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి తగిన చర్యలు తీసుకున్నామని, వేసవిని దృష్టిలో పెట్టుకొని 1,200 మెగావాట్ల విద్యుత్ ను రిజర్వు చేసుకున్నట్లు భట్టి చెప్పారు.

కేసీఆర్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

బీజేపీ నేత మురళీధర్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీఆ ర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీ ఆర్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మ క్కు అయిందని బీజేపీ సీనియర్ నేత పి.మురళీధర్ రావు ఆరోపించారు. ఈ రెండు పార్టీల నేత ల పరస్పర విమర్శలు ఒక నాటకమని, వీరంతా సెటిల్మెంట్లు చేసుకుంటున్నారని అన్నారు. సోమవా రం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్, సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ అవినీతి విచారణలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. కాళేశ్వరం, ఆర్‌ఆర్‌ఆర్ టోల్, ధరణి స్కాంలపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోవ డంలేదని, దీని వెనక ఏదో రహస్యం దాగి ఉందని ఆరోపించారు.

పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



పాలమూరు ప్రజాప్రతినిధులతో సచివాలయంలో సమావేశమైన మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేయా లని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం సచివాలయంలో పాలమూరు-రంగారెడ్డి, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులపై మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి(మహబూబ్‌నగర్), వాకిటి శ్రీహరి ముదిరాజ్(మక్తల్), జి.మధుసూదన్ రెడ్డి (దేవరకద్ర), డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి (నారాయణపేట)లతో కలిసి, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొడంగల్, నారాయణ పేట, మక్తల్ నియోజవర్గాలకు నీరందించడానికి వీలుగా నారాయణపేట-కొడంగల్ ఎత్తి పోతల పథకం చేపట్టడానికి వీలుగా 2014 మే 28వ తేదీన ఉత్తర్వులుజారీ చేశారని, ఆ ప్రాజె క్టును చేపడితే కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలకు నీరందేదని, దీనికోసం రూ.133.86 కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలన అనుమతినిచ్చినా, ఆ పథకాన్ని చేపట్టలేదని, నివేదించారు. తక్షణమే ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులకు అనుమతినివ్వా లని వీరు నివేదించగా... మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే పనులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రేవంత్‌రెడ్డి పట్టుదలతో 2014 మేనెలలోనే నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతలకు ప్రభుత్వం పరిపాలన అనుమతినిస్తే... గత ప్రభుత్వం పక్కన పెట్టిందని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం పథకాన్ని చేపట్టి ఉంటే లక్ష ఎకరాలకు పైగా నీరందేదని గుర్తు చేశారు.కోయిల్‌సాగర్ ప్రాజెక్టు సామర్థ్యం మరో రెండు టీఎంసీలు పెంచాలని మంత్రి ఉత్తమ్‌ను కోరామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. 2014లోపే ఉమ్మడి జిల్లాలో 70 శాతం ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని, 7 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టును పక్కనపెట్టి, రూ.50 వేల కోట్లతో రీ ఇంజనీరింగ్ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చేపట్టారని, రూ.30 వేల కోట్లు వెచ్చించినా ఒక్క ఎకరాకు ఈ పథకంతో నీరందలేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే జీఓ నంబరు 69ని గత ప్రభుత్వం పక్కనపెట్టిందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి మండిపడ్డారు.

పాలమూరులో వలసలు తగ్గలేదు

మహబూబ్‌నగర్ అంతా పచ్చగా లేదని, ఇంకా నీటి గోసతో అల్లాడుతుందని మహబూబ్ నగర్‌లో ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మంత్రిని కలిసిన అనంతరం సచివాలయ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో వారు మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మహబూబ్‌నగర్ జిల్లాకు చేసిందని శూన్యమని నిప్పులు చెరిగారు. వలసలు తగ్గలేదని..వలపోత ఆగలేదన్నారు. ముంబై బస్సు రావడం ఆగలేదు...పనుల కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లకా తప్పలేని పరిస్థితి అని ధ్వజమెత్తారు. ఏదో చేశామని చెబుతున్న బీఆర్‌ఎస్ ఏం చేసిందో చెప్పాలని నిలదీశారు. ఒక్క పిల్ల కాల్వ నుంచి ఒక ఎకరానికి నీళ్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేపర్లు, మాటల మీద పని తప్పా...ఎక్కడా అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు.

రేవంత్ చిటికెన వేలికి కూడా సరిపోడు

కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

బీబీనగర్: కేసీఆర్ ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కి ఫామ్‌హౌస్‌కు పరిమితం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిటికెన వేలికి కూడా మాజీమంత్రి కేటీఆర్ సరితూగడని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ కేటీఆర్ ఓ బచ్చా అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌నుద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ అయ్యను అడ్డంపెట్టుకొని కేటీఆర్ దొంగదారిన మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ భాష మార్చుకోవాలని, సీఎంకు గౌరవం ఇవ్వకుండా అహంకారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత కాళ్వేరం ప్రాజెక్టు, యాదాద్రి ఆలయ నిర్మాణాల పేరిట రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి కోట్ల రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని రేవంత్‌రెడ్డి మూసీలో వేసి తొక్కినా కేటీఆర్‌కు బుద్ధి రాలేదని అన్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి సీఎం స్థాయికి ఎదిగిన రేవంత్‌రెడ్డిని విమర్శించేస్థాయి ఎవరికీ లేదని పేర్కొన్నారు.

మంత్రి, జెడ్పీ చైర్మన్ మధ్య మాటల యుద్ధం

- గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో రభస
- జెడ్పీ చైర్మన్‌పైకి దూసుకొచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు... పిడిగుద్దులు
- సభాస్థలి వద్ద ఉద్రిక్తత



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి మధ్య వాగ్వాదం

బీబీనగర్: గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిల మధ్య తీవ్ర మాటల యుద్ధం జరిగింది. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు గ్రామపంచా యతీ భవన ప్రారంభోత్సవ అనంతరం నిర్వ హించిన సమావేశంలో సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వారంలోపే రైతు భరోసాతో పాటు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఇవ్వలేదని, రైతుబంధు రాలేదని ఎవరైనా అడిగితే చెప్పుతో కొడతాం అనడం సరికాదని, రైతుబంధు ఇచ్చింది మేమే అని అనడంతో వెంటనే కాంగ్రెస్ నాయకులు జెడ్పీ చైర్మన్‌తో వాగ్వాదం చేశారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి జోక్యం చేసుకొని.. సందీప్‌రెడ్డి చిన్న పిల్లగాడు, అతనికి ఏమీ తెలియదని, తెలియక మాట్లాడుతున్నాడని అనడంతో సందీప్‌రెడ్డి జోక్యం చేసుకొని.. తాను అన్నీ తెలిసే మాట్లాడుతున్నానని అనడంతో ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన మంత్రి.. 'వీన్ని ఎత్తి బయటపడేయండి'అని అనడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా స్టేజీ మీదకు దూసుకొచ్చారు. సందీప్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సందీప్‌రెడ్డిని స్టేజీపై నుంచి వెళ్లిపోవాలని డీసీపీ, ఏసీపీ చెప్పగా తాను ఎందుకు వెళ్లాలి అంటూ జెడ్పీ చైర్మన్ పోలీసులను ప్రశ్నించారు. దీంతో మంత్రి మరింత ఆగ్రహంతో 'వార్డు మెంబర్‌గా కూడా గెలవలేవు.. ఏదో నీ తండ్రి మాధవరెడ్డి పేరుతో పదవి వచ్చింది తప్ప నీలో ఏమీలేదు. నీ సొంత గ్రామానికి రోడ్డు వేయించలేకపోయావు బచ్చా'అని అన్నారు. పోలీసులు సందీప్‌రెడ్డిని స్టేజీ కిందకు తీసుకుపోతున్న సమయంలో ఒకరిద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు వెనుక నుంచి ఆయనను పిడుగుద్దులు గుద్దారు. సభాస్థలి నుంచి కొద్ది దూరం వెళ్లిన తర్వాత సందీప్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తాను చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పలేక మంత్రి కోమటిరెడ్డి తనపై దాడి చేయించారని చెప్పారు.

మంత్రిది ఆటవిక ప్రవర్తన..

సూర్యాపేట: అధికారమదంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆటవికంగా ప్రవర్తిస్తున్నాడని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండించారు. రక్షించాల్సిన పోలీసులు సందీప్ రెడ్డిని నెట్టేయడం దారుణమన్నారు. అత్యుత్సాహం ప్ర దర్శించిన రాచకొండ పోలీసులపై డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డికి అంతటి అహంకారం ప్రజాక్షేత్రంలో పనికిరాదని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్‌ల గురించి మాట్లాడే నైతికత ఆయనకు లేదని, 20ఏళ్ల పాలనలో జిల్లా కు కోమటిరెడ్డి ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు.

కోమటిరెడ్డిది నియంతృత్వ పోకడ

సాక్షి, హైదరాబాద్: సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి అకారణంగా దుర్భాషలాడటం కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుబంధు రాదన్న వారిని చెప్పుతో కొట్టండని ఇటీవల మంత్రి వ్యాఖ్యానించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. అధికారిక కార్యక్రమంలో సందీప్‌రెడ్డిని పోలీసులతో బలవంతంగా బయటకు పంపిన తీరును ఖండించారు. కోమటిరెడ్డికి ప్రజాస్వామ్యం మీద ఏ మాత్రం నమ్మకమున్నా సందీప్‌రెడ్డికి వెంటనే క్షమాపణ చెప్పాలని హరీశ్ డిమాండ్ చేశారు. కాగా, సందీప్‌రెడ్డిని నెట్టివేయటం కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ భూములను నూతన హైకోర్టు భవనాలకు ఇవ్వరాదంటూ ధర్నా చేస్తున్న విద్యార్థులకు మద్దతు తెలపడానికి వచ్చిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై ఈ నెల 24న జరిగిన దాడి కేసులో మహిళా కానిస్టేబుల్ అయేషాను సస్పెండ్ చేస్తున్నట్లు రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు. ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసుల నుంచి తప్పించుకొనేందుకు ఝాన్సీ పరిగెత్తగా ద్విచక్ర వాహనంపై వెంబడించిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లలో ఒకరైన అయేషా ఆమె జుట్టుపట్టి లాగి కిందపడేసి కాస్త దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో ఝాన్సీ గాయపడటం తెలిసిందే.



ఉదయమే పక్షుల కిలకిలరావాలు.. గాలిలో ఆకట్టుకునే విహారాకృతులు.. మనుషులతో కలిసిపోయి జీవనం సాగించే ఊరపిచ్చుకల సమూహాలు.. ఒకప్పుడు పల్లెప్రాంతాన్ని పక్షులు ఆహ్లాదంలో ముంచెత్తేవి. కానీ ఇప్పుడు అవి చాలా అరుదుగానే దర్శనమిస్తున్నాయి. అయితే ఒక్కో గడ్డి పరకను పేర్చి గూళ్లు నిర్మించుకున్న దృశ్యాలు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి శివారులో ఇలా కనిపించి కనువిందు చేస్తున్నాయి.
- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

విద్యాశాఖ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలి

డిప్యూటీ సీఎం భట్టికి టీఎస్ యూటీఎఫ్ వినతి

సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టిని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి, సీనియర్ నాయకుడు మాణిక్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు (యూఆర్‌ఎస్), సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు, గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీలకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫిబ్రవరిలో జరగ నున్న కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు (పీఏబీ) సమావేశంలో సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ వారు పని చేస్తున్న పోస్టు మినిమం టైం స్కేల్, బేసిక్ పే అమలు చేయాలని విన్నవించారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు కూడా బేసిక్ పే ఇవ్వాలన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ప్రయత్నిస్తానని భట్టి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

అంతర్రాష్ట్ర బదిలీలపై నిర్ణయం తీసుకోవాలి

సీఎం రేవంత్‌కు ఎస్‌ఎల్‌టీఏ వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన నేపథ్యంలో ఉద్యోగుల సొంత రాష్ట్రాల కేటాయింపుపై నిర్ణ యం తీసుకోవాలని నాన్ లోకల్ టీచర్స్ అసోసియే షన్ (ఎన్‌ఎల్‌టీఏ) అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మోహన్‌రావు, వి.సూర్యనారాయణ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రస్థాయి ఉద్యోగులను మాత్రమే సొంత రాష్ట్రాలకు కేటాయించారని, జోనల్, మల్టీజోనల్, జిల్లా కేడర్ ఉద్యోగులపై బదిలీలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినప్పటికీ రెండేళ్లుగా తెలంగాణ ప్రభు త్వం నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు 1,806 మంది, తెలంగాణలో పని చేస్తున్న ఏపీ ఉద్యోగులు 1,369 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో పనిచేయడంతో వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలు, స్థానికత అంశం ప్రశ్నార్థకంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని ఈ అంశంపై నిర్ణయాన్ని తీసుకుని సొంత రాష్ట్రాలకు ఉద్యోగులను పంపే ఏర్పాట్లు చేయాలని సీఎంను కోరారు.



మంచి వ్యక్తి ఎలా ఉండాలో చర్చలు జరుపుతూనే ఉండకు. మంచిగా ఉండు.
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 30 జనవరి 2024

పిల్లిమొగ్గల రాజకీయం

అనుకున్నదే అయింది. ఊహాగానాల్ని నితీశ్ కుమార్ నిజం చేశారు. 'ఇండియా' కూటమిలో నుంచి బయటకురావడం, కూటమిలోని ఆర్జేడీతో కలసి బిహార్‌లో నడుపుతున్న సర్కార్‌కు స్వస్తి చెప్పడం, 'ఎన్డీఏ'లో మళ్ళీ చేరుతున్నట్టు ప్రకటించడం, ముందుగా మాట్లాడిపెట్టుకున్న బీజేపీ మద్దతుతో ఆదివారం కొత్త ప్రభుత్వం ఏర్పాటు చకచకా జరిగిపోయాయి. దీంతో, రానున్న ఎన్నికల రాజకీయ నాటకంలో ఒక అంకం ముగిసింది. కొత్త చర్చ మొదలైంది. తొమ్మిదోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కుతూ, ఎన్డీఏ నుంచి ఇక అటూ ఇటూ ఎక్కడికీ పోనంటూ నితీశ్ చేసిన వ్యాఖ్యల్ని ఎవరూ నమ్మడం లేదు కానీ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ బిహారీ బాబు తాజా పిల్లిమొగ్గల పర్యవసానం ఏమిటి, మోదీపై యుద్ధానికి కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు – ఒక వర్గం ఓటర్లు ఆశపడ్డ 'ఇండియా' కూటమి భవితవ్యం ఏమిటి, ఎన్డీఏ కూటమికి ఎంతగా లాభిస్తుందన్న చర్చ ఆగడం లేదు.

తరచూ పొత్తులు మారుస్తూ, నోటికొచ్చిన వివరణతో నెట్టుకొస్తున్న నితీశ్ ఇప్పుడు అత్యంత చర్చనీయాంశమైన నేత. రెండేళ్ళలో రెండోసారి, దశాబ్ది పైచిలుకులో అయిదోసారి రంగులు మార్చి, తాజాగా తొమ్మిదోసారి పీఠమెక్కి, ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్న ఆయన తీరును పలువురు తప్పుబట్టడంలో ఆశ్చర్యం లేదు. అసలు 'ఇండియా' కూటమి కట్టడంలో సూత్రధారే నితీశ్. దశాబ్దాల రాష్ట్ర రాజకీయ అనుభవం అనంతరం జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలని ఆయన మోజుపడ్డారు. కూటమికి సమన్వయకర్తగా వ్యవహరించాలనీ, కాలం కలిసొస్తే రాబోయే ప్రతిపక్ష సర్కారుకు ప్రధాన మంత్రి కావాలనీ కలలు కన్నారు. కానీ, ఛాన్స్ తన దాకా రాకపోవచ్చని గ్రహించారు. పీతలబుట్ట లాంటి ప్రతిపక్షాలు, బలం పెరుగుతున్న బీజేపీ లాంటివి చూసి నితీశ్ ప్లేటు తిప్పేశారు. గెలుపు గుర్రంపై పందెం కాస్తే, పీఎం కాకున్నా ప్రయోజనాలైనా నెరవేరతాయనుకున్నారు. 'చస్తే మళ్ళీ వెళ్ళన'ని ఏడాది క్రితం అన్న ఎన్డీఏ కూటమిలోకే నిస్సిగ్గుగా ఫిరాయించారు.

ఇందులో ప్రతిపక్ష కూటమి స్వయంకృతమూ ఉంది. ఆ మధ్య 5 రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు వచ్చినప్పుడు, వాటిపైనే దృష్టిపెట్టి కూటమి తన పనిని పక్కనపెట్టినట్టు కనిపిస్తోంది. అలా 3 నెలల పైనే వృథా అయింది. సార్వత్రిక ఎన్నికల సన్నాహం, ప్రతిపక్షాల్లో ఏకాభిప్రాయ సాధన వెనకపట్టు పట్టింది. కనీసం 300 లోక్‌సభా స్థానాల్లో పోటీ చేస్తానంటూ కాంగ్రెస్ పట్టుబట్టడమూ కూటమి పక్షాలకు మింగుడుపడలేదు. పోనీ ఆ డిమాండ్‌కు తగ్గట్టు కాంగ్రెస్ తన బలిమిని చూపగలిగిందా అంటే అదీ లేదు. ఇటీవలి 5 రాష్ట్రాల ఎన్నికల్లో నాలుగింటిలో హస్తం వీగిపోయింది. 'ఇండియా' కూటమిలో తనదే పైచేయిగా ఉండాలన్న ఆ పార్టీ ఆశ అడియాసే అయింది. మునుపటంత బలం లేని జాతీయ పార్టీని తమ భుజాలపై మోయడానికి బలమైన ప్రాంతీయ పార్టీలు సిద్ధంగా లేవు. పైగా, కన్వీనర్ అంటూ ఎవరినీ ఎంపిక చేయకపోవడం మరో తప్పిదం. కనీస ఉమ్మడి అజెండా మొదలు సీట్ల పంపిణీ దాకా అన్నిటినీ పేరబెట్టేసరికి చివరకు వ్యవహారం చేయి దాటింది.

ఎన్నికలు కొద్ది నెలల్లోనే ఉన్నా, 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'కు ఇచ్చినంత ప్రాధాన్యం వాటికి ఇవ్వట్లేదన్నది కాంగ్రెస్‌పై మరో విమర్శ. ఈ యాత్ర ద్వారా ప్రజా బాహుళ్యంలో బలం పుంజుకొని, తమకు మరిన్ని సీట్ల కోసం గట్టిగా బేరం చేయాలనేది ఆ పార్టీ భావననీ ఓ విశ్లేషణ. ఏమైనా, ప్రతిపక్షాలు అనైక్యతతో ఇలా కుమ్ములాడుకుంటూ ఉండగానే, బీజేపీ మాత్రం ఎన్నికలకు సిద్ధమైపోతోంది. ఇప్పటికే 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లను సైతం నియమించేసింది. గత వారం బులంద్‌షహర్‌లో సభతో ప్రధాని మోదీ లోక్‌సభ ఎన్నికల సమరభేరి మోగించారు. జైపూర్ లాంటి చోట్ల ర్యాలీలతో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. కొద్ది నెలల క్రితమే 5 రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడింటిని గెలుచుకోవడం సైతం బీజేపీకి కొత్త ఊపునిచ్చింది. అయోధ్య ఆలయ ప్రారంభోత్సవానికి మీడియా, అలాగే కేంద్ర సర్కార్ హంగామాతో హిందూత్వకు మారుపేరుగా ఆ పార్టీ తన స్థానం సుస్థిరం చేసుకుంది.

అందుకే, దేశంలో, ముఖ్యంగా ఉత్తరాదిన ఈ హిందూత్వ ప్రభంజనానికి ఎదురొడ్డడం ప్రతిపక్షాలకు అగ్నిపరీక్షే. పైగా, మందిర్ ప్లస్ మండల్‌గా మారిన బీజేపీ వ్యూహం పదునైనది. మండల్ రాజకీయాల ఉద్ధృతిలో వచ్చిన కుల ఆధారిత పార్టీలకు సెగ తగులుతోంది. అయితే, మోదీ సర్కార్ విభజన రాజకీయాలు చేస్తోందనీ, ప్రజాస్వామ్యానికిది ప్రమాద భరితమనీ అన్న నోటితోనే నితీశ్ మళ్ళీ అదే పంచన చేరడం ఆయన ఇమేజ్‌ను పలచన చేసింది. కుల సమీకరణలు నిష్ఠురసత్యమైనప్పటికీ, బిహార్‌లో బలం తగ్గుతున్న నితీశ్‌కూ, ఆయన పార్టీకీ తాజా పిల్లిమొగ్గ అద్భుత భవితను అందించకపోవచ్చు. నితీశ్ నైజం తెలుసు గనక ఆయన్ని అడ్డం పెట్టుకొని, లోక్‌సభ ఎన్నికల్లో 40 స్థానాల బిహార్‌లో లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోంది. అవసరం తీరాక ఆ దోస్తీ కొనసాగకపోవచ్చు. లోక్‌సభ తర్వాత, అసెంబ్లీ ఎన్నికల్లోపు ఏమవుతుందో, మన 'పల్టూ రామ్' ఏం చేస్తారో చెప్పలేం.

నెలల క్రితం ఆశ రేపిన ప్రతిపక్ష కూటమి ఇప్పుడు బలహీనమైందన్నది నిజం. కానీ, ఇంతటితో కూటమి కథ ముగిసిందనడం తొందరపాటే. తొమ్మిదేళ్ళ పైచిలుకు బీజేపీ పాలనపై దేశమంతా తృప్తిగా ఏమీ లేదు. ధరలు, నిరుద్యోగం, విభజన రాజకీయాలపై జనంలో అసహనం ఉన్నా, మోదీకి ప్రత్యామ్నాయం లేకపోవడం విషాదం. మోదీని దింపాలనే తప్ప పాజిటివ్ అజెండా చెప్పలేకుంటే ఈ అసంతృప్త, అనిశ్చిత ఓటర్ గణాన్ని ప్రతిపక్షాలు ఆకర్షించలేవు. ప్రతిపక్షాలంటే కుమ్ములాటల కూటమనే భావన తొలగించకపోతే, ఎన్ని ఎన్నికలొచ్చినా అది ఎడ్వాంటేజ్ బీజేపీయే. ఇది వికసిత, ఆత్మనిర్భర్ భారత్ అవునో కాదో కానీ, 'ఇండియా' మటుకు వెలిగిపోవడం లేదంటున్నది అందుకే!

నిబద్ధతతోనే కాలుష్య నియంత్రణ

విశ్లేషణ



ఆరతీ ఖోస్లా

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అరుదుగా మాత్రమే నీలి ఆకాశం కనబడుతోంది. గాలి నాణ్యత తీవ్రతకు ఇదొక సంకేతం. వాయు కాలుష్యం ఇప్పుడు జాతీయ సమస్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, గాల్లోని నలుసు పదార్థాల (పీఎం) సాంద్రత 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రో గ్రాములు మించకూడదు. ఇది ఢిల్లీ లాంటి నగరంలో 102. ఈ గాలిని పీల్చడం ప్రాణాంతకం. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి తెచ్చిన 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం' కొంతమేరకు ఫలితమిస్తున్నా అది సరిపోదు. మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో మనం వ్యవహరిస్తున్నాం. ప్రజారోగ్య దృక్కోణం నుండి చూస్తే ఎంత ప్రగతి అయినా తక్కువే. నిరంతర రాజకీయ నిబద్ధత మాత్రమే మెరుగైన ఫలితాలను ఇస్తుంది.

శీతకాలపు నెలల్లో భారీ పొగమంచుతో కప్పబడి ఉండే ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో నీలి ఆకాశం, ప్రకాశవంతమైన సూర్యబింబం అరుదుగా గోచరిస్తుంటాయి. అయితే పేలవమైన గాలి నాణ్యత అనేది ఇప్పుడు జాతీయ సమస్య అయింది. కాకపోతే గత ఐదేళ్లలో, వాయు కాలుష్యం ఒక విధానపరమైన సమస్యగా కూడా గుర్తింపు పొందింది. అయినప్పటికీ 'జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమ' (ఎన్‌సీఏపీ) అయిదేళ్ల అంచనాను పరిశీలిస్తే, అర్థవంతమైన, శాశ్వతమైన ప్రయోజనాలను అందించడానికి గట్టి ప్రయత్నాలు అవసరమని తెలుస్తుంది.

అపఖ్యాతి పాలైన భారతదేశ గాలి నాణ్యతను పరిష్కరించడానికి తెచ్చిన మొదటి విధానం – 2019లో ప్రారంభించిన ఎన్ సీఏపీ. కాలుష్య స్థాయిలను, గాలిలోని నలుసు పదార్థాల గాఢతలను ప్రధాన నగరాల్లో 30 నుంచి 20 శాతం తగ్గించాలనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించింది. దీనికి కేంద్రం నుండి రూ. 443 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుండి రూ. 4,400 కోట్ల ప్రారంభ కేటాయింపులు జరిపారు.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ)కి చెందిన నిరంతర పరిసర వాయు నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాల విశ్లేషణ (భారత దేశ వాయు నాణ్యతా మానిటర్ల నెట్‌వర్క్) పురోగతి స్థిరంగా ఉన్నప్పటికీ, ఎన్‌సీఏపీని అమలు చేయడంలో వ్యూహాత్మకమైన, సైన్స్ ఆధారిత మార్పుల అవసరం ఉంది. ఉదాహరణకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ గాల్లోని నలుసు పదార్థాల (పర్టిక్యులేట్ మ్యాటర్) సాంద్రతకు పరిమితులు నిర్దేశించింది. 2.5 పీఎం అయితే, ఒక క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాములు, 10 పీఎం అయితే ఒక క్యూబిక్ మీటరుకు 15 మైక్రోగ్రాములు మించకూడదు. ఎన్‌సీఏపీ అమలయ్యాక, ప్రత్యేకించి 2.5 పీఎం వారణాసిలో 96 నుంచి 26.9 మైక్రోగ్రాములకు తగ్గింది. ఆగ్రాలో 73 నుంచి 33కు, జోధ్‌పూర్‌లో 81.8 నుంచి 40.6కు మెరుగ్గా తగ్గింది. కానీ ఢిల్లీలో మాత్రం 108 నుంచి 102కు మాత్రమే తగ్గింది. పీఎం 2.5 స్థాయుల డేటా 2019–2023 మధ్య 46 నగరాలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేవలం 27 నగరాల్లో మాత్రమే తగ్గుదల మెరుగ్గా ఉంది. 10 పీఎం విషయంలో ఐదేళ్ల డేటా కేవలం 46 నగరాలకు అందుబాటులో ఉండగా, అందులో కేవలం 24 నగరాల్లో మాత్రమే మెరుగుదల కనబడింది.

50 శాతం నగరాలు గణనీయమైన అభివృద్ధిని చూపుతున్నాయనీ, ఇది ఎన్ సీఏపీ విజయవంతమైన ప్రగతిని సూచిస్తోందనీ ఎవరైనా వాదించవచ్చు. కానీ మనం మానవ కణజాలంలోకి చొచ్చుకుపోయే కాలుష్య కారకాలతో వ్యవహరిస్తున్నాము. పైగా రక్తపోటు, మధుమేహం వంటివాటిని ఇవి మరింత తీవ్రతరం చేయవచ్చు. 2.5 పీఎం రక్త–మెదడు అవరోధాన్ని కూడా దాటవచ్చు. దీర్ఘకాలం అలాంటి గాలిలో మసలితే ప్రాణాంతకం అవుతుంది.



కాబట్టి, ప్రజారోగ్య దృక్పథం నుండి చూస్తే మరింత కఠినమైన ప్రగతి అత్యవశ్యం.

మరో సమస్య ఏమిటంటే, ఎన్‌సీఏపీలో సమన్వయం కొరవడింది. ఢిల్లీ లాంటి నగరంలో సరి–బేసి ట్రాఫిక్‌ను అమలు చేయడం, 'జాతీయ రాజధాని ప్రాంతం' నుండి నిబంధనలు పాటించని వాహనాలను తొలగించడం, వ్యర్థాలను బహిరంగంగా కాల్చడాన్ని నిరోధించడం, దుమ్మును తగ్గించడానికి రోడ్లపై నీటిని చల్లడం వంటి చర్యలు అన్నీ అమలవుతున్నాయి. అయినప్పటికీ, కాలుష్యానికి సంబంధించిన ఇవే కారణాలు ఉన్న మిగిలిన ప్రాంతాలకు విస్తరించకుంటే ఈ చర్యలు సరిపోవు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలో పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల దట్టమైన పొగమంచుతో చలికాలం ప్రారంభం కావడం దీనికి స్పష్టమైన ఉదాహరణ. ఢిల్లీ నగరంలో నమోదైన సుమారు 80 లక్షల వాహనాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఉష్ణోగ్రతలో తగ్గుదల గాలిలో నిలిచివుండే అణువుల స్థాయులను ప్రమాదకరంగా పెంచుతుంది. ఈ కాక్‌టెయిల్‌ను ఢిల్లీ నివాసులు ప్రతి సంవత్సరం కొన్ని వారాల పాటు పీల్చుకుంటున్నారు. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) ప్రతి శీతాకాలంలో ఢిల్లీ–జాతీయ రాజధాని ప్రాంతంలో ఊహించిన ప్రతిస్పందనగా అమలులోకి వస్తుంటుంది. అయితే దాని ఆధారాన్ని తగ్గించడమే లక్ష్యం కావాలి.

రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సజావుగా సమన్వయం లేకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుంది. జాతీయ రాజధాని వెలుపల, సీపీసీబీ పర్యవేక్షణ నెట్‌వర్క్ అసమానంగా ఉందని మా విశ్లేషణ చూపుతోంది. ఇది మూల్యాంకనానికి వ్యత్యాసాల పొరను జోడిస్తుంది. ముజఫర్‌పూర్, బిహార్ లాంటి రద్దీ ప్రదేశాలలో కేవలం మూడు మానిటర్లు ఉన్నాయి. అదే ఢిల్లీ అంతటా 37 స్టేషన్‌లు, ముంబై అంతటా 22, హైదరాబాద్‌లో 14 స్టేషన్లు ఉన్నప్పుడు మనం తప్పుడు నిర్ధారణలకు వచ్చే ప్రమాదం ఉంది. ప్రామాణిక పర్యవేక్షణ విధానంలో, పోల్చదగిన జనాభా ఉన్న నగరాలు ఒకే విధమైన లేదా కనీసం సారూప్య సంఖ్యలో గాలి నాణ్యత మానిటర్లను కలిగి ఉంటాయి. స్థానిక కాలుష్య మూలాల శాస్త్రీయ అవగాహన ఆధారంగా ఆ స్థానాలు ఉంటాయి. నగరాల కాలుష్య సాంద్రతలు ఒకే పారామితుల సెట్‌లో ట్రాక్ చేయబడతాయి. ఇది వాటి గాలి నాణ్యత ధోరణులపై 'గ్రాన్యులర్'(కణికీయ) అవగాహనను పెంపొందించడంలో సహాయపడుతుంది.

వాయు కాలుష్య ప్రయత్నాలకు సంబంధించిన నిధుల కేటాయింపుల్లో కూడా సమస్యలున్నాయి. తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్న ఢిల్లీకి కేవలం రూ.38 కోట్లు మాత్రమే అందాయి. అందులో అది 10 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. గాలి నాణ్యత చర్యల కోసం వర్తించే నిధులను క్రమబద్ధీకరించడంలో ఇదొక ప్రశ్నగానే ఉండిపోతుంది. గ్రేటర్ ముంబైకి రూ.938 కోట్లు అందగా, దానిలో రూ.660 కోట్లు వినియోగించుకుంది.

అయినప్పటికీ, జాతీయ స్వచ్ఛ వాయు పథకం(ఎన్‌సీఏపీ)లో సానుకూల అంశాలున్నాయి. వీటిలో మొదటిది 2026 నాటికి 10 పీఎం గాలి సాంద్రతలను 40 శాతానికి తగ్గించడం. ఇది ప్రతిష్ఠాత్మకమైన లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. అందుకే దీన్ని ఎన్‌సీఏపీ అమలు కాని నగరాలకు కూడా విస్తరించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే గ్రేటర్ నోయిడా (ఉత్తర ప్రదేశ్), భివాడీ (రాజస్థాన్) వంటివి తీవ్ర కాలుష్య స్థాయులను నివేదించాయి.

ఇంకా, రంగాల వారీగా వివరణాత్మక చర్యలు ఉండాలి. ఇటుక బట్టీలు, నిర్మాణాలు, కూల్చివేత ప్రాజెక్టుల వంటి అత్యంత కాలుష్య కారకాలకూ... సిమెంట్, ఉక్కు కర్మాగారాలకూ భిన్నమైన విధానం అవసరం. అదేవిధంగా, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం మాత్రమే నిర్దిష్ట వయస్సు దాటిన పెట్రోల్, డీజిల్ వాహనాలను నిషేధించింది. కానీ దేశవ్యాప్తంగా కఠినమైన, కాలుష్య నియంత్రణ వ్యవస్థ లేకపోతే... ప్రమాణాలను అందుకోని వాహనాలను ఇతర నగరాలకు తరలించే ప్రమాదం ఉంది. అప్పుడు కాలుష్య భారం మారదు. మరీ ముఖ్యంగా, ఎన్‌సీఏపీ ప్రధాన అంశంగా ప్రజారోగ్యం ఉండాలి. ప్రతి కొలమానాన్ని తప్పనిసరిగా ప్రతిపాదించాలి, చర్చించాలి. అంతే గాకుండా వాయు కాలుష్య కారకాలను తగ్గించడం పట్ల నిర్మాణాత్మకంగా ఉండాలి.

మనం ఎన్‌సీఏపీ రెండవ దశలోకి ప్రవేశించినప్పుడు చాలా ఆశించవచ్చు. ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో సమస్యను అంగీకరించడం అనేది మాత్రం ఇప్పటికి సానుకూలాంశం. కానీ నిరంతర రాజకీయ నిబద్ధత మాత్రమే బలమైన ఫలితాలను ఇస్తుంది.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని క్లైమేట్ ట్రెండ్స్ డైరెక్టర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదే ఆహ్వానం



కృత్రిమ మేధ(ఏఐ) వల్ల చాలా ఉద్యోగాలు పోతాయంటున్నారు. నిజంగా అదే భయమా? కానీ తాము చేస్తున్న పని ఎవరికైనా నచ్చుతున్నదేమో అడగండి. ఇంకే అవకాశం లేనందువల్లే చేస్తున్నామని 90 శాతం మంది చెబుతారు. జనానికి కొత్తవి అన్వేషించే అవకాశం ఏఐ ఇస్తుంది. సరదా, సృజనలతో పాటు ఉత్పాదకత పెరుగుతుంది. జనానికి ఎంపిక అవకాశం ఉంటుంది.

– శేఖర్ కపూర్, దర్శకుడు

ఈగో రోగం



పేషెంట్‌ను చూసిన తర్వాత శానిటైజర్‌తో శుభ్రం చేసుకున్నందుకు గురుగావ్‌లో ఒక డాక్టర్ మీద దాడి జరిగింది. డియర్ పేషెంట్స్... మేము మా చేతుల్ని కేవలం మాకోసమే శానిటైజ్ చేసుకోం, తర్వాతి పేషెంట్‌కు సూక్ష్మక్రిములను అంటించకుండా ఉండటం కోసం కూడా చేసుకుంటాం. దయచేసి హింసకు దూరంగా ఉండండి.

– జోయీతా, ఫిజీషియన్

ఉదారంగా లేరు!



అభిప్రాయాల కోసం జనాలు తమ స్నేహాలు వదిలేసుకుంటున్నారు. అయితే, ఇది అందరికీ వర్తించదు. 'మరీ రైట్ వింగ్', 'మరీ ధార్మికం', 'మరీ జాతీయవాది', 'మోదీ అంటే ఎక్కువిష్టం' లాంటి కారణాలతో పాత స్నేహాలను వదిలేసుకునే వాళ్లలో 'లిబరల్స్' ఎక్కువ.

– మనూ జోసెఫ్, రచయిత

బహుపరాక్



ఇండియాలోని ఐటీ జనుల్లారా... తుఫాను రాబోతోంది. చాలా పెద్దది. 25–30 ఏళ్లుగా తక్కువ పనికి ఎక్కువ వేతనంలా సాగిన దశ ముగియనుంది. మీకూ, నాకూ కూడా! తుఫాను రాబోతోంది. మిమ్మల్ని మీరు బిగించి కట్టుకోండి.

– అమిత్ బెహెరె, సాఫ్ట్‌వేర్ డెవలపర్

ఎలా పడిపోయింది?



ఒక డాలర్ కొనుగోలుకు కావాల్సిన రూపాయలు: 2024లో 83. 2014లో 60. 1894లో 3. ఇది మనకు స్వామి వివేకానంద వల్ల తెలుసు. 1894 జూలై 11న ఆయన 'డెట్రాయిట్ ఉపన్యాసం వల్ల నేను 900 డాలర్లు సంపాదించాను, అనగా రూ. 2,700' అని రాశారు.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

కోవిడ్ యోధులు చిరస్మరణీయులు

మానవ జీవితంలో ఆరోగ్యం ప్రధానమైంది. వైద్యులు, వైద్యసిబ్బంది సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు నిత్యం కృషిచేస్తుంటారు. ముఖ్యంగా కోవిడ్–19 మహమ్మారి కాలంలో జీవితాన్ని పణంగా పెట్టి అహర్నిశలూ కరోనా బాధితులకు వైద్యచికిత్సలను అందించి, వారి ప్రాణాలను కాపాడిన వైద్యులు, నర్సులు, ఇతర వైద్యసిబ్బంది సేవలు విలువ కట్టలేనివి. కోవిడ్–19 మహమ్మారి విలయతాండవం చేసిన రోజులవి. ఒక మనిషిని మరో మనిషి తాకడానికి భయపడిన కాలం. సొంత తల్లిదండ్రులు, తోబుట్టువులు మరణించినపుడు వారి అంత్యక్రియలను సహితం నిర్వర్తించలేని అశక్తులుగా దుఃఖాన్ని దిగమింగుకున్నారు.



మనిషి ఊహించలేని అలాంటి పరిస్థితులు ఎదురైనపుడు ప్రభుత్వం, డాక్టర్లు, వైద్యబృందం, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, అగ్నిమాపక సిబ్బంది, మీడియా వంటి ప్రభుత్వ/స్వచ్ఛంద సేవా సంస్థల సాయం ఎనలేనిది. వేలాదిమంది తమ ముందే ప్రాణాలను కోల్పోతున్నా, ఆందోళనను అదుపులో ఉంచుకుని, ధైర్యంగా సాయం అందించారు పైన పేర్కొన్నవారందరూ.

కోవిడ్ వల్ల ప్రపంచ దేశాలన్నీ అస్తవ్యస్తమై అచేతనంగా ఉండిపోయిన కాలంలో వైద్యపరిశోధన సంస్థలు యుద్ధప్రాతిపదికన వివిధ రకాల ఔషధాలను తయారుచేయటం మరో అంశం. కోవిడ్–19ను ఎదుర్కోవటంలో ఫ్రంట్‌లైన్‌లో ఉండి పనిచేసిన వైద్యులు, సిబ్బందిలోనూ ఎందరో అమరులైన విషయం మనం మరువకూడదు. వీరి కారణంగా ఆయా కుటుంబాల్లోని వారూ కొందరు కోవిడ్ బాధితులయ్యారు.

కోవిడ్–19గా నామకరణం చేసిన మహమ్మారి వైరస్ చైనాలో తలెత్తి, ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. భారతదేశంలో 2020 జనవరి 30న చైనా నుంచి వచ్చిన కేరళ విద్యార్థి ద్వారా తొలి కరోనా కేసు నమోదైన విషయం తెలిసిందే. వైరస్ విస్తరణతో మార్చి 23న కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ఆదేశాలు జారీ చేయాల్సి వచ్చింది. ఇలాంటి ఆత్యయిక పరిస్థితుల్లో ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించిన తీరు అద్భుతం. వందలాది పడకలతో క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతి కేంద్రంలో ఉచిత వైద్యం, ఆహారం అందిస్తూ కోవిడ్ నుంచి బాధితులు స్వస్థత పొందటానికి అహరహం కృషి చేశాయి.

కరోనా మహమ్మారిపై పోరాటంలో భాగంగా దేశవ్యాప్తంగా వేలాదిమంది డాక్టర్లు అమరులయ్యారు. వారిని స్మరిస్తూ 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' నివాళి అర్పించే కార్యక్రమాన్ని 2021 జనవరి 30వ తేదీన నిర్వహించింది. ఈ ఏడాది కూడా వారిని గుర్తుచేసుకుంటూ అనేక చోట్ల డాక్టర్లు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో వైరస్ బారినపడి అకాల మరణం చెందిన వైద్యులను, సిబ్బంది స్మరించుకోవటం, నివాళి అర్పించటం ఉత్తమ సంస్కారం. ప్రతి ఆసుపత్రి ప్రాంగణంలో జనవరి 30వ తేదీన మైనపు వత్తులు వెలిగించి, అమరులైన వైద్య సిబ్బందికి నమస్కరించటం మహా సంస్మరణ. అది మన కనీస కర్తవ్యం కూడా!

– డా॥ గుజ్జర్లమూడి హిమబిందు । మచిలీపట్నం

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

రచ్చ రేపిన కొత్త మరణ దండన

ప్రపంచదేశాల్లో ఇప్పటి వరకూ మరణ శిక్ష... ఉరి, విద్యుత్ కుర్చీ, విషపు ఇంజెక్షన్స్, తుపాకీ కాల్పులు వంటి పద్ధతుల ద్వారా ఎక్కువగా అమలవుతూ వస్తోంది. కానీ ప్రపంచంలోనే తొలిసారిగా అమెరికాలో ఓ 58 ఏళ్ల హంతకుడికి నైట్రోజన్ గ్యాస్ ద్వారా మరణ శిక్ష విధించారు. దీనిపై ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చ జరుగుతోంది. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య సహా పలు సంస్థలు, వ్యక్తుల నుంచి ఈ తరహా మరణశిక్ష అమలు అనాగరికమంటూ తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

అమెరికాలోని దక్షిణాది రాష్ట్రమైన అలబామాలో ఇటీవలే ప్రయోగాత్మకంగా స్మిత్ అనే ఖైదీకి మాస్క్ తగిలించి అందులో నైట్రోజన్ గ్యాస్ పంపడం ద్వారా అతన్ని అపస్మారక స్థితిలోకి తీసుకెళ్లి మరణశిక్షను విజయవంతంగా అమలు చేశారు. అంతే కాదు ఈ మరణశిక్ష అమలును వీక్షించేందుకు కెన్నెత్ స్మిత్ కుటుంబీకులు, బాధిత కుటుంబ సభ్యులు, లాయర్లను కూడా పరిమిత సంఖ్యలో అనుమతించారు. చాలా సులువుగా కేవలం 22 నిమిషాల వ్యవధిలో కెన్నెత్ స్మిత్ ప్రాణాలు కోల్పోయాడు. కానీ ఇప్పుడు దీన్ని అమలు చేసిన అమెరికా మాత్రం ప్రపంచం దృష్టిలో దోషిగా నిలబడింది. స్వదేశంలోనే ఈ మరణదండనపై తీవ్ర నిరస నలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు ఐక్యరాజ్య సమితి, ఐరోపా దేశాల సమాఖ్య (ఈయూ)లు అమెరికా తీరును ఖండించాయి. ఈ ఖండనలు, నిరసనలు ఏ స్థాయిలో ఉన్నాయంటే స్వయంగా వైట్ హౌస్ ఈ నైట్రోజన్ గ్యాస్ మరణ శిక్ష తమను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందనీ, ఇది క్రూరంగానే ఉందనీ అంగీకరించింది.

అమెరికాలో తాజాగా రెండు మరణశిక్షలు ఇంజెక్షన్ ద్వారా అమలు చేశారు. ప్రస్తుతం నైట్రోజన్ మరణశిక్షను అమలు చేసిన అల బామాతో పాటు మరో రెండు రాష్ట్రాలు ఓక్లహోమా, మిస్సిసిపీలు ఈ తరహా మరణ శిక్ష అమలును ఆమోదించాయి. తాజాగా జరిగిన నైట్రోజన్ మరణశిక్ష అమలును అలబామా అటార్నీ జనరల్ స్టీవ్ మార్షల్ సమర్థించుకున్నారు. ఇది పూర్తిగా ప్రొఫెషనల్ పద్ధతిలో జరిగిందన్నారు.

కెన్నెత్ యూజీన్ స్మిత్‌కు ప్రాణాంతకమైన మందులతో మరణశిక్ష అమలు చేయాలని 2022 నవంబర్‌లో నిర్ణయించారు. జైలు సిబ్బంది ఒక ఇంట్రావీనస్ లైన్‌ను చొప్పించారు. అయితే ప్రాణాంతక ఇంజెక్షన్‌ను ఇవ్వడానికి రెండు లైన్లు అవసరం. రెండవ లైను చొప్పించడానికి వారు ఒక గంట పాటు పోరాడిన తర్వాత, ఉరిశిక్ష రద్దు చేశారు. కానీ స్మిత్ 1988లో ఒక బోధకుని భార్యను కిరాయికి చంపిన కేసులో ఇటీవల దోషిగా తేలడంతో మరణ శిక్ష విధించింది కోర్టు. ఈ శిక్షను నైట్రోజన్ వాయువును ఉపయోగించి అమలు చేశారు.



ప్రతీకాత్మక చిత్రం

అమెరికా రాష్ట్రాలు కొన్ని ఇప్పటికీ ఉరి, ఫైరింగ్ స్క్వాడ్ లేదా ఎలక్ట్రిక్ కుర్చీ ద్వారా మరణ దండన విధానాన్ని అమలు చేస్తున్నాయి. కొన్ని రాష్ట్ర న్యాయస్థానాలు మాత్రం పలు రకాల మరణశిక్ష పద్ధతులను నిషేధించాయి. అయితే, గత కొన్ని దశాబ్దాల కాలంలో చాలా రాష్ట్రాలు ప్రాణాంతకమైన ఇంజెక్షన్ ద్వారా మరణ శిక్షను అమలు చేయడానికి అంగీకరించాయి.

స్మిత్‌కు మునుపటి ఉరిశిక్ష అమలుకు చాలా నెలల ముందు, అలబామా అధికారులు మరో ఖైదీ అలాన్ మిల్లర్‌కు ఐవీ సూదిని చొప్పించడంలో ఇబ్బందుల కారణంగా మరణశిక్ష అమలు చేయడంలో విఫలమయ్యారు. అలాగే ఇతర ప్రాణాంతక ఇంజెక్షన్ ద్వారా కూడా మరణశిక్ష అమలు కాలేదు. అగ్రరాజ్యంలోని పలు రాష్ట్రాలు ఇటీవల ప్రాణాంతక ఇంజెక్షన్ మందులను పొందడంలో పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఔషధ తయారీదారులు యునైటెడ్ కింగ్‌డమ్, యూరోపియన్ యూనియన్‌లు 2011లో ఇటువంటి ప్రాణాంతక ఇంజెక్షన్‌ల ఎగుమతులను నిషేధించాయి. దీంతో ఔషధ తయారీ కంపెనీలు వాటి తయారీని నిలిపివేశాయి. ఈ కారణంగా మరణ శిక్షను అమలు చేయడానికి రాష్ట్రాలుఇతర మార్గాల కోసం అన్వేషిస్తున్నాయి. అందులో ఒకటి నైట్రోజన్ వాయువును అందించి ప్రాణాలు తీయడం.

దోషి కెన్నెత్ స్మిత్ ముఖానికి మాస్క్ కట్టి, స్వచ్ఛమైన నైట్రోజన్ వాయువును జైలు అధికారులు అందించారు. వాయువు విషపూరితమైనది కాదు. భూ వాతావరణంలో మూడు వంతుల కంటే ఎక్కువ నైట్రోజన్ ఉంటుంది. కానీ స్వచ్ఛమైన సాంద్రీకృత రూపంలో ఉన్న ఈ గ్యాస్‌ను పీల్చడం వల్ల మెదడుకు ప్రసారం అయ్యే ఆక్సిజన్ ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అలబామా స్టేట్ అటార్నీ జనరల్ స్టీవ్ మార్షల్ మాట్లాడుతూ... నైట్రోజన్ వాయువును ఉపయోగించి, మరణశిక్షను అమలు చేయడం అత్యంత మానవీయమైన పద్ధతి' అని పేర్కొనడం గమనార్హం.

– వి.వి. వెంకటేశ్వరరావు
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ । 63008 66637

ప్రేమ పాశం

మహాయోగులు కూడా ఏ పరమ పురుషుని పాద ధూళిని కొంచెం కూడా తాకలేరో, అటువంటి విష్ణువుని, కృష్ణావతారంలో చిన్ని కృష్ణుని పెంచిన భాగ్యం తల్లి యశోదమ్మది. జగత్తునంతా పాలించే ప్రభువైన దేవునికి పాలిచ్చి పెంచే తల్లిగా జన్మించిన యశోదమ్మదెంత పుణ్యమో!

చిన్ని కృష్ణయ్య ఈ క్షణం ఈ ఇంట్లో ఉంటే, మరో క్షణం మరో ఇంట్లో ప్రత్యక్షమయ్యేవాడు. ఒకరోజు పక్కింట్లో రోలు తిరగేసి ఎక్కి ఉట్టి మీద వెన్న తీస్తుండగా యశోదమ్మ చూసింది. బెత్తం పట్టుకుని నల్లనయ్యని 'నువ్వు ఇంతవరకు ఎవరికీ చిక్కలేదని, నిన్ను ఎవరూ శిక్షించలేరని అనుకుంటున్నావు. ఇవాళ ఎలా తప్పించుకుంటావో చూస్తాను' అంటూ బెదిరించింది. అంతలోనే పెల్లుబికిన మాతృ హృదయం! 'ఇతడిని పసివాడనుకుందామా అంటే ఒకోసారి ఇలాంటి నడవడిక పెద్దవాళ్లకు కూడా ఉండదు. తననెవరైనా చూస్తే పారిపోవాలని కూడా తెలియని అమాయకుడు. భయం అనేది తెలియని ఇతడిని ఎలా దారికి తేవాలి? అప్పుడప్పుడు దెబ్బలు తగలనిస్తూ ఉండాలి. దుండగులైన పిల్లలకు దండోపాయమే సరి' అనుకుంటూ 'ఆగు, ఆగు' అంటూ బెత్తం ఝళిపించింది.



జ్యోతిర్మయం

కృష్ణుడు భయపడ్డట్లు ముఖం పెట్టి కాలి గజ్జెలు ఘల్లుఘల్లుమంటుంటే పారిపోసాగాడు. యశోదా దేవి బాలుని వెంట పరుగెత్తింది. 'ఈ ఒక్కసారికి క్షమించ'మని దొంగ కన్నీళ్ళతో ఏడుస్తున్న కృష్ణుని యశోద ఎలాగైతేనేం పట్టుకుంది. 'ఎక్కడ బడితే అక్కడ తిరుగుతూ ఉంటావు. ఒకచోట కుదురుగా ఉండవం'టూ మందలిస్తున్నట్లు అన్న మాటల్లో దేవదేవుని సర్వాంతర్యామిత్వాన్ని చెప్పకనే చెప్పింది. కృష్ణుని రోటికి కట్టడానికి యశోద ఎంత తాడు తెచ్చినా అది రెండంగుళాలు తక్కువవుతూ వచ్చింది. ఆ తాడు సాధారణమైనది కాదు. అది ప్రేమ పాశం. భగవంతుడు నిష్కల్మష ప్రేమకు వశుడవుతాడు. ఎవరికీ చిక్కని కన్నయ్య యశోదమ్మకు చిక్కాడు. మరొకటి లేదు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: బ.పంచమి పూర్తి (24 గంటలు), నక్షత్రం: ఉత్తర రా.7.47 వరకు, తదుపరి హస్త, వర్జ్యం: తె.5.03 నుండి 6.47 వరకు (తెల్లవారితే బుధవారం), దుర్ముహూర్తం: ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.46 వరకు, అమృతఘడియలు: ఉ.11.45 నుండి 1.33 వరకు; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.50.

కమిటీలతో కాలయాపన చేస్తే సహించబోం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి పాపయ్య



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణలో బీజేపీ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తే సహించబోమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ వ్యాఖ్యానించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ భారీ సదస్సు నిర్వహించారు. పాపయ్య మాట్లాడుతూ 2 నెలల కిందట ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చి ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపడతామని ప్రకటించినా.. ఇప్పటి వరకు ఆర్డినెన్స్ తీసుకురాలేదని అసహనం వ్యక్తంచేశారు. మాదిగల ఓట్లు దండుకోవడానికి బీజేపీ చూస్తోందన్నారు. హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ పులిజాల గెలువయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం తాము రాజీలేని పోరాటం చేస్తామని, అందుకు మాదిగలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షుడు సంద్రపల్లి వెంకటయ్య, వివిధ జిల్లాల ప్రతినిధులు జి.డి.నర్సింహ, మంచాల యాదగిరి, గుర్రాల శ్రీనివాస్, కొండు మోహన్, సాంబయ్య, మేడి రమణ, నాగారం బాబు తదితరులు మాట్లాడారు.

ఏసీబీకి చిక్కిన హెడ్‌కానిస్టేబుల్

- రూ.50 వేల లంచం తీసుకుంటూ దొరికిపోయిన వైనం
- ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఘటన
- బాధితుడు సైతం రిటైర్డ్ పోలీసు ఉద్యోగి



కోటేశ్వరరావు(ఎడమ)ను విచారిస్తున్న ఏసీబీ డీఎస్పీ

ఖమ్మంక్రైం: కంచె చేను మేసిన చందంగా ఓ రిటైర్డ్ ఎస్‌ఐ కుటుంబం నుంచి హెడ్ కానిస్టేబుల్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఖమ్మంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేకెత్తించింది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ కథనం ప్రకారం.. ఖమ్మంకు చెందిన రిటైర్డ్ ఎస్‌ఐ బూర్ల రామారావు, ఆయన కుమారులు విష్ణు, విజయ్‌కు కుమార్తె అనుమోలు నాగజ్యోతికి మధ్య ఆస్తివివాదం ఉంది. తండ్రి, సోదరులు మోసం చేశారని, తనకు సంబంధించిన ఆస్తిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆమె 2022లో ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదైంది. అయితే, రామారావు, ఆయన కుమారులు హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేయగా వారికి 41 సీఆర్పీసీ కింద నోటీసులు ఇవ్వాలని కొన్నాళ్లకు కోర్టు పోలీసులను ఆదేశించింది. అప్పటినుంచి ఆ నోటీసులు ఇవ్వాలని ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వర్తించే హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు చుట్టూ రామారావు కుమారుడైన విష్ణు తిరుగుతున్నారు. కానీ నోటీసులు ఇవ్వడానికి కోటేశ్వరరావు రూ.50 వేలు డిమాండ్ చేయగా, రామారావు తాను రిటైర్డ్ పోలీసు ఉద్యోగినేనని నచ్చచెప్పినా ససేమిరా అన్నాడు. దీంతో వారు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు విష్ణు రూ.50 వేలను సోమవారం కోటేశ్వరరావుకు పోలీస్‌స్టేషన్ బయట ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కోటేశ్వరరావుపై గతంలోనూ ఆరోపణలు..

ఏసీబీకి చిక్కిన హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావుపై గతంలోనూ అవినీతి ఆరోపణలు ఉన్నాయని చెబుతున్నారు. సొంత సిబ్బందికి సైతం ఎన్‌ఓసీలు, ఇతర సర్టిఫికెట్లు ఇవ్వాలంటే డబ్బు డిమాండ్ చేస్తాడని, ఉన్నతాధికారులు చెప్పినా పట్టించుకోడని తెలిసింది. అంతేకాక స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాడని సమాచారం. కాగా, కోటేశ్వరరావును ఏసీబీ అధికారులు తమ కార్యాలయానికి తరలించారు. మంగళవారం ఆయనను కోర్టులో హాజరుపర్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

పెండింగ్ బిల్లుల కోసం సర్పంచ్‌ల రాస్తారోకో



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్‌లు

చౌటుప్పల్: ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో సోమవారం సర్పంచ్‌లు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య, ప్రధానకార్యదర్శి కొలను శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బిల్లుల బకాయిలు రాకపోవడంతో ఇప్పటికే పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్యకు పాల్పడ్డారని విచారం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండానే గ్రామపంచాయతీల బాధ్యతలను అధికారులకు అప్పగించడం సరికాదన్నారు. పంచాయతీలకు ఎన్నికలు జరిగే వరకు పర్సన్ ఇన్‌చార్జీలుగా సర్పంచ్‌లనే నియమించాలని డిమాండ్ చేశారు. ఫోరం చౌటుప్పల్ మండల అధ్యక్షుడు మునగాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారుల పాలనలో బిల్లులు వసూలయ్యే పరిస్థితి ఉండక మరింతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకునే ప్రమాదముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల సర్పంచ్‌లు బాతరాజు సత్యం, కాయితి రమేశ్, వాకిటి భూలక్ష్మమ్మ భూపాల్‌రెడ్డి, చిన్నం లావణ్యమల్లేశ్, ఎలువర్తి యాదగిరి, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, చాట వేణుగోపాల్, కొర్వారి సైదులు, చీరిక రాణిరంగారెడ్డి, బూర్గు చంద్రకళ కృష్ణారెడ్డి, నర్సింహనాయక్, బచ్చు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువకు నీరు విడుదల చేయాలి: జూలకంటి

రైతులతో కలసి మిర్యాలగూడ–దేవరకొండ రహదారిపై రాస్తారోకో



హాలియాలో రైతులకు మద్దతుగా రాస్తారోకోలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

హాలియా: నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా హాలియా సమీపంలోని సూరేపల్లి మేజర్ వద్ద మిర్యాలగూడ–దేవరకొండ రహదారిపై రైతులు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. రైతులకు జూలకంటి రంగారెడ్డి సంఘీభావం తెలిపి మీడియాతో మాట్లాడారు. ఆయకట్టు పరిధిలో భూగర్భ జలాలు అడుగంటడంతో ఎకరాకు రూ. 25 వేలు పెట్టి సాగు చేసిన పంటలు ఎండే దశలో ఉన్నాయన్నారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. గతంలో ప్రభుత్వాలు ప్రాజెక్టులో 505 అడుగుల మేర నీరు ఉన్నప్పుడు కూడా తాగు, సాగునీటిని అందించిన సందర్భాలు ఉన్నాయని రంగారెడ్డి గుర్తుచేశారు. సాగర్‌లో తగిన నీరు లేకుంటే ఎగువున్న ఆల్మట్టి డ్యాం నుంచి నీటిని తెచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వాన్ని సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, కూన్‌రెడ్డి నాగిరెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

లోటుపాట్లు లేకుండా 'ఇందిరమ్మ' ఇళ్లు

- గృహనిర్మాణ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- తొలిదశలో ప్రతి సెగ్మెంట్‌లో కనీసం 3,500 ఇళ్ల మంజూరుకు నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా 'ఇందిరమ్మ' ఇళ్ల నిర్మాణం జరగాలని అధికారులను సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరిగిన పలు లోటుపాట్లు ఇప్పుడు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం పూర్తిగా విఫలమైందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం మెరుగ్గా కొనసాగాలని స్పష్టం చేశారు. రేవంత్ సోమవారం రాత్రి సుమారు మూడున్నర గంటల పాటు గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ స్వగృహలో అమ్ముడుపోకుండా ఉన్న ఇళ్లు, హౌసింగ్ బోర్డు స్థలాలు తదితర అంశాలపై సీఎం ఆరా తీశారు. తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500కు తగ్గకుండా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని ఆదేశించినట్టు తెలిసింది.

స్వగృహ ఇళ్ల విక్రయంపై దృష్టి : ఆరు గ్యారంటీల అమలుపై ఏర్పాటు చేసిన కమిటీ 'ఇందిరమ్మ' ఇళ్ల పథకం విధివిధానాలను ఖరారు చేస్తుందని సీఎం పేర్కొన్నారు. రాజీవ్ స్వగృహ ఇళ్లను విక్రయించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పనులు పూర్తి చేస్తే కావాల్సిన నిధులెన్ని? ఉన్నవి ఉన్నట్టు అమ్మితే ఖరారు చేయాల్సిన ధరలేమిటన్న దానిపై చర్చించారు. ఇక డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో అవినీతిపై విచారణ చేపట్టే అంశం కూడా సమీక్షలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సర్కారు సీరియస్.. సీఎంఆర్ వాపస్!

- 2022–23 ఖరీఫ్ సీజన్ ధాన్యం విషయంలో మిల్లర్ల ఆగడాలపై ఫోకస్
- ముక్కు పిండి బియ్యం సేకరిస్తున్న పౌర సరఫరాల శాఖ
- శనివారం ఒకేరోజున 56వేల టన్నుల సీఎంఆర్ అప్పగించిన మిల్లర్లు
- ఇది పౌర సరఫరాల శాఖ చరిత్రలోనే అత్యధికం అంటున్న అధికారులు
- 50రోజుల్లో 40శాతం పెరిగిన సీఎంఆర్ బియ్యం రికవరీ



సాక్షి, హైదరాబాద్: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విషయంలో రాష్ట్ర సర్కారు కఠినంగా వ్యవహరిస్తుండటంతో రైస్‌మిల్లర్లు దారికి వస్తున్నారు. ఈ నెల 31వ తేదీ తర్వాత గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను తీసుకోబోమని, దానికి బదులు నగదు వసూలు చేస్తామని సర్కారు స్పష్టం చేసింది. దీంతో ఇన్నాళ్లు సర్కారు సొమ్ముతో అక్రమ దందాలు సాగించిన మిల్లర్లు.. 2022–23 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి అప్పగించేందుకు కిందామీదా పడుతున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా మిల్లుల్లో మర ఆడిస్తూ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించే పనిలో పడ్డారు.

50రోజుల్లోనే 14.50 ఎల్ఎంటీ అప్పగింత

2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 65 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యాన్ని సేకరించింది. దాన్ని రాష్ట్రంలోని 3,300 రైస్ మిల్లులకు అప్పగించింది. మిల్లర్లు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి.. 43.73 లక్షల టన్నుల బియ్యాన్ని (సీఎంఆర్‌ను) పౌరసరఫరాల సంస్థకు అప్పగించాలి. నిబంధనల ప్రకారం.. ఆరు నెలల నుంచి 9 నెలల్లో ఇది పూర్తికావాలి. కానీ 2022 ఆగస్టు నుంచి నవంబర్ 2023 వరకు.. అంటే 16 నెలల్లో మిల్లర్లు 24.50 లక్షల టన్నుల బియ్యాన్ని మాత్రమే అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అవడంతో.. గత డిసెంబర్ రెండో వారం నుంచి జనవరి 27 వరకు దాదాపు 50 రోజుల్లోనే 14.50 లక్షల టన్నులను తిరిగి అప్పగించారు.

మూడేళ్లుగా తీవ్ర జాప్యం చేస్తూ..

జాతీయ ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖ రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపుతుంది. మిల్లులు ఆ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)గా మార్చి జాతీయ ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు అప్పగించాలి. ఇందుకోసం క్వింటాల్‌కు ఇంత అని ప్రభుత్వం చార్జీ చెల్లిస్తుంది. ధాన్యాన్ని మిల్లింగ్ చేసినప్పుడు తవుడు, నూకలు వంటివిపోగా.. 67 కిలోల బియ్యం వస్తుందని అంచనా. ఈ లెక్క మేరకే మిల్లులు సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించాలి. ఈ బియ్యం సెంట్రల్ పూల్ కింద ఎఫ్‌సీఐ గోదాములకు చేరుతుంది. ఎఫ్‌సీఐ నుంచి కేంద్రం సబ్సిడీతో కేటాయించిన మేరకు బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని, రేషన్ ద్వారా పేదలకు అందిస్తుంది. కానీ మూడేళ్లుగా కేంద్రం నిర్దేశించిన గడువులోగా బియ్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి పంపడం లేదు. గడువు ముగిశాక, అదీ తమ మిల్లుల్లో మిగిలిపోయిన నాణ్యత లేని బియ్యాన్ని, రేషన్ డీలర్ల నుంచి కొని రీసైకిల్ చేసిన బియ్యాన్ని సీఎంఆర్ కింద అప్పగిస్తున్నారు. ఈ జాప్యం కారణంగా, ఎఫ్‌సీఐ నుంచి నిధులు రాకపోవడంతో పౌరసరఫరాల సంస్థకు ఇబ్బంది ఎదురవుతోంది. ప్రభుత్వ సబ్సిడీ అందక ఏటికేడు అప్పులు పెరుగుతున్నాయి. 2014లో రూ.3 వేల కోట్లుగా ఉన్న అప్పులు ఇప్పుడు రూ.56వేల కోట్లకు చేరడం గమనార్హం.

మిల్లులపై వరుస దాడులతో..

కాంగ్రెస్ సర్కారు కొన్నిరోజులుగా సీఎంఆర్ బియ్యం అంశంపై ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ అధికారులు మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే ధాన్యాన్ని అమ్మేసుకున్న మిల్లర్లు దీనితో అప్రమత్తమయ్యారు. ఎక్కడో ఒకచోట ధాన్యాన్ని కొని, మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి అప్పగించే పనిలో పడ్డారు. రెండు నెలల కిందటి వరకు రోజుకు ఐదారు వేల టన్నుల సీఎంఆర్ మాత్రమే వస్తే.. గత 50 రోజుల్లో రోజుకు సగటున 30వేల టన్నుల దాకా రికవరీ అవుతోంది. పౌరసరఫరాల శాఖ చరిత్రలోనే అత్యధికంగా ఈ నెల 27న ఒకేరోజు 56,843 టన్నుల సీఎంఆర్ అందడం గమనార్హం.

కొత్తగా ధాన్యం ఇస్తేనే.. పాత బకాయిలు చెల్లిస్తా!

లేకుంటే మిల్లు మూసేస్తా.. సూర్యాపేట కలెక్టర్‌కు కోదాడలోని ఓ మిల్లర్ లేఖ

కోదాడ: గత రెండు వ్యవసాయ సీజన్లకు సంబంధించి దాదాపు రూ.70కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సిన సూర్యాపేట జిల్లా కోదాడలోని కొమరబండకు చెందిన రైస్‌మిల్లర్ తిరిగి సర్కారుకే కొర్రీ పెట్టారు. 2022–23 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి ప్రభుత్వానికి తిరిగివ్వాల్సిన 20,472 టన్నుల బియ్యాన్ని అందజేయాలంటే.. ప్రస్తుత (2023–24) వానాకాలం సీజన్‌కు సంబంధించి కొత్త ధాన్యాన్ని తమకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పాత బకాయిలను ఇవ్వడం తనవల్ల కాదని, మిల్లును మూసేస్తానని పేర్కొంటూ ఏకంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. కొత్త ధాన్యం కేటాయించకుండానే, పాత బకాయిలు కట్టాలంటే.. ఏడాది గడువు ఇవ్వాలని కోరారు. అంతేగాకుండా తమ అసోసియేషన్‌కు చెందిన ఒక మిల్లర్ తన మిల్లుకు తగిన సామర్థ్యం లేకపోయినా అధికారులను లోబర్చుకుని అధికంగా ధాన్యం కేటాయింప జేసుకున్నారని.. ధాన్యమంతా అమ్ముకొని, పీడీఎస్ బియ్యాన్ని సీఎంఆర్ కింద అప్పగించారని ఆరోపించారు.

మాజీ మంత్రి నర్సారెడ్డి కన్నుమూత

- నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు..



నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క



(ఫైల్)

సాక్షి, హైదరాబాద్/ నిర్మల్: స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొద్దుటూరి నర్సారెడ్డి (92) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం వేకువజామున హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం మలక్‌చించోలికి చెందిన నర్సారెడ్డి 1931, సెప్టెంబర్ 22న జన్మించారు. తన సేవలతో ప్రజల్లో నర్సన్నబాపుగా గుర్తింపు పొందారు. ఆయన భౌతికకాయాన్ని కార్యకర్తలు నివాళులు అర్పించేందుకు గాంధీభవన్‌లో 2 గంటలపాటు ఉంచారు. నర్సారెడ్డి అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏకగ్రీవంగా ఎన్నికై..: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివిన నర్సారెడ్డి ఆ రోజుల్లోనే బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. నిజాం నిరంకుశ పరిపాలన నుంచి హైదరాబాద్ విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఆయన పాల్గొన్నారు. రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1962, 67 ఎన్నికల్లో వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. 1972 ఎన్నికల్లో నర్సారెడ్డిపై పోటీకి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికై హ్యాట్రిక్ కొట్టారు. ఒక సారి ఎమ్మెల్సీగా, ఆదిలాబాద్ ఎంపీగానూ ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. జలగం వెంగళరావు మంత్రివర్గంలో నీటిపారుదల శాఖ, రెవెన్యూ, శాసనసభా వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. ప్రస్తుత నేతల్లో ఎందరికో రాజకీయ గురువైన నర్సారెడ్డికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, వారెవరూ రాజకీయాల్లోకి రాకపోవడం గమనార్హం.

నివాళులర్పించిన సీఎం..: మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లోని వైట్‌హౌస్‌లో నర్సారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. అంతకుముందు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు పటేల్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, బీజేపీ నేత ఈటల రాజేందర్, మాజీ మంత్రి జానారెడ్డి తదితరులు నర్సారెడ్డికి నివాళులర్పించారు.

రెండేళ్లుగా పోరాడుతున్నాం.. న్యాయం చేయండి

సీఎంను కలిసేందుకు వచ్చిన స్టాఫ్ నర్సులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): రెండేళ్లుగా తమను సొంత జోన్లకు కేటాయించాలని ఉద్యమిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ స్టాఫ్ నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున స్టాఫ్ నర్సులు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీవో ద్వారా తమకు అన్యాయం జరిగి మారుమూల ప్రాంతాలకు కేటాయించినా.. హైకోర్టు తమకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. కానీ గత ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదని, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా తమకు న్యాయం చేస్తారని హామీ ఇచ్చారన్నారు. కొత్త జీవో కింద ఉద్యోగాలు కేటాయించడానికి ముందు తమకు న్యాయం చేయాలని, లేదంటే తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు వినతిపత్రాన్ని సీఎం కార్యాలయ అధికారులకు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 500 నుంచి 700 మంది స్టాఫ్ నర్సులు 317 జీవో కింద అన్యాయానికి గురయ్యారని వెల్లడించారు.

అవసరమైతే సిట్టింగ్‌లూ చేంజ్!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించింది. ఫిబ్రవరిలో 10లోగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ సన్నాహక సమావేశాలు పూర్తి చేయడంపై దృష్టి సారించింది. మరోవైపు కాలుజారి పడి ప్రస్తుతం కోలుకుంటున్న కేసీఆర్ ఫిబ్రవరి 1న గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తర్వాత పార్టీ కీలక నేతలతో సమావేశమై అభ్యర్థుల ఎంపికపైనా అభిప్రాయ సేకరణ జరపాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు చేవెళ్ల (రంజిత్‌రెడ్డి), జహీరాబాద్ (బీబీ పాటిల్), ఖమ్మం (నామా నాగేశ్వర్‌రావు) లోక్‌సభ స్థానాల నుంచి సిట్టింగ్ ఎంపీలకే మరోమారు టికెట్ ఇస్తున్నట్లు బీఆర్ఎస్ సంకేతాలు ఇచ్చింది. కరీంనగర్ నుంచి పోటీకి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారు. ఇక నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ కవిత పోటీ చేయడం లేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజక వర్గాలైన ఆదిలాబాద్, మహబూబాబాద్, పెద్దపల్లి, వరంగల్, నాగర్‌కర్నూలులో కొత్త పేర్లు తెరమీదకు వస్తున్నాయి. కొన్నిచోట్ల ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

ఆశావహుల జాబితా పెద్దదే

అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి, మెదక్ సహా విపక్షాల కంటే ఎక్కువ ఓట్లు సాధించిన 7 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో టికెట్ కోసం ఆశావహులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. మెదక్ టికెట్‌ను సుమారు అరడజను మంది ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, మాజీ ఐఏఎస్, ఎమ్మెల్సీ వెంకటరాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి పేర్లు తెరమీదకు వస్తున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేసి అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరిన గాలి అనిల్ కుమార్ కూడా టికెట్ అడుగుతున్నారు. మల్కాజిగిరిపై మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి, కోడలు ప్రీతితో పాటు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఆసక్తి చూపుతున్నారు. నిజామాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, విద్యా సంస్థల అధినేత నర్సింహారెడ్డి, ఆదిలాబాద్ నుంచి మాజీ ఎంపీ గోడెం నగేశ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు టికెట్ ఆశిస్తున్నారు. పెద్దపల్లి నుంచి సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. వరంగల్ నుంచి మాజీ ఎమ్మెల్యేలు ఆరూరు రమేశ్, తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి కుమార్తె కావ్య, తొర్రూరు జెడ్పీటీసీ సభ్యుడు, మహబూబాబాద్ జెడ్పీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ టికెట్ ఆశిస్తున్నారు. మహబూబాబాద్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్, మాజీ మంత్రి రెడ్యానాయక్ రేసులో ఉన్నారు. నల్లగొండ నుంచి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డి, భువనగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. నాగర్‌కర్నూలు నుంచి ఎంపీ రాములు లేదా ఆయన కుమారుడు భరత్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు టికెట్ ఆశిస్తున్నారు. మహబూబ్‌నగర్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని మార్చే పక్షంలో మాజీ మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్లు పరిశీలించే అవకాశముంది. సికింద్రాబాద్ నుంచి మాజీ మంత్రి తలసాని కుమారుడు సాయికిరణ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు మోతె శోభన్‌రెడ్డి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్ నుంచి టికెట్ ఇవ్వాలని బీఆర్ఎస్ యువజన విభాగం మాజీ ఉపాధ్యక్షుడు పట్నం కమలాకర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు దరఖాస్తు అందజేశారు.

ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేయాలి

- ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: దీర్ఘకాలంగా ఆర్టీసీ కార్మికులు ఎదురుచూస్తున్న వేతన సవరణ విషయంలో ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు కోరారు. రెండు వేతన సవరణలు అమలు చేయకపోవడంతోపాటు, అంతకుముందు వేతన బకాయిలు ఇంకా చెల్లించలేదని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో నిర్వహించనున్న ఆర్టీసీ సమీక్షలో వాటిని కొలిక్కి తేవాలని కోరారు. అలాగే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను తొందరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెండు వేతన సవరణలు వర్తింపచేయటంతోపాటు ఆర్థికపరమైన అన్ని బకాయిలు చెల్లించాలని మెజారిటీ యూనియన్ల ఆర్టీసీ జేఏసీ కోరింది.

వేములవాడకు పోటెత్తిన భక్తులు

దర్శనానికి ఐదు గంటల సమయం



రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామికి సమ్మక్క జాతర భక్తుల తాకిడి పెరిగింది. సోమవారం 50 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ పెరిగిపోవడంతో ఆలయ అధికారులు ఆర్జిత సేవలను రద్దు చేసి, సోమవారం అర్ధరాత్రి వరకు దర్శనాలకు అవకాశం ఇచ్చారు. దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. వీఐపీల తాకిడి పెరిగిపోవడంతో పీఆర్వో కార్యాలయాన్ని అధికారులు మూసివేశారు. ఆలయానికి రూ.60 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు.

యూనిట్ టెస్ట్‌లో మార్కులు తక్కువ వచ్చాయని..

- సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య
- కరీంనగర్ జిల్లా చింతకుంటలో ఘటన

కొత్తపల్లి(కరీంనగర్): 'అమ్మా, నేను చనిపోతున్నా.. నాకు తక్కువ మార్కులు వచ్చాయి.. నన్ను క్షమించండి' అంటూ సూసైడ్ నోట్ రాసి ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో సోమవారం చోటుచేసుకుంది. కొత్తపల్లి ఏఎస్సై పోచయ్య కథనం ప్రకారం... మల్యాల మండలం మ్యాడంపల్లికి చెందిన జనుప అక్షిత(17) రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ సీఈసీ మొదటి సంవత్సరం చదువుతోంది. కొద్దిరోజులుగా కళాశాలకు గైర్హాజరైన అక్షితకు ఇటీవల యూనిట్ టెస్ట్‌లో తక్కువ మార్కులు రావడంతో అవమానంగా భావించింది. ఈ క్రమంలో సాయంత్రం స్టడీ అవర్ అనంతరం భోజనం చేసేందుకు విద్యార్థులందరూ వెళ్లగా, అక్షిత డార్మెటరీలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. సిబ్బంది వెంటనే ఆమెను కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై పోచయ్య పేర్కొన్నారు. కాగా, విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో హౌస్‌మాస్టర్, ప్రిన్సిపాల్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని, నిబంధనల ప్రకారం ప్రిన్సిపాల్ జేజే థెరిస్సా హాస్టల్‌లో ఉండటంలేదని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ అన్నారు. బాధితురాలి కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

మళ్లీ పౌరసత్వ రగడ!

వారంలో సీఏఏ అమలు ఖాయం ● పౌరసత్వ (సవరణ) చట్టంపై కేంద్రం

నాలుగేళ్ల కిందే రూపొందిన చట్టం ● వ్యతిరేకిస్తున్న పలు రాష్ట్రాలు, విపక్షాలు ● తీవ్ర ఆందోళనలు, నిరసనలు, కేసులు

వివాదాస్పద పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ) అంశం మరోసారి దుమారం రేపుతోంది. సీఏఏను వారం రోజుల్లో దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర మంత్రి శంతను ఠాకూర్ ప్రకటించడంతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇది లోక్‌సభ ఎన్నికల లబ్ధి కోసం చేసిన ఉత్తుత్తి ప్రకటన అంటూ తృణమూల్ కాంగ్రెస్ కొట్టిపారేసింది. 2019లోనే మోదీ సర్కారు సీఏఏ చట్టం చేసినా దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత, ఆందోళనలతో దాని అమలు వాయిదా పడుతూ వస్తోంది. కానీ సీఏఏ అమలుపై బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ సర్కారు పట్టుదలగా ఉందని ఇటీవలి వరుస పరిణామాలు చెబుతున్నాయి. ఎవరేమనుకున్నా దేశమంతటా దాని అమలు తప్పదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా గత నెలలోనే స్పష్టం చేశారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ చట్టం...

పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లకు చెందిన ముస్లిమేతర వలసదారులకు భారత పౌరసత్వం కల్పించడం సీఏఏ ఉద్దేశం. 2014 డిసెంబర్ 31కి ముందు భారత్‌కు వలస వచ్చిన వారు ఇందుకు అర్హులు. హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు, క్రైస్తవులకు సీఏఏ వర్తిస్తుంది. వీరికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా, వాటి గడువు ముగిసినా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులే. ఈ మేరకు 1955 నాటి పౌరసత్వ చట్టానికి ఎన్డీఏ సర్కారు సవరణలు చేసింది. సీఏఏ బిల్లును తొలుత 2016లో పార్లమెంటులో ప్రవేశపెట్టగా అప్పటి ఎన్డీఏ మిత్రపక్షమైన అసోం గణపరిషత్ తదితర పార్టీలు వ్యతిరేకించాయి. అనంతరం 2019లో సీఏఏ బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఆమోదించాయి. తర్వాత రాష్ట్రపతి ఆమోదముద్రతో ఇది చట్టంగా మారింది.

- ➤ గడువులోపు భారత్‌కు వలస వచ్చిన మతపరమైన మైనారిటీలకు ఆరేళ్లలోపు పౌరసత్వం కల్పిస్తారు.
- ➤ వాళ్లు భారత్‌లో కనీసం 11 ఏళ్లుగా నివసిస్తూ ఉండాలన్న నిబంధనను కూడా ఐదేళ్లకు తగ్గించారు.
- ➤ పౌరసత్వమిచ్చేందుకు ఇలా మతాన్ని ప్రాతిపదికగా తీసుకోనుండటం భారత్‌లో ఇదే తొలిసారి.
- ➤ అయితే సీఏఏ పరిధిలో ముస్లిం మైనారిటీలను చేర్చకపోవడం వివాదాస్పదంగా మారింది.

ఎందుకు వ్యతిరేకత...

ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమబెంగాల్‌తో పాటు దేశ రాజధాని ప్రాంతంలోనూ పాక్, బంగ్లా, అఫ్గాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర మైనారిటీలు అధిక సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా బెంగాల్లో మతువా సామాజిక వర్గంలో అత్యధికులు బంగ్లాదేశ్‌లో తమపై ముస్లింల అణచివేత, తీవ్ర హింసాకాండను తట్టుకోలేక 1950ల నుంచీ వలస వచ్చిన వారే. వీరంతా 1990ల నాటికే బెంగాల్లో ప్రబలమైన ఓటు బ్యాంకుగా స్థిరపడ్డారు. దాంతో వీరి మద్దతు కోసం పార్టీలన్నీ ప్రయత్నించడం పరిపాటిగా మారింది. నిజానికి సీఏఏ అమలుతో అత్యధికంగా లబ్ధి పొందేది మతువాలేనంటారు. ఈశాన్య రాష్ట్రాల్లోనూ బంగ్లాదేశ్ నుంచి ఎంతోమంది అక్రమంగా ప్రవేశించారు. సీఏఏ అమల్లోకి వస్తే వీరంతా ఎలాంటి ధ్రువీకరణలతోనూ నిమిత్తం లేకుండా నేరుగా భారత పౌరసత్వం పొందుతారు. అలా చేస్తే వీరంతా మెజారిటీ పౌరులుగా మారతారని స్థానికులంటున్నారు. దాంతో హక్కులు, సంస్కృతీ సంప్రదాయాలకు భంగం కలగడమే గాక ఉపాధి అవకాశాలకూ దెబ్బ పడుతుందన్నది వారి వాదన. పైగా బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి మరింత భారీగా వలసలకు ఇది బాటలు వేస్తుందని వారంటున్నారు. దాంతో 2019లో సీఏఏ బిల్లుకు చట్టబద్ధత రాగానే దాని అమలును వ్యతిరేకిస్తూ ఆయా రాష్ట్రాల్లో తీవ్ర ఆందోళనలు చెలరేగాయి. అసోం తదితర రాష్ట్రాల్లో సీఏఏ వ్యతిరేక ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. సీఏఏ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య తరచూ ఘర్షణలు చెలరేగుతున్నాయి.



ముస్లింలలోనూ ఆందోళన...

ముస్లింల నుంచి కూడా సీఏఏపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది ప్రధానంగా తమనే లక్ష్యం చేసుకుని తెచ్చిన చట్టమన్నది వారి అభ్యంతరం. ''ఏ ధ్రువీకరణ పత్రాలూ లేని ముస్లింలపై అక్రమ వలసదారులుగా సీఏఏ సాయంతో ముద్ర వేస్తారు. ఈ కారణంగానే ఇతర దేశాల నుంచి వలస వచ్చిన ముస్లిం మైనారిటీలకు సీఏఏను వర్తింపజేయడం లేదు'' అన్నది వారి వాదన. పాకిస్తాన్‌లో షియా తదితర ముస్లింలు కూడా తీవ్రమైన అణచివేతకు గురై భారత్ వలస వచ్చారని, సీఏఏ అమలుతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని వారంటున్నారు. సీఏఏను వ్యతిరేకిస్తూ పలు ముస్లిం వర్సిటీల్లో కూడా విద్యార్థులు తీవ్ర స్థాయిలో నిరసనలకు దిగారు. వాటిని అణచివేసే క్రమంలో జరిగిన ఘర్షణలు ప్రాణనష్టానికీ దారి తీశాయి. కేంద్రం మాత్రం పాక్, బంగ్లా, అఫ్గాన్ వంటి దేశాల్లో ముస్లింలపై అకృత్యాల వాదనను తోసిపుచ్చుతోంది. మరోవైపు టిబెట్, మయన్మార్, శ్రీలంకల నుంచి వలస వచ్చిన మతపరమైన మైనారిటీలకు సీఏఏను వర్తింపజేయకపోవడం అన్యాయమన్న విమర్శలూ ఉన్నాయి.

సుప్రీంలో వివాదం: ఈ నేపథ్యంలో మొత్తంగా సీఏఏ చట్టం రాజ్యాంగబద్ధతనే సవాలు చేస్తూ తృణమూల్‌తో పాటు కాంగ్రెస్, ఆర్జేడీ, మజ్లిస్ తదితర పక్షాలు ఇప్పటికే సుప్రీంకోర్టులో కేసులు వేశాయి. జమాయిత్ ఉలేమా ఇ హింద్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ఇంప్లీడయ్యాయి. వీటిపై విచారణ తుది దశకు చేరుతోంది.

ఎన్‌ఆర్‌సీ రగడ...

సీఏఏలో భాగంగా తెరపైకి వచ్చిన జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ) కూడా వివాదానికి మరింతగా ఆజ్యం పోసింది. అక్రమ వలసదారులను గుర్తించి వెనక్కు పంపడం దీని ప్రధానోద్దేశం. ఇందులో భాగంగా వలసదారుల నివాస తదితర ధ్రువీకరణ పత్రాలను నమోదు చేయడం తప్పనిసరి. తద్వారా పౌరసత్వానికి చట్టపరంగా అర్హులైన జాబితాను రూపొందిస్తారు. సరైన పత్రాలు లేనివారిని అక్రమ వలసదారులుగా నిర్ధారిస్తారు. 2020లో అసోంలో మాత్రమే అమలు చేసిన ఎన్‌ఆర్‌సీని దేశవ్యాప్తం చేస్తామని మోదీ సర్కారు ప్రకటించింది. దీనిపైనా రగడ కొనసాగుతోంది.

రేపట్నుంచి బడ్జెట్ సమావేశాలు

నేడు అఖిలపక్ష సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఉభయ సభల్లోని పార్టీల ఫ్లోర్ లీడర్లతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి భేటీ అవుతారు. సమావేశాలు ఫిబ్రవరి 9 దాకా కొనసాగుతాయి. తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. ఫిబ్రవరి ఒకటిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడతారు.

పింఛనుకు సంతానాన్నీ నామినేట్ చేయొచ్చు

మహిళా ఉద్యోగులకు కేంద్రం వెసులుబాటు

న్యూఢిల్లీ: మహిళా ఉద్యోగుల కుటుంబ పింఛను విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగినులు పెన్షన్ నామినీగా భర్తకు బదులుగా కుమార్తె లేదా కుమారుడి పేరును సైతం సూచించవచ్చంటూ సోమవారం ప్రకటన విడుదల చేసింది. ఇప్పటి వరకు మృతి చెందిన ఉద్యోగి లేదా పింఛనుదారు జీవిత భాగస్వామికి మాత్రమే కుటుంబ పింఛను అందించేవారు. భాగస్వామి అనర్హులైన, మరణించిన సందర్భాల్లో మాత్రమే ఇతర కుటుంబసభ్యులకు పింఛను అర్హత ఉండేది.

2023లో భారతీయులకు 14 లక్షల వీసాలు

సాక్షి, న్యూఢిల్లీ: 2023లో భారతీయులకు 14 లక్షల వీసాలను జారీ చేసినట్లు ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయం తెలిపింది. 2022తో పోలిస్తే ఇది 60 శాతం ఎక్కువని వివరించింది. ఏ దేశానికీ ఇన్ని వీసాలు జారీ కాలేదని పేర్కొంది. విజిటింగ్ వీసా అపాయింట్‌మెంట్ వెయిటింగ్ సమయం 1,000 రోజుల నుంచి 250 రోజులకు (75 శాతం) తగ్గిందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి 10 మందిలో ఒకరు భారతీయులేనని ప్రకటించింది. బీ1, బీ2 కేటగిరీల విజిటర్ వీసాల కోసం మునుపెన్నడూ లేనంతగా 7 లక్షల దరఖాస్తులు అందాయని తెలిపింది. స్టూడెంట్ వీసాల జారీలో దేశంలో ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై టాప్‌లో ఉన్నాయంది. అమెరికాలో చదివే 10 లక్షల పైచిలుకు అంతర్జాతీయ విద్యార్థుల్లో 2.5 లక్షల మంది భారతీయులేనని ఢిల్లీ ఎంబసీ తెలిపింది.

అమెరికాలో భారతీయ విద్యార్థి దారుణ హత్య

న్యూయార్క్: అమెరికాలో భారతీయ విద్యార్థి ఒకరు దారుణ హత్యకు గురయ్యారు. డ్రగ్స్‌కు బానిసైన ఒకడు ఆయన్ను సుత్తితో దారుణంగా కొట్టి ప్రాణాలు తీశాడు. హరియాణాకు చెందిన వివేక్ సైనీ బీటెక్ పూర్తి చేసుకుని రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. ఇటీవలే బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంబీయే పూర్తి చేసిన అతడు..జార్జియా రాష్ట్రం లిథోనియా నగరంలో ఉంటూ ఓ స్టోర్‌లో పార్ట్-టైం క్లర్కుగా పనిచేస్తున్నాడు. అదే స్టోర్ వద్ద నిలువ నీడ లేని జులియన్ ఫాల్క్‌నర్ అనే డ్రగ్ అడిక్ట్ ఉంటున్నాడు. వివేక్ అతడికి రెండు రోజులుగా నీళ్లు, చిప్స్, కోక్ ఇస్తున్నాడు. చలి నుంచి కాపాడుకునేందుకు జాకెట్ సైతం అతడికి ఇచ్చాడు. ఈ నెల 16వ తేదీన ఫాల్క్‌నర్ ఇంటికి వెళ్తున్న వివేక్‌కు అడ్డుగా నిలిచాడు. అడ్డు తొలగకుంటే పోలీసులకు చెబుతానంటూ హెచ్చరించాడు. అతడు లక్ష్యపెట్టక సుత్తితో వివేక్‌పై దాడికి దిగాడు. వివేక్ తలపై 50సార్లు సుత్తితో మోదాడు. సమాచారం అందుకుని పోలీసులు వచ్చే సరికి వివేక్ మృతదేహం వద్దే ఆ ఉన్మాది ఉండటం గమనార్హం.

సోరెన్ కోసం ఈడీ వెదుకులాట

జార్ఖండ్ సీఎం జాడ తెలియడం లేదంటున్న అధికారులు



న్యూఢిల్లీ/రాంచీ: భూ కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను ప్రశ్నించేందుకు సోమవారం ఉదయం ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లిన ఈడీ అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. ఆయన ఇంట్లో లేరని, ఎక్కడున్నారో జాడ తెలియడం లేదని, సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయిందని అధికారులు చెప్పారు. జనవరి 27 రాత్రి రాంచీ నుంచి ఢిల్లీ బయల్దేరిన సోరెన్ ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. జనవరి 31 మధ్యాహ్నం రాంచీలోని నివాసంలో అందుబాటులో ఉంటానని ఆయన నుంచి మెయిల్ అందినట్లు తెలిపారు. ఈడీ అధికారులు రాత్రి దాకా ఢిల్లీ నివాసంలోనే పడిగాపులు కాశారు. సోరెన్ ఆచూకీ దొరికే దాకా అక్కడే ఉంటామని స్పష్టం చేశారు. ఆయన గురించి ఢిల్లీ విమానాశ్రయాన్ని కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. తనకందిన తాజా సమన్లను కక్షసాధింపు చర్యగా మెయిల్‌లో సోరెన్ అభివర్ణించారు.

56 రాజ్యసభ స్థానాలకు 27న ఎన్నికలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 56 రాజ్యసభ స్థానాలు ఏప్రిల్లో ఖాళీ అవుతున్నాయి. వాటికి ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 8న నోటిఫికేషన్ రానుంది. 15 వరకు నామినేషన్ల స్వీకరణ, 16న పరిశీలన, 20 వరకు ఉపసంహరణ ఉంటాయి. ఫిబ్రవరి 27న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుంది. ఐదింటికి గంటలకు కౌంటింగ్ ముగించి ఫలితాలను ప్రకటిస్తారు. పదవీకాలం ముగుస్తున్న ఎంపీల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు తదితరులున్నారు.

యూపీలో అత్యధికంగా 10 ఖాళీలు

ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి అత్యధికంగా 10 ఉన్నాయి. బిహార్, మహారాష్ట్రల్లో చెరో 6, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో చెరో 5, కర్ణాటక, గుజరాత్‌లో చెరో 4, ఏపీ, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్ రాష్ట్రాల్లో మూడేసి, ఛత్తీస్‌గఢ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఒక్కోటి ఖాళీ అవుతున్నాయి.

బీజేపీ పరం కానున్న 28 సీట్లు

ఎన్నికలు జరిగే 56 రాజ్యసభ స్థానాల్లో 28 సీట్లను బీజేపీ గెలుచుకోనుంది. ప్రస్తుతం రాజ్యసభలో 93 మంది బీజేపీ సభ్యులతో కలిసి ఎన్డీఏ కూటమి బలం 114గా ఉంది. కాంగ్రెస్‌కు 30 సీట్లున్నాయి. హిమాచల్ అసెంబ్లీలో కాంగ్రెస్ సంఖ్యా బలం దృష్ట్యా అక్కడి ఒక్క రాజ్యసభ స్థానం ఆ పార్టీకే దక్కనుంది. దాన్ని ప్రియాంక గాంధీకి కేటాయించవచ్చని సమాచారం. ప్రస్తుతం అక్కడి నుంచి ఎంపీగా ఉన్న వహిస్తున్న బీజేపీ చీఫ్ జేపీ నడ్డాను మరో రాష్ట్రం నుంచి అధిష్టానం సర్దుబాటు చేయనుంది.

సిమిపై మరో ఐదేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: దేశంలో ఉగ్రవాదాన్ని రెచ్చగొడుతూ శాంతి, మత సామరస్యానికి భంగం కలిగిస్తున్న స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమి)పై నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం మరో అయిదేళ్లు పొడిగించింది. ఈ విషయాన్ని హోం శాఖ మంత్రి అమిత్ షా సోమవారం 'ఎక్స్'లో ప్రకటించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)కింద సిమిని చట్టవ్యతిరేక సంస్థగా ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సహా సుమారు 10 రాష్ట్రాల వినతి మేరకు.. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా మొదటిసారిగా కేంద్రం 2001లో సిమిని నిషేధించింది. ఆ తర్వాత పొడిగిస్తూ వస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో 1977లో సిమి ఏర్పాటైంది. భారత్‌ను ముస్లిం దేశంగా మార్చాలన్న అజెండాతో పనిచేస్తున్నట్లు ఈ సంస్థపై ఆరోపణలొచ్చాయి. గత కొన్నేళ్లలో సిమి కార్యకర్తలపై ఉగ్రవాద సంబంధ 17 కేసులు నమోదు కాగా, 27 మంది సభ్యులను అరెస్ట్ చేసినట్లు హోం శాఖ తెలిపింది.

అర నిమిషంలో నిద్రపోతా



న్యూఢిల్లీ: అధిక సమయం స్క్రీన్‌లకు అతుక్కుపోతే అది మీ నిద్రపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని విద్యార్థులను ప్రధాని మోదీ సున్నితంగా హెచ్చరించారు. దేశవ్యాప్తంగా

స్క్రీన్ టైమ్‌పై నియంత్రణ ముఖ్యం
- పరీక్షా పే చర్చాలో విద్యార్థులకు మోదీ సూచనలు
- పిల్లల ప్రొగ్రెస్ కార్డ్ మీకు విజిటింగ్ కార్డ్ కాదని తల్లిదండ్రులకు హితవు

పరీక్షల వేళ విద్యార్థుల ఒత్తిడిని పోగొట్టే ప్రయత్నంలో భాగంగా కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ నిర్వహిస్తున్న ఏడో విడత 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం సోమవారం ఢిల్లీలోని భారత మండపంలో జరిగింది. వర్చువల్‌గా పాల్గొన్న కోట్లాది మంది విద్యార్థులనుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. మోదీ విద్యార్థులకు చేసిన పలు సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

అవసరం మేరకే ఫోన్ వాడతా

' జీవనశైలి సక్రమంగా ఉండాలంటే ఏదీ అతిగా ఉండొద్దు. అతి స్క్రీన్ టైమ్, రీల్స్ చూడటం మీ నిద్రాకాలాన్ని మింగేస్తుంది. ఆధునిక వైద్యశాస్త్రం ప్రకారం నిద్ర అనేది అత్యంత కీలకం. అలాంటి నిద్ర తక్కువకాకుండా చూసుకోండి. నేనైతే అవసరమైన మేరకే ఫోన్ వాడతా. నిద్రకు ఉపక్రమించిన కేవలం 30 సెకన్లలోనే గాఢ నిద్రలోకి జారుకుంటా. రోజూ కొద్దిసేపు ఎండలో గడపండి. ఫోన్‌కు చార్జింగ్ లాగే పిల్లలకు పౌష్టికాహారం ముఖ్యం. ఎక్సర్‌సైజ్ చేసి ఫిట్‌గా ఉండండి. అప్పుడే చక్కగా చదవగలరు'' అని అన్నారు.

అలాంటి వారితో స్నేహం చేయండి

'' చదువుల్లో బాగా కష్టపడుతూ, తెలివితేటలు ఉన్న తోటి విద్యార్థులతో స్నేహం చేయండి. అప్పుడే వారి నుంచి స్ఫూర్తి పొందగలరు. పేరెంట్స్‌కు నాదో సూచన. పిల్లల ప్రోగ్రెస్ కార్డ్ మీకు విజిటింగ్ కార్డ్ కాదు. మీరు వెళ్లినచోట మీ పిల్లల చదువుసంధ్యల గురించి అతిగా మాట్లాడకండి. ఎప్పుడూ ఇతర పిల్లలతో పోల్చి చూపకండి. ఇది మంచి పద్ధతి కాదు. పూజ చేసి కొత్త యూనిఫాం, స్టేషనరీ కొని పరీక్ష రోజును ప్రత్యేకమైన దినంగా మార్చేయకండి'' అని చెప్పారు.

చిన్న లక్ష్యాలతో మొదలెట్టండి


''పిల్లలను మూడు ఒత్తిళ్లు ఇబ్బందిపెడతాయి. ఏకాగ్రత, తల్లిదండ్రుల ఒత్తిడి, ఆత్మవిశ్వాస లేమి. పరీక్షలకు ముందు చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధిస్తూ మీ లక్ష్యాలను పెంచుకుంటూ పొండి. పరీక్షలు వచ్చేటప్పటికి సంసిద్ధమైపోతారు. టీచర్-స్టూడెంట్ బంధం సిలబస్ పాఠాలకు అతీతమైనది. సిలబస్ చెబుతూనే సబ్జెక్ట్ పట్ల వారిలో భయాన్ని పోగొట్టండి. పిల్లలు బెరుకులేకుండా సందేహాలు అడిగేలా సౌమ్యంగా మెలగండి. బోధనను ఒక వృత్తిగా కాకుండా విద్యార్థుల భవితను తీర్చిదిద్దే యజ్ఞంగా భావించండి'' అని అన్నారు.

నాక్కూడా పరీక్ష లాంటిది

''పరీక్ష పే చర్చా నాకూ ఓ పరీక్ష. ఎందుకంటే నేటితరం విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు ఎక్కువయ్యాయి. వినూత్నంగా ప్రధాని ఈసారి ఏం చెప్తారా? అనుకునే విద్యార్థులకు తగ్గట్లు నేనూ ఈ కార్యక్రమానికి సిద్ధమయ్యే రావాలికదా'' అన్నారు.

ఇంట్లో నో గాడ్జెట్ జోన్

'' తల్లిదండ్రులకు నాదో సలహా. టెక్నాలజీ నుంచి దూరం జరగలేం. అలాగని అతుక్కుపోవడమూ సబబు కాదు. భోజనం చేసేటపుడు గాడ్జెట్ వాడొద్దనే నియమం పెట్టండి. ఏ యాప్ వాడినా స్క్రీన్ టైమ్ పెట్టుకోండి'' అని సలహా ఇచ్చారు. ఈ ఏడాది 2.26 కోట్ల మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి రిజిస్టర్ చేసుకోవడం విశేషం.



సారీ, నేను ఓడిపోయాను..!

అమ్మానాన్నలకు లేఖ రాసి కోటాలో విద్యార్థిని ఆత్మహత్య

కోటా: పరీక్షల ఒత్తిడికి మరో నిండు ప్రాణం బలైంది. రాజస్తాన్‌లోని కోటాలో జేఈఈకి ప్రిపేర్ అవుతున్న నిహారిక సింగ్(18) అనే విద్యార్థిని ఉరేసుకుని తనువు చాలించింది. ''మమ్మీ, పాపా! నేను జేఈఈ సాధించలేను. నేను ఓడిపోయాను. నేను మంచి కూతుర్ని కాను. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను. సారీ, నాకిక వేరే దారి లేదు'' అని పేర్కొన్న సూసైడ్ నోట్ ఆమె గదిలో పోలీసులకు లభించింది. స్థానిక శివ విహార్ కాలనీలో కుటుంబంతో ఉంటున్న నిహారిక ఈ నెల 30, 31వ తేదీల్లో జేఈఈ పరీక్ష రాయాల్సి ఉందని పోలీసులు తెలిపారు. చదువుల్లో ఒత్తిడిని తట్టుకుని, పరీక్ష రాయ లేకనే ఉరివేసుకున్నట్లు సూసైడ్ నోట్‌ను బట్టి అర్థమవుతోందని వారన్నారు. ఉదయం 10 గంటలైనా నిహారిక బయటికి రాకపోవడంతో అమ్మమ్మ గది తలుపు తట్టింది. ఎంతకూ లోపలి నుంచి స్పందన లేకపోవడంతో కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా, వెంటిలేటర్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతూ నిహారిక విగతజీవిగా కనిపించింది. ఈ పరిణామంతో వారు హతాశులయ్యారు. చదువులో ముందుండే నిహారిక జేఈఈ పరీక్షపై ఒత్తిడికి గురవుతోందని ఆమె కుటుంబసభ్యుడొకరు చెప్పారు. జేఈఈతోపాటు ఎక్కువ స్కోరు కోసం 12వ తరగతి పరీక్షను సైతం ఆమె రాయాల్సి ఉందన్నారు. నిహారిక తండ్రి స్థానిక బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఝలావర్ జిల్లా అకౌడాఖుర్ద్‌కు చెందిన ఈ కుటుంబం మూడేళ్లుగా కోటాలో ఉంటోంది. కోటాలో వారం వ్యవధిలో చోటుచేసుకున్న విద్యార్థుల ఆత్మహత్యల్లో ఇది రెండోదని పోలీసులు పేర్కొన్నారు. నీట్‌కు ప్రిపేరవుతున్న యూపీకి చెందిన మహ్మద్ జయిద్ జనవరి 13న హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. కోటాలో గత ఏడాది 26 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

అధ్యక్షుడు ముయిజ్జుపై అవిశ్వాసం

సిద్ధమవుతున్న మాల్దీవుల ప్రతిపక్షం

మాలె: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం మాల్దీవియన్ డెమోక్రాటిక్ పార్టీ (ఎండీపీ) సిద్ధమవుతోంది. ఎండీపీకి పార్లమెంట్‌లో మెజారిటీ ఉంది. చైనా అనుకూల అధ్యక్షుడు ముయిజ్జు కేబినెట్‌లోకి నలుగురు మంత్రులను చేర్చుకునే అంశంపై ఆదివారం పార్లమెంట్‌లో ఓటింగ్ జరిగింది. నలుగురిలో ఒక్కరికి మాత్రమే పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ముగ్గురిని తిరస్కరించింది. ఇందుకు ఆగ్రహిస్తూ అధికార పక్షం ఎండీపీకి చెందిన స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లపై అవిశ్వాసం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రతిపక్ష ఎంపీలు బాహాబాహీకి దిగారు. ఇద్దరు గాయపడ్డారు. ఈ పరిణామాలతో ఎండీపీ, మిత్రపక్షం డెమోక్రాట్లతో కలిసి ముయిజ్జుపై అవిశ్వాసం పెట్టాలని సోమవారం నిర్ణయించింది. పార్లమెంట్‌లో మొత్తం 80 మంది సభ్యులకు గాను ఎండీపీకి 45 మంది, డెమోక్రాట్లకు 13 మంది ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలతో హింస, విద్వేషం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

కిషన్‌గంజ్/అరారియా: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీల సిద్ధాంతాలు దేశంలో హింస, విద్వేషాలను వ్యాప్తి చేస్తున్నాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా సోమవారం ఆయన బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో మాట్లాడారు. ఎన్డీఏ పాలనలో ప్రజలు మతాలు, కులాల పేరుతో కొట్లాడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన యాత్ర సోమవారం ఉదయం పశ్చిమబెంగాల్ నుంచి బిహార్‌లోకి ప్రవేశించింది. మంగళవారం యాత్ర మళ్లీ బెంగాల్లో అడుగు పెట్టనుంది.

ఈడీ ఎదుట హాజరైన లాలూ

పట్నా: ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలను ఎదుర్కొంటున్న ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం 9 గంటలకు పైగా ప్రశ్నించారు. నడవలేని పరిస్థితుల్లో ఉన్న తండ్రితోపాటు తన సోదరి మిసా భారతిని లోపలికి అనుమతించకపోవడం సిగ్గుచేటని లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య ఆరోపించారు. విచారణకు రావాలంటూ ఈ నెల 19న ఈడీ అధికారులు లాలూతోపాటు ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్‌కు సమన్లు ఇచ్చారు. ఆ మేరకు తేజస్వీ యాదవ్ మంగళవారం ఈడీ ఎదుట హాజరుకావాల్సి ఉంది.

కక్షిదారుల కులమతాల ఊసొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: కేసుల విచారణ సందర్భంగా కక్షిదారుల కులం, మతం ప్రస్తావన తేవడం మానేయాలని హైకోర్టు సహా దిగువ కోర్టులను సుప్రీంకోర్టు కోరింది. ''ఈ సంప్రదాయానికి తక్షణమే ముగింపు పలకాలి. మా ఆదేశాలను తక్షణమే తప్పనిసరిగా అమలు చేయాల్సిందిగా అన్ని కోర్టులకు సూచనలు పంపండి'' అని జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం రిజిస్ట్రీని ఆదేశించింది.

జపాన్ ల్యాండర్ పనిచేస్తోంది!

టోక్యో: చంద్రుని ఉపరితలంపై జనవరి 20న తలకిందులుగా దిగి మనుగడే ప్రశ్నార్థకమైన జపాన్ ల్యాండర్‌కు సూర్యకాంతి కొత్త జీవం పోసింది. ఎండ ప్రభావానికి సాంకేతిక సమస్య తొలగి ల్యాండర్‌తో కమ్యూనికేషన్ మొదలైందని జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ సోమవారం తెలిపింది. మల్టీ-బ్యాండ్ స్పెక్ట్రమ్ కెమెరా అక్కడి సమీప శిలలను లాండర్ ఫొటోలు తీసింది. ఒక శిలకు 'టోయ్ పోడెల్' అని పేరు పెట్టింది. మొత్తం ఆరు శిలలకు శునకం జాతి పేర్లు పెట్టి వాటిని అధ్యయనం చేస్తోంది. చంద్రుడి ఉపరితల వాతావరణాన్ని పరీక్షిస్తోంది.

డీప్‌ఫేక్ ఆందోళనకరం

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల

వాషింగ్టన్: ప్రముఖుల ఫొటోలు, వీడియోలను దుర్వినియోగం చేస్తూ కృత్రిమ మేధ(ఏఐ)తో సృష్టిస్తున్న డీప్ ఫేక్ నకిలీ ఫొటోలు, వీడియోల ధోరణి అత్యంత భయంకరమైనదని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వ్యాఖ్యానించారు. ప్రఖ్యాత పాప్ గాయని టైలర్ స్విఫ్ట్ నకిలీ అసభ్య ఫొటోలు తాజాగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. దీనిపై ఒక ఇంటర్వ్యూలో సత్య నాదెళ్ల ఆవేదన వెలిబుచ్చారు. ''ప్రముఖుల డీప్ ఫేక్ ఫొటోలు, వీడియోల సృష్టి, వ్యాప్తికి అడ్డుకట్ట పడాల్సిందే. ప్రభుత్వాల, సోషల్‌మీడియా సంస్థల తక్షణ స్పందన అవసరం. సురక్షితమైన, వాస్తవిక సమాచారం మాత్రమే ఆన్‌లైన్‌లో లభించేలా సాంకేతికతను, రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రభుత్వాలు నిబంధనలను సవరించి కట్టుదిట్టంచేయాలి. ఇది మనందరి బాధ్యత'' అని అన్నారు.

'హీ నితీష్డ్ మీ'

బిహార్ సీఎంపై వెల్లువెత్తుతున్న మీమ్స్, జోక్స్



న్యూఢిల్లీ: బిహార్ సీఎం నితీశ్ కుమార్ పదేపదే కూటములు మార్చడంపై సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మీమ్స్, జోకులు పేలుతున్నాయి. మోసానికి సిసలైన పేరు నితీశ్ అంటూ కొత్త విశేషణాన్ని ఖరారు చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని మీమ్స్‌లో కొన్ని...

'అతను నన్ను మోసం చేశాడు' అనడానికి 'హీ నితీష్డ్ మీ' అంటూ పలువురు ట్యాగ్ చేస్తున్నారు. ''బీసీసీఐ కొత్త తరహా క్రికెట్ టోర్నమెంట్ ఫార్మాట్ తేనుంది. అదేంటంటే మ్యాచ్ మధ్యలో కెప్టెన్లు మారిపోతారు. ప్రేక్షకుల్లో ఉత్కంఠ. ఆదాయానికి ఆదాయం. వరల్డ్ కప్ లాగా అది 'నితీశ్ కప్' అని ఒక పాత్రికేయుడు 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. కార్పొరేట్ ప్రపంచంలో సీఈవోలకు నితీశ్ కుమార్ ఒక ఆదర్శనీయుడు. తొమ్మిదిసార్లు 'కంపెనీ'ల విలీనాలు, టేకోవర్‌ల తర్వాత కూడా ఈయనే సీఈవోగా కొనసాగడం అద్భుతం' అని మరో యూజర్ ట్వీట్‌చేశారు.

కూటముల మధ్య తెగ 'పల్టీలు కొట్టే పుత్రుడు'ని కన్నందుకు 'పాటలీపుత్ర'కు ఆ పేరు వచ్చిందని మరొకరు కొత్త భాష్యమిచ్చారు.

''జాతీయ రహదారులపై యూటర్న్ గుర్తు తీసేసి అక్కడ నితీశ్ ఫొటో పెట్టాలని కేంద్ర రహదారుల మంత్రి ఆదేశించారు'' అని మరొకరు ట్వీట్‌చేశారు.

బిహార్‌లో మహాఘట్‌బంధన్ కూటమికి చరమగీతం పాడి బీజేపీతో నితీశ్ జట్టు కట్టిన విధానాన్ని ఐదు అంశాల్లో నెటిజన్లు సరికొత్తగా నిర్వచించారు.

1. ఎటంటే అటు మారేలా అనువుగా ఉండాలి.
2. సరిగ్గా సరైన సమయం చూసి అటువైపు దూకేయాలి.
3. అదే సమయంలో పాత మిత్రులతో సత్సంబంధాలు కొనసాగించాలి.
4. చెడిపోయిన స్నేహాన్ని చిగురింపజేయాలి.
5. కొత్త అవకాశం చేతికొచ్చాకే పాత మిత్రుల చేయి వదిలేయాలి.

గవర్నర్ బిత్తరపోయిన వేళ!

ఆదివారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి వెళ్లిన నితీశ్, 15 నిమిషాల్లోపే తిరిగి రాజ్‌భవన్‌కు రావడం చూసి గవర్నర్ షాకయ్యారంటూ సరదా వీడియో ఒకటి తెగ వైరల్ అవుతోంది. అదేమంటే, రాజ్‌భవన్‌లో మర్చిపోయిన తన మఫ్లర్(స్కార్ఫ్)ను తీసుకోవడం కోసం నితీశ్ వెనుదిరిగి వస్తారు. అది చూసి గవర్నర్ బిత్తరపోతారు. 'ఈసారి కూటమికి గుడ్‌బై చెప్పడానికి నితీశ్‌కు 18 నెలలు టైమ్ పట్టింది. ఇప్పుడేమిటి మరీ 15 నిమిషాల్లోపే మళ్లీ వచ్చారా?' అని గవర్నర్ షాక్‌కు గురయ్యారంటూ కాంగ్రెస్ వ్యంగ్యంగా ట్వీట్‌చేసింది. ''వెంటవెంటనే రాజీనామాలు, ప్రమాణాలతో నితీశ్ రాజకీయ రంగు మారుస్తున్నారు. ఈయనను చూసి ఊసరవెల్లి కూడా కొత్త రంగును వెతుక్కోవాల్సి వస్తోంది. ఆయారామ్ గయారామ్ బదులు ఇక ఆయా నితీశ్ గయా నితీశ్ అనుకోవాలి'' అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఎద్దేవాచేశారు.


సాక్షి కరీంనగర్

మంగళవారం | 30 | జనవరి | 2024



పత్తి ధర రూ.6,700

జమ్మికుంట: స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో సోమవారం క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. మోడల్ ధర రూ.6,600, కనిష్ట ధర రూ.6,000కు వ్యాపారులు కొనుగోలు చేశారు.



ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి సోమవారం ఒక గేటు ద్వారా 500, కుడి కాల్వ ద్వారా 300, ఎడమకాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
30.6/15.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పార్టీలకతీతంగా అభివృద్ధి

• మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



సైదాపూర్(హుస్నాబాద్): రాష్ట్రవ్యాప్తంగా పార్టీలకతీతంగా అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సోమవారం సైదాపూర్ మండలంలోని ఆరెపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గొడిశాల నుంచి గుజ్జులపల్లికి బీటీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. తొలిసారి మండలానికి వచ్చిన మంత్రికి ఒగ్గుకళా బృందాలతో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఓటమి చెందడాన్ని జీర్ణించుకోలేక సతీశ్‌కుమార్ అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంకా అధికారంలో ఉన్నట్లు మాట్లాడితే సహించబోమన్నారు. కాళ్లు మొక్కించుకునే సంస్కారం నీదని, కలుపుకొని, కష్టపడి పనిచేసే సంస్కారం తనదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులకు ఆదేశాలిచ్చానని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండ గణేశ్ ఆధ్వర్యంలో మండల సర్పంచులు మంత్రికి వినతి పత్రం అందించారు. ఐకేపీ, మహిళా సంఘాలు, సీఏల సమస్యలు పరిష్కరించాలని సీఏలు వినతి పత్రం అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గోపాల్‌రావు, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు పాపయ్య, లత, వెంకట్‌రెడ్డి, రాములు, పద్మ, రాజిరెడ్డి, శిరీష, సుమలత, కాంతమ్మ, ఎంపీటీసీ సభ్యులు చాంద్‌పాషా, అరుణ, ఓదెలు, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రావు, డీటీ మల్లేశం, ఎంపీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలకు ప్రత్యేక హాస్టల్

• ఎంపీ బండి సంజయ్



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం ప్రత్యేక హాస్టల్ నిర్మాణానికి సీఎస్సార్ నిధులు మంజూరు చేయిస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ హామీ ఇచ్చారు. సోమవారం కళాశాలను సందర్శించిన ఆయన ఎంపీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సోలార్ పవర్ జనరేషన్ సిస్టంను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళా డిగ్రీ కళాశాలను టాప్ కాలేజీగా తీర్చిదిద్దేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఉద్యోగం కోసమే చదువుకోవాలన్న ఆలోచనను వీడాలని, చదువు, కెరీర్‌తోపాటు సంస్కారం, సంస్కృతి ముఖ్యమని విద్యార్థినులకు సూచించారు. భారతీయులుగా పుట్టడం నిజంగా పూర్వజన్మ సుకృతమని, విదేశీయులే భారత సనాతన ధర్మ గొప్పతనాన్ని తెలుసుకుంటున్నారని తెలిపారు. మనం మాత్రం మమ్మీ, డాడీ సంస్కృతికి అలవాటుపడటం బాధాకరమన్నారు. విదేశీ సంస్కృతిని విడనాడి, ప్రతీ ఒక్కరు దేశం, ధర్మం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సెలవులో కలెక్టర్

• ఇన్‌చార్జి కలెక్టర్‌గా ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్ అర్బన్: కలెక్టర్ పమేలా సత్పతి వ్యక్తిగత కారణాలతో మూడు రోజులు సెలవులో వెళ్లారు. ఆమె స్థానంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరించనున్నారు. కలెక్టర్ ఫిబ్రవరి 1న తిరిగి విధుల్లో చేరనున్నారు.

జేఎల్‌ఎం కాల్ లెటర్లు సర్కిల్ ఆఫీసులో తీసుకోండి

• ఎస్‌ఈ గంగాధర్

కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో వచ్చే నెల 1న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్షకు కాల్ లెటర్లు అందని అభ్యర్థులు సర్కిల్ కార్యాలయంలో తీసుకోవాలని ఎస్‌ఈ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్‌ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ప్రలోభాలకు లోనై, దళారుల చేతిలో మోసపోవద్దని సూచించారు.



• ఆశవర్కర్లకు వేతనాలివ్వాలి

పెండింగ్ వేతనాలివ్వాలని, ఏఎన్‌సీ టార్గెట్ రద్దు చేయాలని ఆశవర్కర్లు(సీఐటీయూ) డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద, ప్రధాన కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు. – కరీంనగర్



• రీయింబర్స్‌మెంట్ రిలీజ్ చేయాలి

పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్‌చార్జీలు రిలీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనగరపు రజనీకాంత్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు రోహిత్, అభిలాష్, నాయకులు పాల్గొన్నారు. – కరీంనగర్

ప్రజావాణికి 207 అర్జీలు



కరీంనగర్: ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 207 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయానికి సంబంధించి 23, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖకు 7, పోలీస్ కమిషనర్ కార్యాలయానికి 5, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 9, కరీంనగర్ ఆర్డీవో ఆఫీస్‌కు 16, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఆఫీస్‌కు 19 రాగా, మిగతా శాఖలన్నింటికీ కలిపి 128 దరఖాస్తులు వచ్చాయన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో పవన్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సదానందం, అధికారులున్నారు.

నా భూమి ఆక్రమించారు

నేను శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని సర్వే నంబర్ 718లో 152 చదరపు గజాల భూమిని అబ్బిడి వివేకావర్ధన్‌రెడ్డి నుంచి 2013 జూన్ నెలలో కొనుగోలు చేశాను. కానీ, నా భూమిని ఆక్రమించి, వెంకటేశ్వర గ్రామీణ వైద్యుల సంఘం పేరిట బోర్డు పాతారు. ఇదేంటని అడిగితే నాపై దాడికి దిగారు. అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాను. అయినా సమస్యకు పరిష్కారం దొరకలేదు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాను. ఇప్పటికైనా నా భూమిని తిరిగి ఇప్పించాలి.

– ఏరుకొండ శ్రీలత, రేకొండ గ్రామం, చిగురుమామిడి మండలం

జంతు సంరక్షణకు చర్యలు తీసుకోండి

కరీంనగర్‌అర్బన్: జంతు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పశువైద్య శాఖ, ఎస్పీసీఏ, జిల్లా జంతుహింస నివారణ సంఘం అధికారులతో సమావేశమయ్యారు. జంతువులకు అనువైన వాతావరణం కల్పించడానికి జిల్లాలోని పోలీస్, అటవీ, వెటర్నరీ, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల సమన్వయంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. పశువైద్యులను సంప్రదించకుండా జంతువులకు మందులివ్వకుండా చూడాలన్నారు. మూడు రోజులకోసారి కబేళాలను పరిశీలించాలని, జంతు రవాణాను పర్యవేక్షించాలన్నారు. వీధి కుక్కల నియంత్రణకు గర్భనిరోధక శస్త్ర చికిత్సలు చేయాలని పేర్కొన్నారు. ప్రైవేట్ వెటర్నరీ హాస్పిటల్స్‌వారు ఎస్పీసీఏతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ బి.నరేందర్, జెడ్పీ సీఈవో పవన్‌కుమార్, డీఎంవో పద్మావతి, డీపీఆర్వో అబ్దుల్ కలీం, పోలీస్, అటవీ, పంచాయతీ రాజ్, రవాణా శాఖల అధికారులు, పశు వైద్యాధికారులున్నారు.

‘నామినేటెడ్’ ఎవరికో?

- నేతల చుట్టూ తిరుగుతున్న పలువురు నాయకులు
- పదేళ్ల తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో జోష్
- జిల్లాలో 41 పోస్టులు



కరీంనగర్: పదేళ్ల నిరీక్షణ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇదివరకు ప్రతిపక్ష నాయకులుగా ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రధాన నాయకులు, ముఖ్య కార్యకర్తలు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెంచుకున్నారు. తాము కోరుకున్న కమిటీలో స్థానం కల్పించాలని కోరుతూ నేతల చుట్టూ తిరుగుతున్నారు. కరీంనగర్, జమ్మికుంట, హుజూరాబాద్ మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులతోపాటు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్(సుడా), జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, రాష్ట్ర స్థాయిలోని కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ల పదవులకు పోటీ పడుతున్నారు. కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల నుంచి పలువురి పేర్లు వినిపిస్తున్నాయి.

గ్రంథాలయ సంస్థకు తీవ్ర పోటీ

జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా గౌరవప్రదమైన హోదా కలిగిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం తీవ్ర పోటీ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణలకు ఆయా నియోజకవర్గాలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు తమ మనసులో మాట చెప్పినట్లు సమాచారం. చైర్మన్ పదవితోపాటు డైరెక్టర్ల నియామకం కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

రైతుబంధు సమితులు కొనసాగేనా?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా, మండల స్థాయిలో రైతుబంధు సమన్వయ సమితులు ఏర్పాటు చేసింది. వీటిని కొత్త ప్రభుత్వం రద్దు చేస్తుందా.. కొనసాగిస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఇద్దరు కాంగ్రెస్, ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

కరీంనగర్ జిల్లాలోని 4 నియోజకవర్గాల పరిధిలో 16 మండలాలు ఉన్నాయి. చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా అధికార పార్టీకి చెందిన మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కరీంనగర్, హుజూరాబాద్ నుంచి బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి ఉన్నారు. కరీంనగర్, హుజూరాబాద్‌లలో కాంగ్రెస్ ఇన్‌చార్జీలుగా పురమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్ వ్యవహరిస్తున్నారు. ఓటమి చెందినప్పటికీ ఆ నియోజకవర్గాలకు వీరినే ఇన్‌చార్జీలుగా నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీంతో పదవులు ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులు వారి కనుసన్నల్లోనే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ పదవులను తమకు ఇవ్వాలంటూ పలువురు కాంగ్రెస్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

7 మార్కెట్లు, 3 ఉప మార్కెట్లు

జిల్లాలో 7 వ్యవసాయ మార్కెట్లు కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గంగాధర, హుజూరాబాద్, మానకొండూర్, గోపాల్‌రావుపేటలతోపాటు 3 ఉప మార్కెట్లు కమలాపూర్, కేశవపట్నం, ఎల్కతుర్తి ఉన్నాయి. గత ప్రభుత్వం చైర్మన్ పదవులను రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించింది. ప్రస్తుత ప్రభుత్వం అదే పద్ధతిని పాటిస్తుందా లేదా పాత పద్ధతిలో కమిటీలను నియమిస్తుందో వేచిచూడాలి.

దేవస్థాన కమిటీలు..

రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ఇల్లందకుంట సీతారామాలయం, కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్‌లో గల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాలకు రూ.25 లక్షల పైబడి ఆదాయం వస్తుంది. వీటికి దేవాదాయ పాలక కమిటీలు నియమించి, ఉత్సవాలను నిర్వహించే ఆనవాయితీ ఉంది. జిల్లాలో కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి, జిల్లా కేంద్రంలోని విజయగణపతి సాయిబాబా, గౌరీశంకర, భక్తాంజనేయ స్వామి, వేంకటేశ్వర స్వామి(మంకమ్మతోట), పొద్దుటూరి వారి ధర్మసంస్థ, హరిహర, గిద్దెపెరుమాండ్ల స్వామి, వీరాంజనేయ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి, కోతిరాంపూర్ పోచమ్మ, కట్టరాంపూర్ అభయాంజనేయ, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయ, హనుమాన్(హుజూరాబాద్), సీతారామస్వామి (నల్గొండ, తిమ్మాపూర్), వెంకటేశ్వర స్వామి(జమ్మికుంట) ఆలయాలకు దేవస్థాన కమిటీల చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నారు.

ఖాళీ పోస్టుల వివరాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ	01
వ్యవసాయ మార్కెట్ కమిటీలు	07
ఆలయ ధర్మకర్తల కమిటీలు	16
జిల్లా రైతబంధు సమన్వయ కమిటీ	01
మండల రైతు సమన్వయ కమిటీలు	15
సుడా చైర్మన్	01

ఓటు వినియోగించుకునేలా అవగాహన

• అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్



ఈవీఎం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: పటిష్టమైన ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధమని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎం డెమాన్స్ట్రేషన్ సెంటర్‌ను ప్రారంభించి, మాట్లాడారు. ఓటుహక్కు కల్పించడంతోపాటు ఓటు వినియోగించుకునేలా సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌తోపాటు కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈవీఎంలపై అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధాకర్, డీఆర్డీవో సూపరింటెండెంట్ కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

భూదందాలో మరో కార్పొరేటర్‌పై ఫిర్యాదు

కరీంనగర్ క్రైం: భూమిని కబ్జా చేసి, భయభ్రాంతులను గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఓ కార్పొరేటర్‌తోపాటు మరో నలుగురిపై ఫిర్యాదు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన వెంకట్‌రాజం భూమిని కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, పలువురు కబ్జా చేసి, భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీనిపై బాధితుడు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం కార్పొరేటర్, మరో నలుగురిని పిలిచి, విచారణ జరిపినట్లు త్రీటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయమై కార్పొరేటర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారని, ఆ భూమికి తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

ఐఎంఏ ఉత్తమ అధ్యక్షుడిగా రామ్‌కిరణ్



అవార్డు అందుకుంటున్న రామ్‌కిరణ్

కరీంనగర్‌టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు రామ్‌కిరణ్ జాతీయ స్థాయిలో ఉత్తమ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నారు. ఆయన ఐఎంఏ ఆధ్వర్యంలో వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, నిరంతర వైద్య, సామాజిక సదస్సులు, వైద్యుల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం, వైద్యులు, ప్రజల మధ్య సత్సంబంధాలపై పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆవో గావ్ చలే వైద్య శిబిరాలు దేశంలోనే ఎక్కువగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కిరణ్‌కు ఐఎంఏ కార్యదర్శి జి.వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ కాశీప్రసాద్, బీఎస్.రావు, విజయారావు, గుత్త సురేశ్, రవీందర్ రెడ్డి, మహేశ్, విజయ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కుక్కలు, కోతులు, పందులపై వాడీవేడి చర్చ

- బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల వాగ్వాదం
- అక్రమాలపై విచారణకు డిమాండ్
- బల్దియా సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: బల్దియా కార్పొరేటర్లు సమస్యలపై గళమెత్తారు. అధికారుల అక్రమాలు.. మధ్యలోనే నిలిచిపోయిన పనులు.. కుక్కలు, కోతులు, పందులతో ప్రజల అవస్థలు.. తదితర అనేక అంశాలపై వాడీవేడి చర్చ జరిగింది. ఈ క్రమంలో పలుమార్లు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కరీంనగర్ బల్దియా సర్వసభ్య సమావేశం సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన జరిగింది. మాజీ మేయర్, కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఇటీవల సరెండర్ అయిన ఆంధ్రా ఎస్‌ఈ మాయం చేశారని ఆరోపించారు. ఆఫ్‌లైన్‌లో చేయాల్సిన ఎంబీ రికార్డులను ఆన్‌లైన్‌కు మార్చిన అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ నిధుల్లో రాష్ట్రం వాటా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పనులు ఆగిపోతున్నాయని తెలిపారు. రోడ్డు పనులను ఎంఐఎం డివిజన్‌లో చేపట్టి, తన డివిజన్‌లో చేయడం లేదని ఆరోపించారు. కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. తీగలగుట్టపల్లి కార్పొరేషన్‌లో విలీనమై నాలుగేళ్లయినా స్థానిక ప్రజలకు తాగు నీరందించకపోవడం సరికాదన్నారు. బండారి వేణు మాట్లాడుతూ.. తన డివిజన్‌లో రోడ్డు పనులు 5 నెలలైనా పూర్తి కావడం లేదన్నారు. కంసాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. డీజిల్ సమస్యతో పారిశుధ్య వాహనాలు చెత్త సేకరణకు రావడం లేదన్నారు. ఐలేందర్ యాదవ్ మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. వంగల శ్రీదేవి మాట్లాడుతూ.. టవర్ సర్కిల్ వద్ద లైట్లు వెలగడం లేదని, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు అసంపూర్తిగా వదిలేశారని ఆరోపించారు. ఆర్పీల ఆగడాలు పెరిగిపోతున్నాయని గంట కల్యాణి మండిపడ్డారు. కుక్కలు, కోతులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చొప్పరి జయశ్రీ తెలిపారు. రేకుర్తిలో ప్రభుత్వ భూములను కాపాడాలని సుధగోని మాధవి కోరారు. కుక్కల బెడద తీర్చాలని, ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతు చేయాలని దిండిగాల మహేశ్ విన్నవించారు.



బైఠాయించిన కార్పొరేటర్ జితేందర్

నిధుల కోసం మంత్రి వద్దకు ఎలా పోతారు?

గతంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్క్రాప్ అంటూ మున్సిపల్ కార్యాలయంలోనే కార్యక్రమాలు చేశారు.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఆయన దగ్గరికి నిధుల కోసం పోతారంటూ బీజేపీ కార్పొరేటర్ జితేందర్ వ్యాఖ్యానించడంతో సభలో కలకలం రేగింది. కాంగ్రెస్‌కు మద్దతునిస్తున్నారా? అంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో అలాంటి కార్యక్రమాలు చేశారు కాబట్టి అంటున్నానంటూ జితేందర్ బదులిచ్చారు. మీ ఎంపీ ఒక్క రూపాయి తీసుకువచ్చారా అంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్ గందె మాధవి ప్రశ్నించడంతో బీజేపీ సభ్యులు అభ్యంతరం చెప్పారు. మా ఎంపీ గురించి మాట్లాడితే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. తాము బీఆర్ఎస్ కార్పొరేటర్ల మాదిరిగా భూకబ్జాలు చేసి, జైలుకు పోలేదన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా మేయర్ సర్ది చెప్పారు.

ఆ కార్పొరేటర్లను బర్తరఫ్ చేయాలి

పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ మేయర్ పోడియం వద్ద బైఠాయించి, నిరసన తెలిపారు. నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోస్టు లేకున్నా డీసీపీ సుభాష్‌ను ఎలా నియమించారని ప్రశ్నించారు. మేయర్ సునీల్‌రావు స్పందిస్తూ ఏవైనా ఆధారాలు ఉంటే చూపాలని, చర్య తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, భూకబ్జాలకు పాల్పడి, జైలుకు వెళ్లిన కార్పొరేటర్లను బర్తరఫ్ చేయాలని జితేందర్ డిమాండ్ చేశారు.

అగౌరవ పరుస్తున్నారు..

అధికారుల తీరు పట్ల డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె హాల్లోకి వచ్చేసరికి ముందు వరుసలో కార్పొరేటర్లు కూర్చొని ఉన్నారు. ఆమెకు ప్రత్యేకంగా సీటు లేకపోవడంతో కొద్దిసేపు వేచిచూశారు. ప్రత్యేక సీటు ఇవ్వకుండా తనను అగౌరవ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమాలకు అధికారికంగా సరైన సమాచారం ఉండటం లేదన్నారు. మొత్తం 22 ఎజెండా అంశాలను సమావేశం ఆమోదించింది. నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : మేయర్

సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తాం. కుక్కలు, కోతుల బెడద తీర్చే చర్యలు నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నాం. ఇప్పటివరకు నగర వ్యాప్తంగా రూ.36 లక్షల ఖర్చు చేసి, కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేశాం. రూ.20 లక్షలతో 2,400 కోతులను పట్టుకొని, అటవీ ప్రాంతాల్లో వదిలేశాం. వన్‌టౌన్ చౌరస్తాను సుందరీకరించి తెలంగాణ తల్లి, చొక్కారావు విగ్రహాలను ఏర్పాటు చేస్తాం. వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీరోజు తాగునీరు సరఫరా చేస్తాం.

క్లుప్తంగా

క్యాంపస్‌ డ్రైవ్‌లో శ్రీచైతన్య విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో రమేశ్‌రెడ్డి తదితరులు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్‌ కళాశాలలో నో బ్రోకర్‌ హుడ్‌ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో కళాశాలకు చెందిన 8 మంది ఎంబీఏ విద్యార్థులు కొలువు సాధించినట్లు కళాశాల చైర్మన్‌ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.3.2 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కంపెనీ నిర్వహించిన గ్రూప్‌ డిస్కషన్‌, ఆన్‌లైన్‌ మూల్యాంకన పరీక్ష, మౌఖిక పరీక్ష, టెక్నికల్‌ ఇంటర్వ్యూ ఆధారంగా ప్రతిభ చూపిన 8 మంది విద్యార్థులను సేల్స్‌ ఇంటర్న్‌షిప్‌, బ్రాండ్‌ రీజనల్‌గా ఎంపిక చేసుకున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్‌ డా.జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎంపికైన విద్యార్థులు కంపెనీలో ఉద్యోగ నియామకాలకు కట్టుబడి ఉండాలన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మన్‌, ప్రిన్సిపాల్‌, హెచ్‌వోడీ ఆర్‌.హరీశ్‌, అధ్యాపకులు అభినందించారు.

3న జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పరీక్ష

కరీంనగర్‌: జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు ఫోరం ప్రధాన కార్యదర్శి అవదూత శ్రీనివాస్‌ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల నుంచి (తెలుగు, ఆంగ్ల మాధ్యమం, ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు) విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 11.40 గంటల వరకు జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్‌ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపు పాఠశాలలు, మీడియంల వారీగా విద్యార్థులు 94407 25522, 94927 90990, 95153 55303, 99495 57009 నంబర్లకు ఫోన్‌ చేసి నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

సర్పంచుల పెండింగ్‌ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న వాసు

హుజూరాబాద్‌: సర్పంచుల పెండింగ్‌ బిల్లులను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని జనతాదళ్‌ (సెక్యులర్‌) పార్టీ జేడీఎస్‌ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా గ్రామాల అభివృద్ధి పనుల కోసం సర్పంచులు అప్పులు తీసుకొచ్చి పనులు చేశారని గుర్తు చేశారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బిల్లులను నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్‌ ప్రభుత్వం విడుదల చేయాలని, బిల్లుల విషయమై రాష్ట్రంలో చాలామంది సర్పంచులు మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అండగా నిలవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆయన వెంట బీసీ సీనియర్‌ నాయకులు కల్లేపల్లి జంపయ్య, సంధ్యేల వెంకన్న, మారముళ్ల కిరణ్‌, తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు ఎర్ర కుమార్‌, పెండ్యాల మహేందర్‌ తదితరులు ఉన్నారు.

రాజన్నకు భక్తజన జాతర




వేములవాడ: రాజన్నకు సమ్మక్క జాతర భక్తుల రద్దీ పెరిగింది. సోమవారం 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. భక్తుల ద్వారా రూ.60లక్షల వరకు ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీ పెరిగిపోవడంతో ఆలయ అధికారులు ఆర్జిత సేవలను రద్దు చేశారు.

అంజన్నకు రికార్డుస్థాయిలో టెండర్ల ఆదాయం



వేలంలో పాల్గొన్న టెండర్‌దారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయానికి సంబంధించి పలు దుకాణాల నిర్వహణకు సోమవారం కరీంనగర్‌ దేవాదాయ శాఖ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో రూ.45 లక్షలు ఉన్న కొబ్బరిముక్కల సేకరణ రూ.80 లక్షలు, రూ.94 లక్షలు ఉన్న కొబ్బరికాయల దుకాణం రూ.1.37 కోట్లు, కిరాణం రూ.11లక్షలు, పుట్నాలు, ప్యాలాలు రూ.24.75 లక్షలు, పూలు, పండ్లు రూ.34.50 లక్షలు, గాజులు, ప్లాస్టిక్‌ రూ.27.75 లక్షలు, పాదరక్షలు రూ.9 లక్షలు, వంటచెరకు రూ.64 వేలు, హోటల్‌ రూ.14.50 లక్షలు, శీతలపానియాలు రూ.10.25 లక్షలు, ఫొటోస్టూడియో రూ.14.16 లక్షలు, లాకర్‌రూం రూ.12.24 లక్షలు, సులభ్‌కాంప్లెక్స్‌ రూ.12.25 లక్షలకు టెండర్‌దారులు దక్కించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. కాగా గతేడాది కంటే ఈసారి రికార్డుస్థాయిలో కోటి రూపాయలకు పైగా ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమిషనర్‌ చంద్రశేఖర్‌, ఈవో టి.వెంకటేశ్‌, ఏఈవో శ్రీనివాస్‌, చైర్మన్‌ మారుతిస్వామి పాల్గొన్నారు.

పరిశోధన నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న అధ్యాపకులు

కరీంనగర్‌సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు పరిశోధన నైపుణ్యాలను పెంచుకోవాలని అగ్రహారం కళాశాల అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ రాజేశ్‌ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఎస్సారార్‌ ప్రభుత్వ కళాశాలలో గణితశాస్త్ర విభాగం విద్యార్థులు పలు అంశాలపై పరిశోధన చేసి రూపొందించిన ప్రాజెక్టులను సోమవారం ప్రదర్శించగా, రాజేశ్‌ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు గణితంలో నైపుణ్యాలను పెంపొందించుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. డిగ్రీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గణితశాస్త్ర అధ్యయనంతో సమాజానికి ఉపయోగకరమైన అంశాలు కనుక్కునే అవకాశం ఉంటుందని, ఆ దిశలో విద్యార్థులు ప్రయాణించాలని కోరారు. గణితశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్‌ వంగల శ్రీనివాస్‌ మాట్లాడుతూ, కళాశాలలో ఎన్నో వనరులున్నాయని, విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ టి.రాజయ్య, అధ్యాపకులు డాక్టర్‌ అర్చన, డాక్టర్‌ సత్యనారాయణ, డాక్టర్‌ కొమురయ్య, డాక్టర్‌ పవన్‌కుమార్‌, తిరుపతి, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణపూర్‌'కు చేరిన 'ఎల్లంపల్లి'



రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీరు

గంగాధర(చొప్పదండి): ఎల్లంపల్లి ప్రాజెక్టు నీరు సోమవారం సాయంత్రం మండలంలోని నారాయణపూర్‌ రిజర్వాయర్‌కు సాయంత్రం చేరింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని నంది మేడారానికి తరలించి అక్కడి నుంచి పంపింగ్‌ ద్వారా నారాయణపూర్‌ రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఇక్కడి నుంచి చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల, గంగాధర, రామడుగు మండలాలతో పాటు, వేములవాడ నియోజకవర్గంలోని చెరువులు, కుంటలకు నీరు చేరుతుంది. కాలువల ద్వారా పంటపొలాలకు నీరు అందిస్తారు. కాగా నందిమేడారం పంప్‌హౌజ్‌ వద్ద మరమ్మతు పనులు జరుగుతుండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాలుగు రోజుల క్రితం పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నారాయణపూర్‌ రిజర్వాయర్‌కు నీటిని తరలించి పొలాలు ఎండిపోకుండా రైతులను ఆదుకుంటామన్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే ప్రయత్నం ఫలించింది. ఒక పంప్‌ ద్వారా నీటి సరఫరా ప్రారంభించారు. నారాయణపూర్‌ రిజర్వాయర్‌కు నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



ఆటోల నుంచి తొలగించిన అదనపు సీట్లు, పరికరాలు

కరీంనగర్‌క్రైం: వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్‌ ఏసీపీ సర్వర్‌ సూచించారు. సోమవారం కరీంనగర్‌ కమిషనరేట్‌ ట్రాఫిక్‌ పోలీసులు బస్టాండ్‌ ఇన్‌ గేట్‌ వద్ద స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. దాదాపు 100కు పైగా ఆటోల నుంచి అదనంగా పరిమితికి మించి డ్రైవర్‌ పక్కన ప్రయాణికులు కూర్చునేలా అమర్చిన సీట్లు, మ్యూజిక్‌ సిస్టం, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా అమర్చిన పరికరాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని సూచించారు. ట్రాఫిక్‌ నియమాలు ఉల్లంఘించిన ఆటో డ్రైవర్లను గుర్తించడమే కాకుండా వారికి ఈ చలాన్‌ ద్వారా జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ఇక నిరంతరం స్పెషల్‌డ్రైవ్‌లు కొనసాగుతాయని వివరించారు. ఆటో డ్రైవర్లే కాకుండా ఇతర వాహనదారులు కూడా నియమాలు పాటిస్తూ, ట్రాఫిక్‌ అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రమేశ్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్లు రాజు, సాగర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

'మానేరు'లో ముగిసిన సెమ్స్‌ నేషనల్‌ ఒలింపియాడ్‌



పరీక్షను పర్యవేక్షిస్తున్న అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): సెమ్స్‌ ఒలింపియాడ్‌ ఫౌండేషన్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలలో సోమవారం నిర్వహించిన 4వ సెమ్స్‌ నేషనల్‌ ఒలింపియాడ్‌ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు మానేరు విద్యాసంస్థలలోని సుమారు 677 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష జరుగుతున్న తీరును మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతకాలంలో పోటీ పరీక్షల్లో దూసుకుపోవడానికి ఒలింపియాడ్‌ లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మ్యాథ్స్‌, సైన్స్‌పై పట్టు సాధించడానికి ఒలింపియాడ్‌ దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్‌ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్స్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను టచ్‌ చేసే దమ్ముందా..?

- నువ్వు ఒకటంటే.. మేము రెండంటాం
- వస్త్ర పరిశ్రమకు బకాయిలు పెట్టింది నీవేకదా
- ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఓట్లేసే పరిస్థితి లేదు
- సిరిసిల్లను డెవలప్‌ చేయడానికి రెడీగా ఉన్నాం
- కేటీఆర్‌పై ప్రభుత్వ విప్‌ ఆది ఫైర్‌



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్‌

సిరిసిల్లటౌన్‌: హద్దు పద్దూ లేకుండా మాట్లాడుతున్నవ్‌, నీకు సీఎం రేవంత్‌రెడ్డిని టచ్‌ చేసే దమ్ముందా.. అంటూ ప్రభుత్వ విప్‌, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఫైర్‌ అయ్యారు. బీఆర్‌ఎస్‌ పార్టీ సమావేశాల్లో వారు చేసిన అభివృద్ధిపై చర్చించుకోకుండా.. అధికారం పోయిందని కాంగ్రెస్‌పై, సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటే సహించబోమని హెచ్చరించారు. సిరిసిల్లలోని డీసీసీ ఆఫీసులో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. బతుకమ్మచీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి.. వాటికి సంబంధించిన నిధులను రూ.400కోట్లకు పైగా బకాయిపెట్టిన కేటీఆర్‌ నేతన్నలకు అండగా ఉంటామని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వేయి ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్లుగా కేటీఆర్‌ వ్యాఖ్యలున్నాయని దుయ్యబట్టారు. మాకు అసెంబ్లీలో 65 సీట్లున్నాయ్‌.. అయినా ప్రభుత్వం కూలిపోతుందంటూ అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మతి భ్రమించి మాట్లాడితే సహించబోమని.. నువ్వు ఒక్కటంటే...మేము రెండు అంటామన్నారు.

బీఆర్‌ఎస్‌ కోటలు బీటలు: సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌ కోటలు బీటలు వారాయని అందుకే కేటీఆర్‌ మతిభ్రమించి మాట్లాడుతున్నారని సిరిసిల్ల కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. బతుకమ్మ చీరల ఆర్డర్ల బిల్లులకు టోకెన్లు ఇచ్చి నిధులు ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. శాసనసభలో మీరు 86 మంది ఉన్నప్పుడే కాంగ్రెస్‌ను ఏమి చేయలేకపోయారని.. ఇప్పుడు ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్‌, నాగుల సత్యనారాయణగౌడ్‌, సంగీతం శ్రీనివాస్‌, వైద్య శివప్రసాద్‌, సూర దేవరాజు, గడ్డం నర్సయ్య, రాగుల జగన్‌, కాముని వనిత, వెల్ముల స్వరూప, కల్లూరి చందన తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌ జాతీయస్థాయి పోటీలకు అల్ఫోర్స్‌ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించబోయే ఎస్‌జీఎఫ్‌ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీలకు కరీంనగర్‌లోని అల్ఫోర్స్‌ ఐఐటీ అకాడమీ విద్యార్థిని డి.శ్రీగౌరీపూజిత ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల సిద్దిపేట జిల్లా కొండపాకలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో పూజిత అద్భుత ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయికి ఎంపికవ్వడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు కరీంనగర్‌లోని టైనీటాట్స్‌ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థిని అభినందించారు. జాతీయస్థాయిలో సైతం సత్తా చాటాలని ఆకాంక్షించారు.

వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న రాంనర్సయ్య, తదితరులు

కరీంనగర్‌: సబ్బండ వర్గాలు, సకల జనులు ఉద్యమంలో పాల్గొని తెలంగాణ సాధించుకుంటే కొంత మంది 'మేమే ఇచ్చాం.. మేమే తెచ్చాం' అనే అహంకారంతో మాట్లాడుతున్నారని ఉద్యమ గాయకుడు సుక్క రాంనర్సయ్య అన్నారు. 'స్వరాష్ట్ర కల సహకారమైంది అందరి పోరాట ఫలితమని, తెచ్చింది ఎవరు, ఇచ్చింది ఎవరు అనే అంశంపై నిజాలు మాట్లాడుకుందాం రండి' పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 18న హైదరాబాద్‌లో జరిగే సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో 1,200 మంది ప్రాణాలర్పించి రాష్ట్రం సాధిస్తే నేడు కొంత మంది మేమే తెచ్చామని, మరికొంత మంది మేమే ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడమే కాకుండా అమరుల త్యాగాలు, వారి పేర్లను పాలకులు గుర్తించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో రాపోలు సాంబశివుడు, రాజు, మహేశ్‌, అజయ్‌, సదాశివ, శంకర్‌, యుగేందర్‌, మురళీ, రమేశ్‌, వెంకటేశ్‌, కుమార్‌, ప్రదీప్‌ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన గడ్డం అనూష (27) చికిత్స పొందుతూ మృతిచెందింది. పట్టణ సీఐ నటేశ్‌ వివరాల ప్రకారం.. జగిత్యాల అన్నపూర్ణ చౌరస్తాకు చెందిన అనూషను నిర్మల్‌ జిల్లా ఖానాపూర్‌కు చెందిన గడ్డం హరీశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. జగిత్యాల పోచమ్మవాడలో నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు పుట్టినప్పటి నుంచి అనూష నిత్యం కడుపునొప్పితో పాటు అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 27న ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా, కుటుంబ సభ్యులు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తల్లి పల్లికొండ విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అలయన్స్‌ క్లబ్‌ సేవలు అభినందనీయం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌



అలయన్స్‌ బాధ్యులకు క్లబ్‌పిన్‌ అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌

కరీంనగర్‌టౌన్‌: అసోసియేషన్‌ ఆఫ్‌ అలయన్స్‌ క్లబ్స్‌ ఇంటర్నేషనల్‌ సేవలు అభినందనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ అన్నారు. సోమవారం మంత్రి నివాసంలో అలయన్స్‌ క్లబ్‌ బాధ్యులకు క్లబ్‌ పిన్‌ను అందజేసి మాట్లాడారు. కోవిడ్‌కాలంలో వారు చేసిన, ఇప్పుడు చేస్తున్న అనేక సామాజిక కార్యక్రమాలు హర్షించదగ్గవని అన్నారు. సేవా కార్యక్రమాల పరంపర ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్‌ బాధ్యులు డాక్టర్‌ ఎలగందుల శ్రీనివాస్‌, ఇంజినీర్‌ కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, సిద్దుల బాలకృష్ణ, గాలిపల్లి నాగేశ్వర్‌, చీకోటి శ్రీనివాస్‌గాంధీ, చెరిమల వెంకటేశ్వర్లు, పులాల్‌ శ్యామ్‌, వరుణ్‌ భూపతి, ఎం.విద్యాసాగర్‌ రెడ్డి, కొంజర్ల మహేశ్‌, గామినేని శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజా సంక్షేమ పాలన

- ప్రభుత్వ విప్‌ లక్ష్మణ్‌ కుమార్‌



రిబ్బన్‌ కట్‌ చేస్తున్న విప్‌ లక్ష్మణ్‌ కుమార్‌

గొల్లపల్లి(ధర్మపురి): కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పాలన అందిస్తోందని ప్రభుత్వ విప్‌, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌ కుమార్‌ అన్నారు. సోమవారం గొల్లపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇస్రాజ్‌పల్లిలో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా నూతన పాఠశాలను ప్రారంభించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే మార్కెట్‌ యార్డు, భీంరాజ్‌పల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శ్మశానవాటికను ప్రారంభించారు. రాఘవపట్నం గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డికి రూ.లక్ష ఎల్‌వోసీ అందించారు. అనంతరం లక్ష్మణ్‌ కుమార్‌ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మూడు గ్యారంటీలను అమలు చేశామని, ఫిబ్రవరిలో మిగిలిన గ్యారంటీలను అమలుచేస్తామని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ప్రజలతో కలిసి పనిచేస్తానని అన్నారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు వంటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ జలందర్‌, ఏఎంసీ చైర్మన్‌ హన్మండ్లు, సర్పంచులు చిర్ర గంగాధర్‌, రేవెళ్ల సత్యనారాయణ, ఎంపీటీసీ రవీందర్‌రావు, యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు మహేశ్‌, మాజీ సర్పంచ్‌ భీమ సంతోష్‌, ఎంఈవో జమునాదేవి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ బండి సంజయ్‌.. తీరు మార్చుకో..



మాట్లాడుతున్న సుంకె రవిశంకర్‌

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌

కరీంనగర్‌: కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌ ఐదేళ్లల్లో చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని, దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ మండిపడ్డారు. సోమవారం మీసేవ కార్యాలయంలో మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయిన సంజయ్‌ను ప్రజలు జాలిపడి ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేయాల్సింది పోయి కులమత రాజకీయాలు చేస్తూ మతిభ్రమించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రాబోయే పార్లమెంట్‌ ఎన్నికల్లో మళ్లీ ఎంపీగా గెలువాలని బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌, కేటీఆర్‌, మాజీ ఎంపీ వినోద్‌పై అడ్డగోలు విమర్శలు చేయడం మూర్ఖత్వమన్నారు. వినోద్‌ చొరవ వల్లే కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ దక్కిందన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్‌ హయాంలో కరీంనగర్‌ జిల్లాకు వేల కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేసిన తీరు బండి కళ్లకు కనబడకపోవడం విచారకరమన్నారు. తెలంగాణ సాధనకు 32 పార్టీలను ఏకం చేశారని, అలాంటి వినోద్‌కుమార్‌ను విమర్శిస్తే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. హిందూమతం గురించి మాట్లాడుతున్న బండి సంజయ్‌ కరీంనగర్‌ పార్లమెంట్‌ పరిధిలోని ఆలయాలకు ఎన్ని నిధులు కేటాయించారో వెల్లడించాలని డిమాండ్‌ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ సంజయ్‌ వార్తల్లో వ్యక్తులుగా మిగిలిపోయేందుకే ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ, దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా బండి ఊకదంపుడు మాటలు మానుకోవాలని, లేకుంటే బీఆర్‌ఎస్‌ శ్రేణులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌, గ్రంథాలయ మాజీ చైర్మన్‌ అనిల్‌కుమార్‌గౌడ్‌, నాయకులు షౌకత్‌ అలీ, మధుసూదన్‌రెడ్డి, బోనకుర్తి సాయికృష్ణ, గంగాధర చందు, నవాజ్‌, చంద్రశేఖర్‌, జల్లోజి శ్రీనివాస్‌, హొద్నాల రాజు, సత్తినేని శ్రీనివాస్‌, నరేశ్‌ రెడ్డి, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో పారమిత విద్యార్థి ప్రతిభ



హార్దిక్‌గోయల్‌ను అభినందిస్తున్న ప్రసాదరావు

కొత్తపల్లి(కరీంనగర్‌): నేషనల్‌ ఇండిపెండెంట్‌ స్కూల్‌ అలయెన్స్‌ (నిసా) ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్‌ ఒలింపియాడ్‌ లెవెల్‌-2 పరీక్షలో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి హార్దిక్‌గోయల్‌ జాతీయస్థాయిలో ప్రథమస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్‌ రితేశ్‌మెహతా తెలిపారు. 6,7,8,9వ తరగతుల నుంచి కూడా జాతీయస్థాయిలో మొదటి పది స్థానాలకు గాను 12 మంది పారమిత విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన టి.విఘ్నేశ్‌, పి.మాన్సీ, జె.సాయిరిషిత్‌, ఐ.తిలక్‌, జి.సంతోష్‌, వి.హర్షిణి, కె.అగస్త్యవిస్మృత్‌, సీహెచ్‌.వెంకట మోక్షిత్‌, జి.సహస్ర, ఎం.మనోజ్‌రెడ్డి, ఎ.అశ్విత్‌రెడ్డిలను సోమవారం పాఠశాల చైర్మన్‌ డా.ఇ.ప్రసాదరావు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అనుకర్‌రావు, రశ్మిత ప్రసూన, వినోదరావు, వీయూఎం ప్రసాద్‌, ప్రోగ్రాం హెడ్‌ గోపికృష్ణ, సమన్వయకర్త రాము, గైడ్‌ టీచర్‌ కె.అంజిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వీసాలతో మోసం చేసిన వ్యక్తిపై మరో కేసు

మెట్‌పల్లి(కోరుట్ల): దుబాయ్‌లో ఉద్యోగాల పేరుతో పట్టణానికి చెందిన ఏలేటి రమేశ్‌ నకిలీ వీసాలు ఇచ్చి మోసానికి పాల్పడ్డాడని పలువురు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఖానాపూర్‌ మండలం బాదనకుర్తికి చెందిన మర్రి రాజేశ్‌, మెట్‌పల్లికి చెందిన శివకుమార్‌ తమ వద్ద రూ.97,500 తీసుకొని రమేశ్‌ నకిలీ వీసాలు అందించాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మరో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

క్లుప్తంగా

ఈవీఎంల గోడౌన్ పరిశీలన



గోడౌన్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, తదితరులు

కరీంనగర్అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని కరీంనగర్‌లోని ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపర్చిన గోడౌన్‌ను సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ పరిశీలించారు. జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు డెమోలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట డీఆర్వో పవన్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మడుపు మోహన్, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి ఆగయ్య, బీజేపీ ప్రతినిధి దాసరి రమణారెడ్డి, ఎంఐఎం పార్టీ ప్రతినిధి ఆమీన్, బీఎస్పీ ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ: నగరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఆర్యవైశ్య పట్టణ ఆర్యవైశ్య యువజన విభాగం ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్, యువజన సంఘం అధ్యక్షుడు తణుకు సాయి కృష్ణ, పట్టణ మహాసభ అధ్యక్షులు నగునూరి రాజేందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్, కన్నా సాయి, గంప వెంకటేశ్, చిట్టిమల్ల రాహుల్, సామ ఆకాశ్, వినీత్, కొమురవెల్లి రాజేందర్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారిగా ప్రియదర్శిని

కరీంనగర్ అర్బన్: జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ బదిలీ అయ్యారు. శ్రీధర్‌ను తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఓఎస్డీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారిగా రైతు శిక్షణ కేంద్రం ఏడీ ప్రియదర్శినిని నియమించారు. కాగా శ్రీధర్ కరీంనగర్ డీఏవోగా సుదీర్ఘ కాలం పనిచేసి పలువురి మన్ననలు పొందారు. అత్యధిక కాలం ఏడేళ్లుగా జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు నిర్వహించారు.

బీజేపీ నాయకుల సంబరాలు



స్వీట్లు పంచుతున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: బీహార్ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని టవర్ సర్కిల్‌లో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండ రమణారెడ్డి, అనూప్ కుమార్, కటకం లోకేశ్, అవుదుర్తి శ్రీనివాస్, హరిశంకర్, లడ్డు ముందడా, రాయి రాము, హరిప్రసాద్, సందీప్, ఆడిచెర్ల రాజు, తణుకు సాయి కృష్ణ, గణేశ్, ఉమా మహేశ్, పోరెడ్డి శ్రీధర్, నారాయణ, బతిని మహేశ్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శానిటేషన్ విభాగంలో పబ్లిక్ హెల్త్‌వర్కర్లుగా పనిచేస్తున్నట్లు రికార్డుల్లో ఉన్నా, విధులకు మాత్రం రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ మహమ్మద్ అమీర్, సిరిపురం నాగప్రసాద్, హరీశ్‌గౌడ్, శ్రీకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతరకు ఏర్పాట్లు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కేశవపూర్‌లో శ్రీసమ్మక్క, సారలమ్మ జాతర పురస్కరించుకొని భక్తుల కోసం వివిధ రకాల పనులను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు సోమవారం ప్రారంభించారు. జాతర ప్రాంతంలోని పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాతకాల రమేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బొల్ల సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ఆమె పాలన.. ప్రగతికి బాట

- పల్లెలను ప్రగతిబాట పట్టించిన మహిళా సర్పంచులు
- ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి
- పరిపాలనలో ప్రత్యేక గుర్తింపు



ఇంట్లో ఉన్నప్పుడు ఇంటి పనులు, భర్త, పిల్లలు అంటూ వారి బాగోగులపై దృష్టి పెట్టిన మహిళా సర్పంచులు బయటకు వస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారు. కుటుంబం, ప్రజాసేవ రెండింటిని సమన్వయపర్చుకుంటూ పాలనలో తమ ప్రత్యేకతను చాటుకున్నారు. ఐదేళ్లలో పురుషుల కంటే దీటుగా గ్రామాలను అభివృద్ధి చేసి చూపించారు. ఈనెల 31తో సర్పంచుల పదవీకాలం ముగుస్తుండటంతో కరీంనగర్ మండలంలోని మహిళా సర్పంచుల మనోగతం వారి మాటల్లో..

– కరీంనగర్‌రూరల్

మొదటి సర్పంచ్‌గా గుర్తింపు



2019లో చెర్లభూత్కూర్ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీ. మొదటి సర్పంచ్‌గా ఎన్నిక కావడం జీవితాంతం గుర్తుండిపోయే విషయం. కొత్త గ్రామపంచాయతీ అన్నింట్లో ముందుండాలనే తపనతో దాదాపు రూ.1.50కోట్లతో నూతన గ్రామపంచాయతీ భవనం, వైకుంఠధామం, కంపోస్టుషెడ్, సీసీ రోడ్లు, పల్లె ప్రకృతివనం తదితర పనులు పూర్తిచేయడం ఎంతో సంతోషంగా ఉంది.

– మడికంటి మమత, సర్పంచ్, తాహెర్‌కొండాపూర్

అభివృద్ధికి ప్రాధాన్యత



2019లో కొత్తగా ఏర్పాటైన దుబ్బపల్లి గ్రామపంచాయతీకి మొదటి సర్పంచ్‌గా ఎన్నికయ్యా. వార్డు సభ్యులు, అధికారుల సహకారంతో గ్రామాన్ని కొంత మేరకు అభివృద్ధి పరిచాను. రూ.20లక్షలతో కొత్త గ్రామపంచాయతీ భవనం, రూ.16లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, నర్సరీ, వైకుంఠధామం, కంపోస్టుషెడ్ తదితర పనులు చేయడం సంతోషంగా ఉంది.

– సిరిగిరి దుర్గ, సర్పంచ్, దుబ్బపల్లి

ప్రజాప్రతినిధిగా అందుబాటులో..



గతంలో ఎంపీటీసీగా, ఉప సర్పంచ్‌గా ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయడంతో సర్పంచ్‌గా గెలిచా. 15 ఏళ్లుగా ప్రజల కష్టసుఖాలను దగ్గరుండి తెలుసుకునే అవకాశం కలిగింది. సర్పంచ్‌గా శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు, క్రీడాప్రాంగణం, నర్సరీ, సీసీరోడ్లు నిర్మాణంపూర్తి చేశా. గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేశా.

– చామనపల్లి అరుణ, సర్పంచ్, చేగుర్తి

అత్త, మామ, భర్త స్ఫూర్తితో..



1982 నుంచి 2001 సంవత్సరం వరకు అత్త మామలు రుద్ర విశ్వనాథం, సుభద్ర సర్పంచులుగా పని చేశారు. 2001 నుంచి 2013 వరకు భర్త రాము రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేయగా 2019లో జనరల్ మహిళాస్థానంలో ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. అత్తమామలు, భర్త చేసిన అభివృద్ధి పనులను స్ఫూర్తిగా తీసుకుని ఐదేళ్లలో చేసిన అభివృద్ధి సంతోషం కలిగిస్తోంది.

– రుద్ర భారతి, సర్పంచ్, జూబ్లీనగర్

ఎంపీటీసీగా అనుభవంతో అభివృద్ధి



ఎంపీటీసీగా గెలువక ముందు భర్త, ఇద్దరు పిల్లలతోనే కాలం గడిచేది. 2014 ఎంపీటీసీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికై ప్రజాప్రతినిధిగా సేవ చేసే అవకాశం పొందా. సర్పంచ్‌గా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించా. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశా.

– ఊరడి మంజుల, సర్పంచ్, గోపాల్‌పూర్

ఊరు మారిపోయింది



ఐదేళ్లలో సర్పంచ్‌గా చేసిన అభివృద్ధి పనులతో ఊరు ఎంతో మారిపోయింది. పంచాయతీ, ఎమ్మెల్యే నిధులు సుమారు రూ.1.75 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణం జరిగింది. బతుకమ్మఘాట్, క్రీడాప్రాంగణం, ఓపెన్ జిమ్, స్వాగత కమాన్ నిర్మాణంతో గ్రామానికి కొత్త కల వచ్చింది.

– బోగొండ లక్ష్మి, సర్పంచ్, చామనపల్లి

అభివృద్ధి పనులతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీలత, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

కొత్తపల్లి: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని, ఐదేళ్ల పదవీకాలంలో ప్రజలకు చేసిన సేవనే కీర్తిని తెస్తుందని ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ అన్నారు. ఈనెల 31వ తేదీతో ఐదేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని సర్పంచులకు వీడ్కోలు పలుకుతూ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజల మన్ననలు పొందితే మరో అవకాశం లభిస్తుందని, అలాంటి అవకాశం సర్పంచులకు లభించాలని కోరారు. ఆసిఫ్‌నగర్, బద్దిపల్లి, చింతకుంట, కమాన్‌పూర్, మల్కాపూర్, ఖాజీపూర్, నాగులమల్యాల సర్పంచులు కడారి శాంతశ్రీనివాస్, రాచమల్ల మధు, మొగిలి మంజులసమ్మయ్య, జి.సంపత్, గొట్టి జ్యోతి పోశయ్య, ఉల్లెందుల రాజవ్వ, నాయిని ప్రసాద్‌లను ఎంపీపీ, ఎంపీడీవో తదితరులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు భూక్య తిరుపతినాయక్, పత్తె శారదలక్ష్మీనారాయణ, కొమ్ము హేమలత రవికిరణ్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పిల్లి మహేష్, పిట్టల రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలి



అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్

కరీంనగర్ సిటీ: విద్యార్థులు భావిభారత దేశ దిశానిర్దేశకులుగా మారాలని, వచ్చే రోజుల్లో యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం ఎస్సారార్ కళాశాలలో ఓటు హక్కు వినియోగం–ప్రాముఖ్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఓటు అనే ఆయుధంతో మన భవిష్యత్‌కు బాటలు వేసే మంచి రాజకీయ నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రచురించిన ఓటరు అవగాహన కరపత్రాలను విద్యార్థులకు అందించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ బీఆర్‌ఎస్‌వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, సోమిరెడ్డి రాజా నరేశ్‌రెడ్డి, వల్లకొండ పర్శురాములుగౌడ్, ఎస్సారార్ కళాశాల అధ్యక్షుడు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను అవమానిస్తే చూస్తూ ఊరుకోం



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: సీఎం రేవంత్‌రెడ్డిను అవమానపరిస్తే ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నగర శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమెరికాలో హోటల్‌లో పనిచేసిన కేటీఆర్ తన తండ్రి కేసీఆర్ వ్యాపారం బాగుందని ఇక్కడికి వచ్చాడన్నారు. సిరిసిల్లలో కష్టపడి పనిచేసిన కేకే మహేందర్‌రెడ్డి సీటును గుంజుకొని స్వార్థంతో ఎమ్మెల్యే అయ్యాడన్నారు. అధికారం పోయినప్పటికీ రాచరికపోకడలు పోవడం లేదని ధ్వజమెత్తారు. రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, బాలబద్రి శంకర్, పెద్దిగారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల విమర్శలు అర్థరహితం

కరీంనగర్: బీఆర్‌ఎస్ నేతలు అధికారంలో నుంచి గద్దె దిగాక కాంగ్రెస్ నేతలపై అడ్డగోలు విమర్శలు చేయడం మానుకోవాలని డీసీసీ అధికార ప్రతినిధులు గూడ కనుకయ్య, కాడె శంకర్, జిల్లా నాయకులు తాళ్ల వెంకటేశ్, దండి రవీందర్‌లు సంయుక్త ప్రకటనలో హెచ్చరించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన విమర్శలను వెనక్కి తీసుకోవాలని, అహంకార పూరిత మాటలతో గద్దె దిగామన్న విషయాన్ని మరిచిపోయి బీఆర్‌ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

'జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి'

కరీంనగర్‌టౌన్: వైద్య ఆరోగ్య శాఖలోని జీవో 317 బాధిత స్టాఫ్ నర్సులకు న్యాయం చేశాకే కొత్త వారికి పోస్టింగ్స్ ఇవ్వాలని తెలంగాణ వైద్య ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాస్ కర్ణ, రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రెటరీ అఫ్తాబ్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం 317 జీవో తీసుకొచ్చి ఉద్యోగులకు ఎటువంటి స్థానికత, సొంత జోన్ కూడా చూడకుండ ఇష్టమున్న రీతిగా వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లాలకు బదిలీలు చేసిందన్నారు. దీంతో ఉద్యోగులు రెండేళ్లుగా ఎన్నో కష్టాలు అనుభవిస్తూ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం 317 జీవోను సవరించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మానిఫెస్టోలో పెట్టారని, కావున వైద్య ఆరోగ్య శాఖలోని 317 జీవో బాధిత ఉద్యోగులందరికీ ప్రత్యేక బదిలీలు చేపట్టాలని కోరారు.

పేపర్ లీకేజీ దోషులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

కరీంనగర్‌క్రైం: శాతవాహన విశ్వవిద్యాలయంలో 2021 ఆగస్టు 18న పేపర్ లీకేజీకి పాల్పడిన దోషులపై క్రిమినల్ చర్యలు నమోదు చేయాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిశెట్టి రాజేశ్‌గౌడ్ సోమవారం పోలీసు కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. లీకేజీపై ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఎస్. మల్లేశ్ కేసులు నమోదు చేశామని, ఫోర్‌మెన్ కమిటీ వేశామని ఎంతటి వారినైనా వదిలిపెట్టమని దోషులను శిక్షిస్తామని చెప్పినప్పటికీ దోషులను బహిర్గతం చేయలేదన్నారు. చర్యలకు ముందుకు పోకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలతో నీరుగార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్ లో జరుగుతున్న అనేక అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



అంజనాద్రి లక్ష్మీగణపతి ఆలయంలో..



నగునూరు దుర్గాభవానీ ఆలయంలో..

కరీంనగర్ కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగతనగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, ప్రకాశం గంజ్ వరసిద్ధి వినాయక స్వామి ఆలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో భక్తులు పాల్గొన్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు భక్తుల పూజల కోసం ఏర్పాట్లు చేశారు.

దుర్గాభవానీ ఆలయంలో..

విద్యానగర్(కరీంనగర్): నగునూరులోని దుర్గాభవానీ ఆలయంలో గల లక్ష్మీగణపతికి ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కృష్ణశర్మ జరిపారు. పూజల్లో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం లాంటిది



ఓటు హక్కుపై వివరిస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

కరీంనగర్: ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు ఓటరు నమోదుతో పాటు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరూ ప్రజా సమస్యలపై పోరాడే, నిత్యం ప్రజల్లో ఉండే విద్యావంతుడైన, కుల, మత భేదం లేకుండా ప్రజల కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం గళమెత్తే నాయకుడికి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు ద్యావ మధుసూదన్‌రెడ్డి, సత్తినేని శ్రీనివాస్, గవ్వ వంశీధర్‌రెడ్డి, బండ వేణు, సాయికృష్ణ, ప్రదీప్, శ్రావణ్, తరుణ్, యశ్వంత్, ఓంకార్, స్వామి, పర్శరాం, సందీప్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీలకు ఎంపిక



ఫాజిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సరిత

కొత్తపల్లి: తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రతిభ పోటీ పరీక్షలో కొత్తపల్లి మండలం ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థి ఎండీ. ఫాజిల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ వి.సరిత తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన జిల్లా స్థాయి ప్రతిభ పోటీ పరీక్షలో ప్రథమ స్థానంలో నిలిచి తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఈనెల 31వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈమేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫాజిల్‌ను ఆమె అభినందించారు. రాష్ట్రస్థాయిలో సైతం సత్తాచాటాలని ఆకాంక్షించారు. గణిత ఉపాధ్యాయులు ఎం.విఠల్, బి.రజిత, తుమ్మ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ: పత్తి వాహనాలతో పరేషాన్



కరీంనగర్ మండలం ఎలబోతారంలో పత్తి వాహనాల రాకపోకలతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామశివారులోని జిన్నింగ్ మిల్లుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రతీరోజు పెద్దసంఖ్యలో పత్తిలోడ్లతో వచ్చే వాహనాలతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. గాలి వీచినప్పుడు పత్తి నుంచి వచ్చే దుమ్ము, ధూళితో ద్విచక్రవాహనదారులు, స్థానికులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ తెలిపారు. సోమవారం పత్తి వాహనాలతో జిన్నింగ్ మిల్లు ఎదుట ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు వివరించారు. ఇప్పటికైనా పత్తి వాహనాలను రోడ్డుపై నిలుపకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

– కరీంనగర్‌రూరల్

దారుస్సలాంను సందర్శించిన ఎంఐఎం ఎమ్మెల్సీ



రహ్మత్ బేగ్‌ను సన్మానిస్తున్న ఎంఐఎం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలాంను హైదరాబాద్ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ సోమవారం సందర్శించారు. ఎంఐఎం ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రహమత్ బేగ్‌ను ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఐఎం నిర్మల్ అధ్యక్షుడు అజీమ్ బిన్ మహియా, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర జనరల్ సెక్రెటరీ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్, కోశాధికారి ఇబ్రహీం, నాయకులు అలిబాబా, అజర్, సాజిద్, బాల్ రాజ్, అంజద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో నిబంధనలకు విరుద్ధంగా కిరాయిలకు నడుపుతున్న ట్రావెల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ఇతర డిపార్టుమెంట్లలో ఏర్పాటు చేసిన అద్దె వాహనాలు కేటాయింపులో అవినీతి జరుగుతుందన్నారు. ఎల్లో ప్లేట్ల వాహనాలకు బదులు వైట్ ప్లేట్ గల వాహనాలు వాడుతున్నారని తెలిపారు. దీనిపై స్పందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి, టాక్సీ డ్రైవర్లు నాంపల్లి రవి, నర్సింగోజు రవి, తదితరులు ఉన్నారు.

ఆర్వో ప్లాంట్ బహూకరణ



ఆర్వోప్లాంట్ ప్రారంభిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 50 ప్లేట్లు అందించారు. కరీంనగర్‌కు చెందిన పిల్లల వైద్యుడు కృష్ణచైతన్య ఆర్వో ప్లాంట్, కె.సౌజన్యప్రవీణ్‌లు స్పీకర్‌బాక్స్ సౌండ్‌సిస్టం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, ఎంఈవో మధుసూదన్‌చారి, ప్రధానోపాధ్యాయులు రమాదేవి, గీత తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ: ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, నగర అధ్యక్షుడు కేశబోయిన రాముయాదవ్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నునవత్ శ్రీనివాస్, నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, వినయ్, పవన్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...



అధునాతన ప్రభుత్వ పాఠశాలను చూసి ఆశ్చర్యపోయా

ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

సాక్షి, అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ (ట్విట్టర్) వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. సోమవారం ఆయన స్వగ్రామం బాపట్లకు సమీపంలోని కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, తరగతి గదుల్లో విద్యార్థుల బల్లలపై కూర్చుని, ఫొటోలు దిగి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. 'అందంగా, అధునాతనంగా మారిన కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను చూసి నాకు చాలా సంతోషంగానూ, ఆశ్చర్యంగా అనిపిస్తోంది' అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సర్వీస్ నిబంధనపై హైకోర్టు స్టే

సాక్షి, హైదరాబాద్: సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసిన పీజీ విద్యార్థులు ఓ ఏడాది పాటు ప్రభుత్వ సర్వీస్ చేయాలని, అలా చేయకుంటే రూ.50 లక్షలు జరిమానా చెల్లించాలన్న సర్కార్ నిబంధనపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అలాగే ప్రభుత్వ సర్వీసు నిమిత్తం కేటాయించిన సంబంధిత కాలేజీల్లో చేరాలంటూ వైద్యవిద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను కూడా నిలిపివేసింది. సూపర్ స్పెషాలిటీ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ సర్వీసు చేయాలని, లేని పక్షంలో రూ. 50 లక్షలు జరిమానా చెల్లించాలని... ఈ మేరకు అంగీకారం తెలుపుతూ బాండ్ సమర్పించాలన్న నిబంధనను సవాలు చేస్తూ డాక్టర్ అన్వేష్‌కుమార్‌రెడ్డి మరో 22 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రావణ్ కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పై రెండు అంశాలపై స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు పిటిషనర్లకు మాత్రమే వర్తిస్తాయన్నారు. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 14కు వాయిదా వేశారు.

ఏపీ స్కూళ్లలో పెరిగిన చేరికలు

టాప్-4 రాష్ట్రాల్లో ఏపీకి తొలిస్థానం

- సంస్కరణలతో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్కూళ్ల స్థాయిలో భారీ పెరుగుదల
- జాతీయ స్థాయిని మించి ఏపీలో స్థూల నమోదు నిష్పత్తి పెరుగుదల
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: విద్యా రంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 2021 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి (పిల్లలు చేరికలు)లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ విషయాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2017తో పోలిస్తే 2021లో దేశంలోని స్థూల నమోదు నిష్పత్తి పెరిగిన టాప్– రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలిస్థానంలో ఉందని ఆ నివేదిక తెలిపింది. అలాగే, 2021లో జాతీయ స్థూల నమోదును మించి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక స్థూల నమోదు ఉందని కూడా పేర్కొంది. 2017తో పోలిస్తే.. 2021లో రాష్ట్రంలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్థాయిలో స్థూల నమోదు నిష్పత్తి భారీగా పెరిగిందని కూడా నివేదిక తెలిపింది.

'అమ్మఒడి' ప్రోత్సాహంతోనే..

స్థూల నమోదు నిష్పత్తిలో టాప్ నాలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తరువాత ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ ఉండగా.. స్థూల నమోదు 2017తో పోలిస్తే 2021లో తగ్గిన నాలుగు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, బిహార్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2017తో పోలిస్తే 2021లో ప్రైమరీలో 18.4 శాతం, అప్పర్ ప్రైమరీలో 13.4 శాతం, ఎలిమెంటరీలో 16.5 శాతం స్థూల నమోదు పెరిగినట్లు నివేదిక తెలిపింది. ఇందుకు ప్రధాన కారణం బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. అన్ని వర్గాల్లోని పేదల తల్లిదండ్రులకు తమ పిల్లల చదువులు భారం కాకూడదనే దూరదృష్టితో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మఒడి పథకం అమలుచేస్తోంది. ఈ పథకం అమలు ద్వారా పేద వర్గాల పిల్లలందరూ స్కూళ్లలో చేరేలా ప్రోత్సాహం అందిస్తోంది. జగనన్న అమ్మఒడి ద్వారా పిల్లలను స్కూళ్లకు పంపితే ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో అన్ని వర్గాల్లోని పేదలు తమ పిల్లలను స్కూళ్లకు పంపుతున్నారు.

స్థూల నమోదు వృద్ధికి దోహదపడిన సంస్కరణలు..

- మనబడి నాడు–నేడు ద్వారా తొలిదశలో.. 15 వేలకు పైగా ప్రభుత్వ స్కూళ్లలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు.
- రెండో దశలో మరో 22,221 స్కూళ్ల రూపురేఖలను మార్చే పనులు చేపట్టారు.
- దీంతోపాటు.. పిల్లలు మధ్యలో చదువు మానేయకుండా గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా చర్యలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. పిల్లలు ఎవరైనా స్కూళ్లకు వెళ్లకపోతే వలంటీర్లు ఆ పిల్లల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి కారణాలు తెలుసుకుని తిరిగి స్కూళ్లకు వచ్చేలా ప్రభుత్వం చర్యలను తీసుకుంది.
- స్కూళ్లకు వచ్చే పిల్లలకు జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోంది.
- పేద పిల్లల చదువులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు తల్లిదండ్రులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా కిట్‌ను అందిస్తోంది.
- ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంను కూడా అమలుచేస్తోంది. పిల్లలకు ట్యాబులను కూడా అందిస్తోంది. ఈ చర్యలన్నీ కూడా పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి పెరగడానికి దోహదం చేశాయి.

రాజ్యసభ 3 స్థానాలూ వైఎస్సార్‌సీపీకే..



సాక్షి, అమరావతి: ఏపీలో వచ్చే ఏప్రిల్ 2న ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీకే దక్కనున్నాయి. గతంలో రాష్ట్ర కోటాలో రాజ్యసభకు ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ), సీఎం రమేష్ (బీజేపీ)ల పదవీకాలం ఏప్రిల్ 2తో పూర్తికానుంది. వీటికి ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారు. ప్రస్తుతం శాసనసభలో ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరడం ఖాయం. దీంతో రాష్ట్ర కోటాలో మొత్తం 11 స్థానాలూ వైఎస్సార్‌సీపీ పరమవుతాయి. అంటే.. ఏప్రిల్ 2 తర్వాత రాజ్యసభలో టీడీపీ ఉనికే లేకుండాపోతోంది. ఆ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకూ 41 ఏళ్లలో రాజ్యసభలో టీడీపీకి ప్రాతినిధ్యం లేకుండా పోవడం ఇదే ప్రథమం అవుతుంది. ఇక రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతం ఆ సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని దేశంలోని రాష్ట్రాల ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. మన రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 151 స్థానాల్లో ఘన విజయం సాధించింది. టీడీపీ 23 స్థానాలకే పరిమితమైంది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో సత్సంబంధాలు నెరిపి.. అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేష్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు చక్రం తిప్పారు. రాష్ట్ర కోటాలో ఎన్నికైన రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (ముగ్గురు టీడీపీ, ఒకరు వైఎస్సార్‌సీపీ) పదవీ కాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఈ ఎనిమిది స్థానాలు వైఎస్సార్‌సీపీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి సీఎం జగన్ చాటిచెప్పారు.

దివ్యాంగుడికి 'గోవర్ధన' నిలయం

- దివ్యాంగుడికి ఇల్లు కట్టించి ఇచ్చిన మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- రూ.10 లక్షల సొంత డబ్బు వెచ్చించి





గంప గోవర్ధన్ కట్టించి ఇచ్చిన ఇల్లు

కామారెడ్డి క్రైం: నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ప్రధాన రహదారిలో.. కామారెడ్డి మున్సిపల్ పరిధి పాత రాజంపేటలోని రైల్వే గేటు పక్కనే ఓ చిన్న పూరి గుడిసె ఉండేది. వర్షం పడినప్పుడల్లా ఇళ్లంతా కురవడంతో నీరు చేరి అందులోని ఓ దివ్యాంగుడు, కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ రోడ్డు మీదుగా వెళ్తున్నప్పుడల్లా వారి అవస్థలను మాజీ ఎమ్మెల్యే, అప్పటి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గమనించేవారు. ఈ క్రమంలో 8 నెలల క్రితం గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన గంప గోవర్ధన్ వద్దకు రెండు కాళ్లులేని దివ్యాంగుడు షేక్ ఖాదర్ వెళ్లి తన గోడును వెళ్లబోసుకున్నాడు. వెంటనే స్పందించిన గోవర్ధన్ మీ అవస్థలను గమనించానని, మీకు సొంతిళ్లు కట్టిస్తానని మాట ఇచ్చారు. వెంటనే రూ.10 లక్షలు తన సొంత డబ్బును వెచ్చించి 80 గజాల విస్తీర్ణంలో హాలు, కిచెన్, బెడ్‌రూం, ఇతర అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తయిన ఆ పక్కా ఇంటిని గోవర్ధన్ ఆదివారం ప్రారంభించారు. సొంత డబ్బుతో ఇంటిని నిర్మించి ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఔదార్యంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..: గంప గోవర్ధన్

రైల్వే గేటు సమీపంలోని గుడిసెలోకి వర్షం నీరుచేరి దివ్యాంగుడు ఖాదర్, కుటుంబం ఇబ్బంది పడటం చాలా సార్లు గమనించాను. అతనికి ఏదైనా సహాయం చేయాలనుకున్నా. మరో చోట ఇల్లు కట్టిస్తానంటే వద్దన్నాడు. దాంతో గుడిసె ఉన్న స్థలంలోనే సొంత డబ్బుతో ఇల్లు నిర్మించి ఇచ్చాను. ఓ దివ్యాంగుడికి సహాయపడినందుకు సంతృప్తిగా, సంతోషంగా ఉంది.

నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్‌బాబు

బోధన్: మూతపడిన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య ఉన్నత శాఖాధికారులు 10 మందితో కమిటీ వేసింది. కమిటీ చైర్మన్‌గా పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్‌గా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి, పరిశ్రమల, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ కమిటీలో ఉన్నారు. ఈనెల 12న కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 4ను జారీ చేసింది. బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని 1938లో నిజాం హయాంలో నెలకొల్పారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా షుగర్ ఫ్యాక్టరీల విస్తరణకు దోహదపడింది. 2002లో చంద్రబాబు హయాంలో బోధన్, ముత్యంపేట (జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఫ్యాక్టరీలను ప్రైవేట్ చేశారు. దీంతో నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) రూపాంతరం చెందింది.

రెండు దరఖాస్తులు చాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎండీ, డీఎన్‌బీ ఇలా 67,802 పీజీ మెడికల్ సీట్లున్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయి రెండింటిలోనూ సీట్లను నీట్ ప్రవేశపరీక్ష ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం అఖిల భారత ర్యాంకు ఆధారంగా మెరిట్ జాబితాను తయారు చేస్తున్నారు. అభ్యర్థులు తమ రాష్ట్ర పరిధిలో దరఖాస్తు చేసుకున్నప్పుడు.. వారిని రాష్ట్ర కేటగిరీగా గుర్తించి, తదనుగుణంగా మెరిట్ జాబితాలను తయారు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం అన్ని మెడికల్ కాలేజీల్లోని 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు, డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించేది. అభ్యర్థులెవరైనా ఈ 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక రాష్ట్ర కోటా, రాష్ట్రాల పరిధిలోకి వచ్చే ఇతర సీట్లకోసం అభ్యర్థులు తమ సొంత రాష్ట్రాల్లోని కాలేజీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ అధికారులు కూడా.. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లోని సీట్లకు ఆలిండియా ర్యాంకుల ఆధారంగా మెరిట్ జాబితాలు తయారు చేసి అడ్మిషన్లు చేస్తారు.

ప్రైవేట్ సీట్లకూ జాతీయస్థాయి కౌన్సెలింగ్

ప్రస్తుతం రాష్ట్రాల్లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లకు ఆయా రాష్ట్రాల్లోనే కౌన్సెలింగ్ జరుగుతోంది. వాటిలో కన్వీనర్ కోటాకు వేరుగా, బీ కేటగిరీ, ఎన్నారై కోటాల సీట్లకు వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వీటిలోని ఓపెన్ కేటగిరీ సీట్లకు దేశంలోని ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ కౌన్సెలింగ్ కోసం వేర్వేరుగా దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తోంది. ఎన్ఎంసీ నిర్ణయం అమల్లోకి వస్తే.. ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కాలేజీల్లోని వివిధ కేటగిరీల సీట్లకు ఒకే దరఖాస్తు సరిపోతుంది, ఒకేసారి కౌన్సెలింగ్ జరుగుతుంది.

- ఉదాహరణకు తెలంగాణలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉన్న బీ కేటగిరీ సీట్లలో 85 శాతం స్థానికులకు కేటాయించగా, మిగతా 15 శాతం ఓపెన్ కేటగిరీ సీట్లకు దేశంలోని ఏ రాష్ట్రం వారైనా పోటీపడొచ్చు.

ఈ ఓపెన్ కేటగిరీ రిజర్వేషన్లు వివిధ రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఒకే దరఖాస్తు ద్వారా ఆయా రాష్ట్రాల్లోని కాలేజీల్లో ఎక్కడో ఒకచోట సీటు పొందవచ్చు. నచ్చినచోట చేరవచ్చని, లేకుంటే తదుపరి కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని ఎన్ఎంసీ అధికారులు చెప్తున్నారు.

- గత ఏడాది దేశవ్యాప్తంగా 20.87 లక్షల మంది నీట్ యూజీ పరీక్ష రాశారు. మొత్తం 11,45,976 మంది అర్హత సాధించగా.. అందులో ఏపీ నుంచి 42,836, తెలంగాణ నుంచి 42,654 మంది ఉన్నారు.

ఎక్సైజ్‌లో బదిలీల హడావుడి

- తొలిసారి ఎన్నికల కమిషన్ ఆదేశాలు
- ఎస్సై నుంచి ఉన్నతాధికారి వరకు..
- దీర్ఘకాలికంగా ఒకే చోట ఉంటే స్థానచలనమే
- మొదలైన కసరత్తు..



ఆదిలాబాద్ డీపీఈవో కార్యాలయం

సాక్షి, ఆదిలాబాద్: ఎక్సైజ్‌లో బదిలీల హడావుడి మొదలైంది. ప్రస్తుతం ఆ శాఖలో ఎవరిని అడిగినా స్థానచలనం గురించే ప్రస్తావిస్తున్నారు. ఎస్సై నుంచి మొదలుకుంటే జిల్లాస్థాయిలో డీపీఈవో.. ఉమ్మడి జిల్లా స్థాయిలో డీసీ వరకు బదిలీలు జరిగే పరిస్థితి ఉందని చెప్పుకుంటున్నారు. సాధారణంగా ఎన్నికలు వచ్చాయంటే ఈసీ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసుశాఖల్లో బదిలీలు ఉంటాయి. ఈసారి ఎక్సైజ్ శాఖను కూడా ఇందులో చేర్చారు. దీనికి సంబంధించిన కసరత్తు రాష్ట్రస్థాయిలో మొదలైందని శాఖలో పలువురు పేర్కొంటున్నారు. రెండుమూడు రోజుల్లోనే ఈ బదిలీలు జరగవచ్చని అంటున్నారు.

ఈసీ ఆదేశాలతో..

అబ్కారీశాఖలో ఆఫీసర్లు దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్నారు. 2017–18 తర్వాత ఈ శాఖలో బదిలీల ప్రక్రియ చోటు చేసుకోలేదు. జీవో 317 కింద కొంత మందికి జోనల్ స్థాయిలో బదిలీలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్‌శాఖ పరంగా ఆదిలాబాద్ ప్రధాన కార్యాలయంగా డిప్యూటీ కమిషనర్ (డీసీ) పరిధిలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల డీపీఈఓ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, లక్సెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. వీటితో పాటు వాంకిడి, భోరజ్, సొనాల, లక్ష్మీపూర్, భైంసాలలో చెక్‌పోస్టులు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో పలువురు సీఐలు, ఎస్సైలు, గత ఐదారేళ్లుగా ఒకే చోట కొనసాగుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తొలిసారి ఈ శాఖలో కూడా బదిలీలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది.

మంచి పోస్టింగ్‌కు యత్నాలు..

పలువురు సీఐలు, ఎస్సైలు మంచి పోస్టింగ్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. రాష్ట్ర రాజధానిలో తమకు పరిచయం ఉన్న ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలు చేస్తున్నారు. అయితే పైరవీలకు ఆస్కారం లేకుండా ఈ బదిలీలు చేపట్టాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల నేపథ్యంలో కమిషనర్ శ్రీధర్, డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఈ బదిలీల విషయంలో సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నట్లు శాఖలో చర్చ సాగుతోంది. అయినప్పటికీ పలువురు తమ స్థాయిలో ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉంటే కొంత మంది ఆఫీసర్లు దీర్ఘకాలికంగా ఒకేచోట ఉండడంతో మధ్యలో బదిలీల కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ సాధ్యం కాలేదు. ఈ క్రమంలో ప్రస్తుతం బదిలీలు ఎప్పుడు జరుగుతాయో.. తాము కోరుకున్న చోటికి వెళ్లగలుగుతామా లేదా.. అనే మీమాంసలో ఈ ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారు.

డిప్యూటేషన్ల లొల్లి..

బదిలీల పరిస్థితి ఇలా ఉంటే.. ఈ శాఖలో డిప్యూటేషన్ల విషయంలో వివాదం తలెత్తుతోంది. కానిస్టేబుళ్ల నుంచి మొదలుకుంటే ఎగ్జిక్యూటివ్, మినిస్టీరియల్ విభాగాల్లో పలువురు తమకు అనువైన చోట డిప్యూటేషన్ పొందడంతో ఇటు రెగ్యులర్‌గా విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. ఈ డిప్యూటేషన్లను కూడా రద్దు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. ప్రభుత్వం ఇప్పటికే డిప్యూటేషన్ల విధానంపై సీరియస్‌గా ఉండడంతో శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంలో దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ఇతర శాఖల్లో డిప్యూటేషన్ విధానాన్ని రద్దు చేసిన దరిమిలా ఎక్సైజ్‌లోనూ ప్రక్రియ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి బాటలు పడేనా

- మిడ్‌మానేర్ నిర్వాసితులకు నైపుణ్య శిక్షణకు ప్రణాళికలు
- నాబార్డ్ ఆధ్వర్యంలో సన్నాహాలు
- ప్రభుత్వ విప్ ఆదేశాలతో కదిలిన అధికారులు



ఇతను బోయినపల్లి మండలం నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన నిర్వాసిత యువకుడు పెంతల నరేశ్. ఊరిలో జీవనోపాధి లేక కరీంనగర్ జిల్లా బావుపేటలో ఓ వెల్డింగ్‌షాపులో పనిచేస్తున్నాడు. ప్రభుత్వం ఉపాధికి సబ్సిడీ రుణం మంజూరు చేస్తే కొదురుపాకలో వెల్డింగ్ షాపు పెట్టుకోవాలనుకుంటున్నాడు.



చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో డీఆర్డీవో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన నిర్వాసితులు ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. పునరావాస కాలనీల్లో పనులు లేక ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. తమకు ఉన్న ఊరిలోనే ఉపాధి చూపాలని నిర్వాసితులు కోరడంతో ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈమేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాబార్డ్ సౌజన్యంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో అవగాహన సదస్సులు

ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో 18 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు గల పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ కోర్సులు చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు.. వారు ఎంచుకున్న రంగాలలో శిక్షణ ఇచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ, కొడుముంజ, ఇల్లంతకుంట మండలం అనంతగిరి ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో డీఆర్డీవో నక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ అవగాహన సదస్సులకు 215 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. స్వశక్తి సంఘాల సభ్యులకు 15 రోజుల శిక్షణ కార్యక్రమాల్లో మధ్యాహ్న భోజనంతోపాటు స్టైఫండ్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

10 వేలకు పైగా నిర్వాసిత కుటుంబాలు

బోయినపల్లి మండలం మాన్వాడ మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో బోయినపల్లి, ఇల్లంతకుంట, వేములవాడ, తంగళ్లపల్లి మండలాల్లోని కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి, శాభాష్‌పల్లి, అనుపురం, రుద్రవరం, చీర్లవంచ, చింతలఠాణా, కొడుముంజ, సంకెపల్లి, గుర్రంవానిపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో సుమారు 10,683 కుటుంబాలు నిర్వాసితులుగా మారాయి. ఇందులో 2,800 మంది వ్యవసాయం, 5,382 మంది కూలీలు, 1,190 మంది విద్యార్థులు, 629 మంది వృద్ధులు, మరో 682 మంది ఇతరులు ఉన్నారు. వీరు గతంలో వారి పాత గ్రామాల్లో వ్యవసాయంతోపాటు ఇతర కులవృత్తులు చేసుకుని ఉపాధి పొందేవారు. వీరంతా ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోకి చేరడంతో సరైన పనులు దొరక్క కరీంనగర్, సిరిసిల్ల ప్రాంతాల్లో అడ్డా కూలీలుగా మారారు. మహిళలు ఇతర గ్రామాలకు వ్యవసాయ కూలీలుగా తరలివెళ్తున్నారు. ఈక్రమంలో జరుగుతున్న ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు అంగవైకల్యులుగా మారారు.

సదస్సులు నిర్వహిస్తున్నాం



పునరావాస కాలనీల్లో స్కిల్ డెవలప్‌మెంట్, లైవ్లీహుడ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. కాలనీల్లో ఆసక్తి ఉన్న యువకులు, మహిళలను గుర్తించి పేర్లు నమోదు చేసుకుంటున్నాం. వారికి ఆసక్తి ఉన్న అంశంలో శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. శిక్షణ తేదీని త్వరలోనే తెలియజేస్తాం. శిక్షణ సమయంలో స్టైఫండ్ సైతం ఇస్తాం.

– నక్క శ్రీనివాస్, డీఆర్డీవో, సిరిసిల్ల

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బాలుర హైస్కూల్ మైదానంలో ఈ నెల 27న ప్రారంభమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి వాలీ బాల్ పోటీలు 28న రాత్రి ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హాజరయ్యారు. ప్రథమస్థానంలో ఉట్నూర్ జట్టు, ద్వితీయస్థానంలో కోటపల్లి మండలం సన్యాయి జట్టు, తృతీయ స్థానంలో మంచిర్యాల జట్టు నిలిచాయి. గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేల నగదును అసోసియేషన్ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్ల శంకర్, ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి


- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సీఎం పర్యటన ఏర్పాట్ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఇంద్రవెల్లి: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కేస్లాపూర్‌లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు కేస్లాపూర్‌లోని నాగోబా దర్బార్‌హాల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా నాగోబా దర్శనం, దర్బార్ హాల్‌లో సభకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గిరిజన, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో చేపట్టిన వివిధ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావ్, డీఆర్డీవో కిషన్, రెవెన్యూ డివిజన్ అధికారి జీవకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

ఉట్నూర్ చేరిన మెస్రం వంశస్తులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీపీ జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: కేస్లాపూర్ నాగోబా జాతర పురస్కరించుకొని మెస్రం వంశస్తుల పాదయాత్ర కొనసాగుతోంది. జన్నారం మండలం కలమడుగు వద్ద గోదావరిలో ఆదివారం పవిత్ర గంగాజలం సేకరించిన అనంతరం వారు తిరుగు పయనమయ్యారు. సోమవారం ఉట్నూర్ చేరుకున్నారు. కొత్తగూడ గ్రామంలో ఎంపీపీ జైవంత్‌రావు వారికి స్వాగతం పలికి అల్పాహారం అందించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉట్నూర్ నుంచి బయలుదేరారు.

కొండపాక హెచ్‌డబ్ల్యూసీకి జాతీయస్థాయి గుర్తింపు

వీణవంక(హుజూరాబాద్): వీణవంక మండలం కొండపాక హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ (ఆరోగ్య కేంద్రం)కు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఏడు విభాగాలలో వైద్య సేవలు అందిస్తున్న ఈ కేంద్రాన్ని జాతీయ నాణ్యత ప్రమాణాల (ఎన్‌క్యూఏఎస్)కేంద్ర బృందం ఇటీవల పర్యటించి పురస్కారానికి ఎంపిక చేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ డైరెక్టర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య సిబ్బంది పనితీరు, రోగులకు ఏవిధంగా చికిత్స అందిస్తున్నారు వంటి వాటిపై కేంద్ర బృందం అధ్యయనం చేసి రూపొందించారు. దీంతో జాతీయ స్థాయిలో 84.46మార్కులు సాధించి రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిలిచింది. ఇటీవలనే కేంద్రానికి పూర్తి స్థాయిలో మరమ్మతు చేయించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఇక్కడ కనిపిస్తుంది. జాతీయ స్థాయిలో ఎంపిక అవ్వడంపై సర్పంచ్ ఆవాల అరుంధతి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు ఆవాల హరిబాబు, ఉపసర్పంచ్ రామగుండం రాజ్‌కుమార్, నాయకులు కాసర్ల సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు.

ఇబ్రహీంపట్నం ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు



ఫిర్యాదు పత్రంతో లక్ష్మారెడ్డి

జగిత్యాలక్రైం: ఇబ్రహీంపట్నం ఎస్సైపై బండలింగాపూర్ గ్రామానికి చెందిన సామ లక్ష్మారెడ్డి సోమవారం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ఎస్సై ఈనెల 28న పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి తన తండ్రి పేరున ఉన్న భూమిని మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరింపులకు పాల్పడటంతో పాటు, చంపేస్తానని అక్రమ కేసు పెడతానని బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఎస్సై బెదిరిస్తున్న సమయంలో మెట్‌పల్లి వైస్ ఎంపీపీ కూడా తన వెంటే ఉన్నాడని, తాను ఎంత చెప్పినా వినకుండా నానా బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడని, అతనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



నిఖిల

'సాయం చేయాలన్న ఆలోచన ఉండగానే సరిపోదు
ఆ ఆలోచనను ఆచరణలో కూడా పెట్టాలి' అంటారు వెంగళ నిఖిల.
హైదరాబాద్ వాసి అయిన నిఖిల కిందటేడాది
మిసెస్ హైదరాబాద్, మిసెస్ తెలంగాణ,
మిసెస్ ఇండియా టైటిల్స్‌ను గెలుచుకుంది.
బ్యూటీ ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేయడమే కాదు
బ్యూటీ కాంటెస్ట్‌లలో పాల్గొనేవారిని ట్రైన్ చేస్తుంది.
ఫార్మసిస్ట్‌గా కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వర్క్ చేస్తుంది.
ఒక బిడ్డకు తల్లిగా, కుటుంబ బాధ్యతలూ నిర్వర్తిస్తుంది.
'సమయమే కాదు దానిని సద్వినియోగం చేసుకోవడం కూడా
మన చేతుల్లోనే ఉంది'
అని చెబుతున్న నిఖిల జర్నీ నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగిస్తుంది.

బ్యూటీ కాంటెస్ట్‌లో 'నువ్వు ఫిట్ కావు' అన్నారు..

''యాక్టర్స్, మోడల్స్ కే కాదు ఇటీవల జరిగిన మిస్టర్ ఇండియా కాంటెస్ట్‌కు మెంటార్‌గా ఉన్నాను. ఈ కాంటెస్ట్‌లో పాల్గొనే ఫైనల్స్‌కి 51 మంది ఎంపికయ్యారు. వారిని ట్రైన్, గ్రూమ్ చేయడానికి టీమ్‌లో నేనొక మెంబర్‌గా పనిచేశాను. యాసిడ్ బాధితులకు మద్దతుగా నిలిచే లక్ష్మీ ఫౌండేషన్ గురించి అవగాహన కలిగించడానికి చేసిన కాంటెస్ట్ అది. కంటెస్టెంట్స్ అందరినీ పక్కన పెడితే టీమ్‌లో ఉండి ఆ ఫౌండేషన్‌కు సపోర్ట్ చేయాలనే ఆలోచనతో అందరికన్నా ఎక్కువ నిధులు సమకూర్చగలిగాను. దీనికి మిసెస్ గోల్డెన్ ఆఫ్ హార్ట్ సౌత్ ఇండియా క్రౌన్ వచ్చింది.

■ కష్టమైనా .. సులువే..

ఎమ్‌ఫార్మసీ చేశాను. నా రీసెర్చ్ వర్క్‌పై చాలా ఆర్టికల్స్ కూడా పబ్లిష్ అయ్యాయి. డయాబెటిస్, ఒబేసిటీ పైన ఎక్కువ వర్క్ చేశాను. కార్పొరేట్ హాస్పిటల్స్‌కి, క్యాన్సర్ హాస్పిటల్‌కి మెడికల్ రైటర్‌గా ఉన్నాను. వృత్తినీ, కుటుంబాన్నీ బ్యాలెన్స్ చేసుకుంటూనే నా కలలనూ నెరవేర్చుకుంటున్నాను. బ్యూటీ కాంటెస్ట్‌లలో పాల్గొనడం నాకో ప్యాషన్. అందరిలాగే మా అమ్మానాన్నలు కూడా 'ఏం చేయాలనుకున్నా పెళ్లి తర్వాత నీ ఇష్టం' అన్నారు. దీంతో పెళ్లివైపే మొగ్గు చూపాను. బాబు పుట్టాక, ఇంటి పనులతో క్షణం తీరిక లేకుండా ఉండేది. కానీ కొన్ని రోజుల్లోనే నా గురించి నేను ఆలోచించుకోవడం మొదలుపెట్టాను. మావారి సపోర్ట్‌తో ఇలాంటి కాంటెస్ట్‌లో పాల్గొనడం మొదలుపెట్టాను.

■ టైమ్ ప్రకారం ప్లానింగ్..

నా పెళ్లికి ముందు యోగా, జిమ్ చేసేదాన్ని. క్లాసికల్ డ్యాన్సర్‌ని కూడా. ప్రెగ్నెన్సీ తర్వాత అన్ని యాక్టివిటీస్‌కి దూరమయ్యాను. రెండేళ్ల గ్యాప్ తర్వాత తిరిగి నన్ను నేను మార్చుకోవాలి అనే ప్రయత్నంలో చాలా ఒత్తిడికి లోనయ్యాను. టైమ్‌కి తినాలి, టైమ్ ప్రకారం వ్యాయామాలు, టైమ్‌కి నిద్ర.. అన్నీ ప్లాన్ చేసుకోవాలి. వీటితోపాటు ఇంటినీ, బాబునూ చూసుకోవాలి, అలాగే ఆఫీస్ వర్క్ కూడా చూసుకోవాలి. వీటన్నింటికీ నన్ను నేను సిద్ధం చేసుకోవడం మొదలుపెట్టాను. కష్టమనిపించినా ప్రతి రోజూ ప్రయత్నించడమే. ఒక్కరోజు కూడా నా రొటీన్ వర్క్‌ని బ్రేక్ చేయకూడదు అనుకున్నాను. మా బాబుకు ఏడాదిన్నర వయసు ఉన్నప్పటి నుంచీ మిస్ కాకుండా చూసుకోవచ్చు అనే ఆలోచనతో వాడినీ బ్యూటీ కాంటెస్ట్ దగ్గరకు తీసుకెళుతుంటాను . నా ప్యాషన్‌ని, డ్రీమ్‌ను నెరవేర్చుకోవడానికి కృషి చేస్తూనే ఉంటాను.

■ నువ్వు ఫిట్ కావు అన్నారు...

బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొనడానికి ముందు నేను అమ్మను. బ్యూటీ ఇండస్ట్రీలో ఉండాలంటే అందంగా కనిపించాలి. బాహ్య సౌందర్యమే కాదు, అంతఃసౌందర్యం కూడా బాగుండాలి. నిజానికి అప్పుడు నేనంత సిద్ధంగా లేను. బరువు, ఫేస్ గ్లో .. సమస్యలు ఉన్నాయి. దాంతో' నువ్వు ఈ బ్యూటీ కాంటెస్ట్‌కు ఫిట్ కావు' అన్నారు నన్ను చాలా మంది. కానీ, నేను అవేమీ పట్టించుకోలేదు. నన్ను నేను మోటివేట్ చేసుకున్నాను. నా జర్నీని నేను మళ్లీ మొదలుపెట్టాలి అని నన్ను నేను పూర్తిగా ట్రాన్స్‌ఫార్మ్ చేసుకున్నాను. ఫిజికల్‌గా, ఎమోషనల్‌గా ఫిట్‌గా మార్చుకున్నాను. ఈ విషయంలో మావారు తప్ప ఎవరూ నాకు సపోర్ట్ చేయలేదు. నేనూ అవేమీ పట్టించుకోలేదు.

'మానసికంగా నేను స్ట్రాంగ్‌గా ఉన్నాను' అనే ఆలోచనతో టైటిల్స్ సాధించాను. దీంతో నా చుట్టూ ఉన్న అందరిలోనూ ఒక మంచి గుర్తింపు లభించింది. అదే నన్ను మంచి పొజిషన్‌కి తీసుకు వచ్చింది.

■ యాసిడ్ దాడి బాధితులకు..

కొన్నేళ్ల క్రితం రాష్ట్రంలో ఇద్దరు అమ్మాయిలపై యాసిడ్ దాడి జరిగింది. ఆ కాలేజీకి, మా కాలేజీ దగ్గర. ఆ ఇన్సిడెంట్ నేను చూశాను. చాలా బాధనిపించింది. ఇప్పుడు యాసిడ్ దాడి బాధితులకు సాయం చేసే అవకాశం వచ్చింది. వదులుకోవద్దు అనుకున్నాను. ఏదీ నేను ఆశించలేదు. ఒక మంచి పని కోసం కృషి చేస్తున్నాం. ఎంత వచ్చినా అవసరమైన వారికి చేరుతుంది అనే ఆలోచనతోనే పని చేశాను.

■ అవగాహన కలిగిస్తూ...

చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్ల కోసం ఒక బ్యూటీ కాంటెస్ట్ ఏర్పాటు చేశాం. అప్పుడు మంచి స్పందన వచ్చింది. చిన్నారుల ఆపరేషన్లకు ఆ డబ్బును డొనేట్ చేశాం. ఇప్పుడు కూడా ఇలాగే ఈ బ్యూటీ కాంటెస్ట్‌ను ఏర్పాటు చేశాం. ఎవరినీ ఒత్తిడి చేయం. మా బంధుమిత్రులకు, తెలిసినవారికి మా ఆలోచనను తెలియజేశాం. ఈ కాంటెస్ట్ ద్వారా చర్మదానం పట్ల ఒక అవగాహన కల్పించాం. మంచి గుర్తింపు లభించింది. ఇక ముందు కూడా లక్ష్మీ ఫౌండేషన్‌కి జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయి కాంటెస్ట్‌లు చేయాలని, వాటిలో పాల్గొని యాసిడ్ దాడి బాధితులకు ఆసరాగా ఉండాలనుకుంటున్నాను'' అని చెప్పారు నిఖిల వెంగళ.

– నిర్మలారెడ్డి

ఆర్మీలో మొదటిసారి ఒక మహిళ 'సుబేదార్' ర్యాంక్‌కు ప్రమోట్ అయ్యింది.
రెండేళ్ల క్రితం ఆర్మీలో హవల్దార్‌గా చేరిన ప్రీతి రజక్ తన క్రీడాప్రావీణ్యంతో
ఆసియన్ గేమ్స్‌లో ట్రాప్ షూటర్‌గా సిల్వర్ మెడల్ సాధించింది.
దేశవ్యాప్తంగా యువతులను ఆర్మీలో చేరేలా ఆమె స్ఫూర్తినిచ్చిందని
ఆమెకు ఈ గౌరవం కల్పించారు.

న్యూస్‌మేకర్



ప్రీతి రజక్

సుబేదార్ ప్రీతి

మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రీతి రజక్ ఆర్మీలో 'సుబేదార్' ర్యాంక్‌కు ప్రమోట్ అయ్యింది. ఆర్మీలో 'సుబేదార్' అనిపించుకోవడం చిన్న విషయం కాదు. 'సిపాయి' నుంచి మొదలయ్యి 'లాన్స్ నాయక్', 'నాయక్', 'హవల్దార్', 'నాయబ్ సుబేదార్'... ఇన్ని దశలు దాటి 'సుబేదార్' అవుతారు. ఆర్మీలో మహిళల రిక్రూట్‌మెంట్ 1992లో మొదలయ్యాక సంప్రదాయ అంచెలలో ఒక మహిళ సుబేదార్‌గా పదవి పొందటం ఇదే మొదటి సారి. ఆ మేరకు ప్రీతి రజక్ రికార్డును నమోదు చేసింది. ట్రాప్ షూటర్‌గా ఆసియన్ గేమ్స్‌లో ఆమె చూపిన ప్రతిభను గుర్తించిన ఉన్నత అధికారులు ఆమెను ఈ విధంగా ప్రోత్సహించి గౌరవించారు.

■ లాండ్రీ ఓనరు కూతురు

ఇరవై రెండేళ్ల ప్రీతి రజక్‌ది మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ సమీపంలో ఉన్న నర్మదాపురం. దిగువ మధ్యతరగతి కుటుంబం. తండ్రి లాండ్రీషాపు నడుపుతాడు. తల్లి సామాజిక సేవలో ఉంది. ముగ్గురు అక్కచెల్లెళ్లలో రెండవ సంతానమైన ప్రీతి చిన్నప్పటి నుంచీ ఆటల్లో చురుగ్గా ఉండేది. క్రీడలంటే ఆసక్తి ఉన్న తండ్రి తన కూతుళ్లను శక్తిమేరకు క్రీడాకారులు చేయదలిచి ప్రోత్సహించాడు. అలా ప్రీతి షూటింగ్‌లోకి వచ్చింది. భోపాల్‌లోని స్పోర్ట్స్ అకాడెమీలో శిక్షణ పొందుతున్న సమయంలోనే ప్రీతి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపింది. పతకాలు సాధించింది. దాంతో ఆర్మీలో స్పోర్ట్స్ కోటాలో మిలటరీ పోలీస్ డివిజన్‌లో నేరుగా 2022లో హవల్దార్ ఉద్యోగం వచ్చింది.



■ ఏ సాహసానికైనా సిద్ధమే

ఆర్మీలో చేరినప్పటి నుంచి ప్రీతి ఏ సాహసానికైనా సిద్ధమే అన్నట్టుగా పనిచేస్తూ పై అధికారుల మెప్పు పొందింది ప్రీతి. షూటింగ్‌ను ప్రాక్టీస్ చేయాలంటే ఖర్చుతో కూడిన పని. కాని ఆర్మీలో చేరాక ఆమెకు శిక్షణ మరింత సులువైంది. అందుకు కావలసిన గన్స్ ఆమెకు మరిన్ని అందుబాటులోకి వచ్చాయి. ఇక చైనాలో జరిగిన 2023 ఆసియన్ గేమ్స్‌లో షార్ట్ పిస్టల్ విభాగంలో ప్రీతి రజత పతకం సాధించడంతో ఆర్మీ గౌరవంతో పాటు దేశ గౌరవమూ ఇనుమడించింది. 'నేటి యువతులు ఇళ్లల్లో కూచుని ప్రతిభను వృథా చేయొద్దు. ఇంటినుంచి బయటకు రండి' అని ప్రీతి ఈ సందర్భంగా పిలుపునిచ్చింది. దాంతో చాలామంది అమ్మాయిలు ఆర్మీలో చేరడానికి ఉత్సాహం చూపారు. ఇదిపై అధికారులకు మరింతగా సంతోషం కలిగించడంతో జనవరి 28, 2024న ఆమెకు సుబేదార్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

■ పారిస్ ఒలింపిక్స్‌కు

ఈ సంవత్సరం జూలైలో పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో ఎలాగైనా పతకం తేవడానికి ప్రీతికి ఆర్మీ వారే శిక్షణ ఇస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని మహౌలోని 'ఆర్మీ మార్క్స్‌మెన్‌షిప్ యూనిట్' (ఏ.ఎం.యు.)లో ప్రీతికి ప్రస్తుతం శిక్షణ కొనసాగుతూ ఉంది. జాతీయ స్థాయిలో మహిళా ట్రాప్ షూటింగ్‌లో విభాగంలో ఆరవ ర్యాంక్‌లో ఉంది ప్రీతి. ఆమె గనక ఒలింపిక్ మెడల్ సాధిస్తే ఆర్మీలో ఆమెకు దొరకబోయే ప్రమోషన్ మరింత ఘనంగా గర్వపడే విధంగా ఉంటుంది.



సాగుబడి
శ్రవణ కార్తె: ఫిబ్రవరి 5 వరకు



బియ్యం, గోధుమల్లో బలం సగమే!

- గత ఏభయ్యేళ్లలో 45% మేరకు పోషకాలు కోల్పోయిన వరి, గోధుమలు.. 2040 నాటికి పూర్తిగా తగ్గే ప్రమాదం..
- అధిక దిగుబడినిచ్చే వరి, గోధుమ వంగడాల్లో దశాబ్దానికి ఒకటి, రెండు ప్రాచుర్యం పొందిన రకాలపై ఐసిఏఆర్, ఐసిఎంఆర్ సంయుక్త అధ్యయనం
- సాంబ మసూరి, స్వర్ణ సబ్ 1 తదితర 16 రకాల వరి, 18 రకాల గోధుమ అధిక దిగుబడి వంగడాలపై అధ్యయనం
- భారఖనిజాల శాతం పెరగటంతో ప్రజారోగ్యానికి ముప్పు
- బయోఫోర్టిఫైడ్ వంగడాలు మేలంటున్న శాస్త్రవేత్తలు

తిండికి కటకటలాడుతూ ఓడలో ధాన్యం వస్తేనే దేశం ఆకలి తీరే పరిస్థితుల్లో హరిత విప్లవ సాంకేతికత (జిఆర్‌టి)ల అమలు మన దేశంలో 1960వ దశకంలో ప్రారంభమైంది. అధిక దిగుబడినిచ్చే వరి/గోధుమ ఆధునిక వంగడాలు తయారుచేసుకొని వాడుతున్నాం.. నీటి పారుదల, రసాయనిక ఎరువులు, పురుగుమందులతో పంటలు పండిస్తున్నాం.. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు తెల్ల బియ్యం, గోధుమలు అందిస్తున్నది. ఏభయ్యేళ్లు గడచిపోయాక.. వెనక్కి చూస్తే జనం కడుపు నిండుతోంది. కానీ, పోషకలోపం వెంటాడుతోంది. ముందెన్నడూ లేనట్లుగా రోగాలు ముసురుకుంటున్నాయి. దీనికి మూలకారణం ఏమిటో ఓ తాజా అధ్యయనం విడమర్చి చెబుతోంది.

సాగు భూమిలో పోషకాలు తగ్గిపోయాయి కాబట్టి ఆహారంలో పోషకాలు తగ్గిపోతున్నాయని ఇన్నాళ్లూ అనుకున్నాం. అయితే, వరి, గోధుమ మొక్కలకు నేలలో ఉన్న పోషకాలను తీసుకునే శక్తి కూడా తగ్గిపోయిందని ఇప్పుడు రూఢి అయ్యింది.
ఇంతకన్నా ఆందోళన కలిగించే మరో విషయాన్ని కూడా ఈ అధ్యయనం తేటతెల్లం చేసింది. నేలలో భార ఖనిజాలు వంటి విషతుల్య పదార్థాలను కంకుల్లోని ధాన్యాలకు చేరకుండా ఆపి వేసే సహజసిద్ధమైన విచక్షణా జ్ఞానం మొక్కలకు ఉంటుంది. అయితే, అధిక దిగుబడుల కోసం తయారు చేసిన ఆధునిక వరి, గోధుమ విత్తనాల బ్రీడింగ్ ప్రక్రియల్లో గత ఏభయ్యేళ్లలో చేసిన కీలక మార్పుల వల్ల ఈ పంటల్లో ఆ తెలివి లోపించింది. అందువల్లే ఇప్పుడు వరి బియ్యం, గోధుమల్లోకి ప్రాణాంతక భార ఖనిజాలు అధిక పాళ్లలో చేరుతున్నాయి. వీటిని తిన్న మనుషులకు పోషకాలు లోపించటం వల్ల మాత్రమే కాదు, భార ఖనిజాల వల్ల కూడా రకరకాల జబ్బులొస్తున్నాయని తేలింది. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, భారతీయ వైద్య పరిశోధనా మండలి సమన్వయంతో అత్యంత కీలకమైన ఈ అధ్యయనం చేయటం విశేషం. గత నవంబర్‌లో 'నేచర్' లో ఈ అధ్యయన పత్రం అచ్చయ్యింది.

■ ప్రసిద్ధ వంగడాలపైనే అధ్యయనం

వరి, గోధుమల్లో పోషకాల స్థాయిని తెలుసుకునేందుకు ఐసిఎఆర్, ఐసిఎంఆర్ పరిశోధన సంస్థల్లో పనిచేస్తున్న నేలల నిపుణుడు డా. సోవన్ దేబనాథ్, మరో 11 మంది శాస్త్రవేత్తలతో కలసి విస్తృత పరిశోధనలు చేశారు. డా. సోవన్ ఉత్తరప్రదేశ్ ఝాన్సీలోని ఐసిఎఆర్– సెంట్రల్ ఆగ్రోఫారెస్ట్రీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో సాయిల్ సైన్స్ సీనియర్ శాస్త్రవేత్త. పశ్చిమబెంగాల్‌లోని ఐసిఎఆర్– బిధాన్ చంద్ర కృషి విశ్వవిద్యాలయ, హైదరాబాద్‌లోని ఐసిఎంఆర్– నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌కు చెందిన మరో 11 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

1960వ దశకం నుంచి ఐసిఎఆర్ శాస్త్రవేత్తలు 1,199 వరి, 448 గోధుమ, 417 మొక్కజొన్న, 223 జొన్న అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. వీటిల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన (50 లక్షల హెక్టార్ల కన్నా ఎక్కువగా సాగైన) వంగడాల్లో నుంచి ఒక్కో దశాబ్దానికి 2–4 రకాలను ఎంపిక చేసి ప్రత్యేకంగా పండించి మరీ అధ్యయనం చేశారు.

■ జయ నుంచి స్వర్ణ సబ్ 1 వరకు..

ఈ విధంగా ఎంపికచేసిన 16 వరి, 18 గోధుమ రకాలను 2018–2020 మధ్యకాలంలో మూడేళ్ల పాటు సాగు చేశారు. ఎంపికైన వరి రకాల్లో 1960ల నాటి జయ, పంకజ్, 1970ల నాటి ఐఆర్8, స్వర్ణ, రాశి, 1980ల నాటి ఐఆర్ 36, క్షితిశ్, సాంబ మసూరి, లలత్, 1990ల నాటి ఐఆర్ 64, ఖండగిరి, రంజిత్, త్రిగుణ, 2000ల నాటి నవీన్, ప్రతిక్ష్య, స్వర్ణ సబ్ 1 వున్నాయి. గోధుమ రకాల్లో 1960ల నాటి సొనాలిక నుంచి 2010లలో విడుదలైన హెచ్‌డి–3059 రకాలను ఎంపిక చేశారు. 2009లో విడుదలైన స్వర్ణ సబ్ 1 తర్వాత 5 లక్షల హెక్టార్లకు పైగా సాగైన లాండ్ మార్క్ వరి వంగడాలు లేకపోవటం వల్ల 2010లలో విడుదలైన ఏ వరి వంగడాన్నీ అధ్యయనం చేయలేదని డా. సోవన్ తెలిపారు. వరి విత్తనాలను కటక్‌లోని ఎన్ఆర్ఆర్ఐ నుంచి, గోధుమ విత్తనాలను కర్నల్‌లోని ఐఐడబ్ల్యుబిఆర్‌ల నుంచి సేకరించారు. వీటన్నిటినీ ఒకే రకమైన మట్టి మిశ్రమంతో కూడిన ప్రత్యేక కుండీల్లో సాగు చేశారు. అలా పండించిన తెల్ల బియ్యం, గోధుమ పిండిలో పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో సరిపోల్చి విశ్లేషించటం ఈ అధ్యయనం లక్ష్యం.

భార ఖనిజాలు ఎలా..?

అధిక దిగుబడినిచ్చే వంగడాలతో పండించిన వరి, గోధుమల్లో గత 50 ఏళ్లలో క్రమంగా పోషకాలు 45% తగ్గిపోవటంతో పాటు వాటిల్లో అనేక భార ఖనిజాలు వంటి విషతుల్య పదార్థాల శాతం భారీగా పెరిగినట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. బియ్యంలో ఆర్సెనిక్ (పాషాణం) వంటి భార ఖనిజం ఏకంగా 1.493 శాతం ఎలా పెరిగాయి? 'మనం అధిక దిగుబడి సాధించాం. అయితే, నాణ్యతను పొగొట్టుకున్నాం' అన్నారు కటక్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రుబీనా ఖానమ్. హానికరమైన భార ఖనిజాలను గుర్తించి వాటిని తీసుకోకుండా జాగ్రత్తపడే ప్రజ్ఞ వరి మొక్కకు సహజంగా ఉంటుంది. హానిచేసే ఆర్సెనిక్ వంటి విషపదార్థం మట్టిలో ఉన్నప్పటికీ దాన్ని గుర్తించి, ఆ పదార్థాన్ని మొక్క శిఖర భాగంలోని ధాన్యానికి చేరవేసే రవాణా యంత్రాంగం స్విచ్ఛాఫ్ అయిపోతుంది. ఇది వరి మొక్కల సహజ లక్షణం. అయితే, విషతుల్యమైన పదార్థాలను వేర్ల ద్వారా గ్రహించకుండా ఉండే సహజ రక్షక యంత్రాంగాలను అధిక దిగుబడి వంగడాలు కోల్పోయాయి. అందువల్లనే మంచి ఖనిజాలతో పాటు విషతుల్యమైన భార ఖనిజాలు కూడా ఆధునిక వంగడాలతో పండించే ధాన్యంలోకి ఇవి యథేచ్ఛగా చేరుతున్నాయన్నారు ఖానమ్. ఈ సమస్యను అధిగమించడానికి అడవుల్లో పెరిగే ధాన్యాలను కొత్త వంగడాల బ్రీడింగ్‌కు వాడుతున్నామని కటక్‌లోని జాతీయ వరి పరిశోధనా సంస్థ పంట అభివృద్ధి విభాగం అధిపతి డాక్టర్ సంఘమిత్ర సమంతరే చెబుతున్నారు.



డా. సంఘమిత్ర సమంతరే



డా. రుబీనా ఖానమ్

■ 45% తగ్గిపోయిన పోషకాలు

మన దేశంలో ప్రజలు రోజువారీ ప్రధాన ఆహారంగా తినే వరి బియ్యం లేదా గోధుమల ద్వారానే రోజుకు అవసరమైన శక్తిలో 50%కి పైగా సమకూరుతుంది. ఈ రెండు ధాన్యాలు గత 50 ఏళ్లలో 45% పోషక విలువలను కోల్పోయినట్లు ఈ అధ్యయనంలో తేలింది. ఉదాహరణకు.. గత 50 ఏళ్లలో, వరి బియ్యంలో అత్యవసరమైన పోషకాలైన జింక్ 33%, ఇనుము 27% తగ్గిపోయాయి. గోధుమలో జింక్ 30%, ఇనుము 19% తగ్గిపోయాయి. ఈ సమస్యను ఇప్పటికైనా సరిచేయకపోతే 2040 నాటికి వరి బియ్యం, గోధుమలు తినటానికి పనికిరానంతగా పోషకాలన్నిటినీ కోల్పోతాయని డా. సోవన్ ఆందోళన వ్యక్తం చేశారు. పోషకాలు బాగా తగ్గిపోవటంతో పాటు మరింత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. ఈ ధాన్యాల్లో విషతుల్య పదార్థాలు చాలా పెద్ద ఎత్తున పోగుపడటం. ఆర్సెనిక్ (పాషాణం) ఏకంగా 1,493 శాతం మేరకు పెరిగిపోయింది.



డా. సోవన్ దేబ్‌నాథ్

■ భార ఖనిజాలతో జబ్బులు

ఈ అధ్యయనం మనకు తెలియజెప్తున్నదేమిటంటే.. రోజువారీగా ప్రధాన ఆహారంగా మనం తింటున్న తెల్ల అన్నం, గోధుమ రొట్టెల్లో పోషకాలు సగానికి తగ్గటంతో పాటు ఆరోగ్యానికి హాని చేసే భార ఖనిజాలు మెండుగా చేరాయన్న మాట. షుగర్, బీపీ, గుండె జబ్బులు, ఊబకాయం, కేన్సర్ వంటి అసాంక్రమిక వ్యాధులు పెచ్చుమీరిపోవడానికి వరి, గోధుమల్లో పోషకాలు లోపించటంతో పాటు భార ఖనిజాలు కూడా కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు.

ఫాస్ఫరస్, కాల్షియం, సిలికాన్, వనాడియం వంటి పోషకాలు ఎముకల అభివృద్ధికి దోహదం చేస్తాయి. రోగనిరోధక శక్తి, పునరుత్పాదక శక్తికి, నరాల బలానికి జింక్ కీలకం. రక్తవృద్ధికి ఇనుము చాలా ముఖ్యం. రోజూ ఎక్కువ మొత్తంలో తినే ఆహారంలో ఈ పోషకాలు లోపిస్తే నరాల బలహీనత, సంతానలేమి, కండరాలు, ఎముకల క్షీణతకు దారితీస్తుందని నేచర్ పత్రికలో ప్రచురితమైన వ్యాసాల్లో నిపుణులు చెబుతున్నారు.

ఆర్సెనిక్, క్రోమియం, బేరియం, స్ట్రాంటియమ్ వంటి విషతుల్య భార ఖనిజాలు ఊపిరితిత్తుల కేన్సర్లు లేదా తీవ్ర శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, హైపర్‌కెరటోసిస్, కిడ్నీల సమస్యలు, ఎముకల్లో కాల్షియం లోపించటం వంటి జబ్బులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. పూర్వం మాదిరిగా జొన్న తదితర చిరుధాన్యాలు తినటం తగ్గిపోవటం, వరి, గోధుమల వినియోగం బాగా పెరిగిపోవటం వల్ల ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందన్నది శాస్త్రవేత్తల అభిప్రాయం. 1990–2016 మధ్యకాలంలో అసాంక్రమిక వ్యాధులు 25% పెరిగిపోయాయని భారతీయ వైద్య పరిశోధనా మండలి(ఐసిఎంఆర్) నివేదికలు చెబుతున్నాయి.

50 ఏళ్లలో వరి (తెల్ల) బియ్యం, గోధుమల్లో పోషకాల్లో హెచ్చుతగ్గులు (%)

ఖనిజం	వరి బియ్యం (1960-2000)	గోధుమలు (1960-2010)
అత్యవసర పోషకాలు:		
ఫాస్ఫరస్	-20	-13
కాల్షియం	-45	-30
సల్ఫర్	+38	+236
ఇనుము	-28	-19
జింక్	-33	-30
రాగి	-33	-35
మాంగనీసు	+51	+23
ప్రయోజనకరమైనవి:		
సిలికాన్	-42	-45
నికెల్	-68	-34
లిథియమ్	+56	-77
వనడియమ్	+2,600	-74
ప్రమాదకరమైనవి:		
బేరియం	+145	+108
స్ట్రాంటియం	+102	+57
క్రోమియం	+336	-26
లెడ్	-26	-73
ఆర్సెనిక్	+1500	-53
అల్యూమినియం	+78	+37

మూలం: ఐసిఏఆర్, ఐసిఎంఆర్ శాస్త్రవేత్తల తాజా అధ్యయనం

పోషక లోపం ఎలా..?

సాధారణంగా పంట మొక్కలు 14 పోషకాలను నేల నుంచి వేర్ల ద్వారా, మరో 3 పోషకాలను వాతావరణం నుంచి పంట మొక్కలు గ్రహిస్తాయని ఎఫ్.ఎ.ఓ. చెబుతోంది. పంట మొక్కలు అంతకు ముందుకన్నా తక్కువ ఎత్తు పెరిగేలా చేసి, ఆ క్రమంలో మిగిలే పోషకాలను.. అధికంగా ధాన్యం ఉత్పత్తికి ఉపయోగపడేలా శాస్త్రవేత్తలు మేలైన వరి, గోధుమలతోపాటు జొన్న తదితర పంటల మేలైన వంగడాలను అభివృద్ధి చేస్తుంటారు. ఈ విధంగానే మన దేశంలో కేవలం పదేళ్లలో వరి, గోధుమల ఉత్పత్తి 21% పెరిగింది. అయితే, ఈ వంగడాలు రూపొందించే క్రమంలో కొత్త వంగడాల్లో పోషకాల సాంద్రత, పొందిక ఎలా ఉందన్న అంశంపై దృష్టి కేంద్రీకరించ లేదు. 'అధిక దిగుబడినివ్వటంతో పాటు.. అన్ని రకాల పోషకాలను గ్రహించే జన్యు లక్షణాలు ఈ కొత్త వంగడాల్లో ఉంటున్నాయా లేదా అన్న దానిపై పరిశీలన లోపించింది. ఫలితంగా వరి బియ్యం, గోధుమల్లో ఆహార విలువ (ఫుడ్ వాల్యూ) తగ్గిపోయింది. ముఖ్యంగా మొత్తంగా ఖనిజాల వాటా (ఐనోమ్) తగ్గిపోయింది' అని బిధాన్ చంద్ర కృషి విశ్వవిద్యాలయానికి చెందిన సాయిల్ సైంటిస్ట్, ఈ అధ్యయనం సహ రచయిత డాక్టర్ బిస్వపతి మండల్ వివరించారు. 1980వ దశకం వరకు అధిక దిగుబడి ఒక్కటే బ్రీడింగ్ లక్ష్యంగా సాగింది. ఆ దశలో అధిక దిగుబడితో పాటు చీడపీడలను తట్టుకునే వంగడాలను, చౌడును, నీటి ఎద్దడిని తట్టుకునే వంగడాలపై బ్రీడర్లు దృష్టి సారించారు. ధాన్యాల్లో పోషకాలను పెంపొందించే అంశంపై దృష్టి కేంద్రీకరించే వెసులుబాటు అప్పుడు కూడా లేకపోయిందని డా. మండల్ 'డౌన్ టు ఎర్త్'తో చెప్పారు.

బయోఫోర్టిఫైడ్ వంగడాలతో సమస్య తీరేనా?

ధాన్యాల్లో పోషకాల లేమిని అధిగమించేందుకు ఐరన్, జింక్ వంటి పోషకాలు అధికంగా ఉండే బయోఫోర్టిఫైడ్ వంగడాలను రూపొందించటంపై ఐసిఏఆర్ పదేళ్ల క్రితం నుంచే పని ప్రారంభించింది. ఇప్పటికి 142 బయోఫోర్టిఫైడ్ వంగడాలను రూపొందించింది. ఇందులో 124 ధాన్యపు పంటలు. వీటిలో 10 వరి, 43 గోధుమ, 20 మొక్కజొన్న, 13 రకాల కొర్ర వంటి చిన్న చిరుధాన్యాలు, 11 సజ్జ రకాలు ఉన్నాయి. వీటి ద్వారా పోషకాల లోపాన్ని కొంత మేరకు అధిగమించవచ్చన్నది శాస్త్రవేత్తల మాట. దేశవ్యాప్తంగా 6% సాగు భూమిలో ఈ వంగడాలు సాగవుతున్నాయని ప్రభుత్వం చెబుతోంది.



డా. బిస్వపతి మండల్

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



రన్నరప్ అనిరుధ్ జోడీ

ఫ్రాన్స్‌లో జరిగిన క్వింపెర్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్లో అనిరుధ్–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ 6–7 (4/7), 3–6తో గినార్డ్–రిండెర్‌నెచ్ (ఫ్రాన్స్) ద్వయం చేతిలో ఓడిపోయింది. గతవారం ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో అనిరుధ్–విజయ్ జంట 'వైల్డ్ కార్డు'తో మెయిన్ 'డ్రా'లో పోటీపడి తొలి రౌండ్‌లో నిష్క్రమించింది.



సోనమ్ మస్కర్‌కు రజత పతకం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ఐదో పతకం లభించింది. కైరోలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో సోనమ్ మస్కర్ రజత పతకం సాధించింది. మహారాష్ట్రకు చెందిన 21 ఏళ్ల సోనమ్‌కు ఇదే తొలి ప్రపంచకప్ టోర్నీ కావడం విశేషం. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో సోనమ్ 252.1 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అనా జాన్సెన్ (జర్మనీ: 253 పాయింట్లు) స్వర్ణం, అనెటా స్టాన్‌కివిజ్ (పోలాండ్: 230.4 పాయింట్లు) కాంస్యం గెలిచారు.

నంబర్‌వన్ బోపన్న



- ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి 'టాప్' ర్యాంక్‌లో భారత టెన్నిస్ స్టార్
- ఈ ఘనత సాధించిన అతిపెద్ద వయస్కుడిగా ప్రపంచ రికార్డు

లండన్: సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 21 ఏళ్ల తర్వాత మళ్లీ భారత ప్లేయర్ నంబర్‌వన్ ర్యాంక్‌ను అధిరోహించాడు. సోమవారం విడుదల చేసిన అధికారిక తాజా ర్యాంకింగ్స్‌లో రోహన్ బోపన్న రెండు స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లో తొలిసారి టాప్ ర్యాంక్‌లో నిలిచి చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. టెన్నిస్ చరిత్రలోనే నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న అతిపెద్ద వయస్కుడిగా బోపన్న (43 ఏళ్ల 330 రోజులు) ప్రపంచ రికార్డు సృష్టించాడు. అమెరికా దిగ్గజం మైక్ బ్రయాన్ (41 ఏళ్ల 76 రోజులు; 2019లో) పేరిట ఉన్న రికార్డును అతను బద్దలు కొట్టాడు. గత శనివారం ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో బోపన్న ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి పురుషుల డబుల్స్ విభాగంలో టైటిల్ నెగ్గి తన కెరీర్‌లో పురుషుల డబుల్స్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో బోపన్న, ఎబ్డెన్ 8,450 పాయింట్లతో సమంగా ఉన్నప్పటికీ తక్కువ టోర్నీలు ఆడినందుకు బోపన్నకు టాప్ ర్యాంక్ ఖరారు కాగా, ఎబ్డెన్ రెండో ర్యాంక్‌లో నిలిచాడు. చివరిసారి భారత్ నుంచి లియాండర్ పేస్ 2000 మార్చి 13న ... మహేశ్ భూపతి 1999 జూన్ 14న ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచారు. బెంగళూరుకు చెందిన బోపన్న 2003లో ప్రొఫెషనల్‌గా మారాడు. తన 21 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో బోపన్న ఇప్పటిదాకా పురుషుల డబుల్స్‌లో 19 మంది వేర్వేరు భాగస్వాములతో ఆడి 25 టైటిల్స్ సాధించడంతోపాటు 504 మ్యాచ్‌ల్లో గెలుపొందాడు. 2016లో బెంగళూరులో తన పేరిట టెన్నిస్ అకాడమీని స్థాపించి కుర్రాళ్లకు శిక్షణ ఇస్తున్నాడు.



భారత్‌కు సంకటం!

గాయాలతో రెండో టెస్టుకు దూరమైన కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా

టీమిండియాలోకి సర్ఫరాజ్, సౌరభ్ కుమార్, వాషింగ్టన్ సుందర్


సర్ఫరాజ్


సౌరభ్

హైదరాబాద్: సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో ఎదురైన పరాజయం నుంచి కోలుకోకముందే... భారత్‌కు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. తాజాగా సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, బ్యాటర్ కేఎల్ రాహుల్ గాయాలతో రెండో టెస్టుకు దూరమయ్యారు. ఇప్పటికే తొలి రెండు టెస్టుల నుంచి సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్నాడు. తాజాగా కీలకమైన ఇద్దరు ఆటగాళ్లు కూడా రెండో టెస్టుకు దూరమవడం జట్టుకు ప్రతికూలంగా పరిణమించనుంది. అయితే దేశవాళీ క్రికెట్లో నిలకడగా రాణిస్తున్న, ఐపీఎల్‌లో అడపాదడపా మెరిపిస్తున్న ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు ఎట్టకేలకు టీమిండియాలో చోటు దక్కింది. రెండో టెస్టు కోసం కొత్తగా సర్ఫరాజ్ ఖాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లెఫ్టార్మ్ స్పిన్ ఆల్‌రౌండర్ సౌరభ్ కుమార్‌లను తీసుకోగా... తమిళనాడు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను కూడా ఈ మ్యాచ్ కోసం ఎంపిక చేశారు. ఆదివారం నాలుగోరోజు ఆటలో పరుగు తీసే ప్రయత్నంలో జడేజా తొడ కండరాలు పట్టేయడంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. ఈ మ్యాచ్‌లో కేవలం పూర్తిస్థాయిలో బ్యాటింగ్ పాత్ర పోషించిన కేఎల్ రాహుల్ కుడి తొడ కండరాల గాయంతో బాధపడుతున్నాడు. గత ఐపీఎల్‌లో కూడా రాహుల్ ఇదే విధమైన గాయంతో నాలుగు నెలలు ఆటకు దూరమయ్యాడు. 'గాయపడిన జడేజా, రాహుల్ ఇద్దరు వచ్చే నెల 2 నుంచి విశాఖపట్నంలో జరిగే రెండో టెస్టులో పాల్గొనడం లేదు. బోర్డు మెడికల్ టీమ్ ఇద్దరి పరిస్థితిని సమీక్షిస్తోంది' అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

సర్ఫరాజ్ గుర్తున్న క్రికెటరే కానీ..!

ముంబై క్రికెటర్ సర్ఫరాజ్ భారత సీనియర్ జట్టుకు కొత్త ముఖమై ఉండొచ్చు కానీ... క్రికెట్ అభిమానులకు తెలియని పేరేమీ కాదు. ఎందుకంటే ఐపీఎల్‌లో కోహ్లి సారథ్యంలోని రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరఫున మెరిపించాడు. అతని మెరుపులకు ఒకానొక సందర్భంలో ఫిదా అయిన కోహ్లి... సర్ఫరాజ్ అవుటై పెవిలియన్‌కు చేరుతుంటే రెండు చేతులు జోడించి మరీ జేజేలు పలికాడు. సర్ఫరాజ్ రెండు ఐసీసీ అండర్–19 ప్రపంచకప్ (2014, 2016)లలో ఆడాడు. భారత్ 'ఎ' జట్టు తరఫున బరిలోకి దిగాడు. రంజీల్లోనూ నిలకడగా పరుగులు సాధిస్తున్నాడు. అయితే ఇదంతా కూడా అతని ఆటతీరుకు నిదర్శనమైతే... నోటిదురుసుతో సెలక్షన్ కమిటీ పరిశీలనకు అతని పేరు అదేపనిగా దూరమైంది. గత పదేళ్లుగా దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్న 30 ఏళ్ల సౌరభ్ ఇప్పటి వరకు 68 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 2061 పరుగులు సాధించడంతోపాటు 290 వికెట్లు పడగొట్టాడు.

బుమ్రాకు మందలింపు



దుబాయ్: భారత స్టార్ బౌలర్ బుమ్రాకు ఒక డీ మెరిట్ పాయింట్ శిక్షగా విధించారు. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ ఆడుతుండగా ఒలీ పోప్ పరుగు తీస్తుంటే... పేసర్ బుమ్రా ఉద్దేశపూర్వకంగా అడ్డు తగిలాడు. దీన్ని పరిశీలించిన మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ అతను ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు తేల్చారు. అయితే గత 24 నెలల కాలంలో ఇది బుమ్రా చేసిన తొలి తప్పిదం కావడంతో మందలించి ఒక డి మెరిట్ పాయింట్‌ను శిక్షగా విధించారు. బుమ్రా తన తప్పును అంగీకరించడంతో తదుపరి విచారణ అవసరం లేదని రిఫరీ నిర్ణయించారు.

ఆంధ్ర ఘనవిజయం

రాణించిన ప్రశాంత్, నితీశ్ కుమార్


ప్రశాంత్

రాయ్‌పూర్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ జట్టుతో సోమవారం ముగిసిన ఎలైట్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో రికీ భుయ్ కెప్టెన్సీలోని ఆంధ్ర జట్టు 126 పరుగుల తేడాతో గెలిచింది. ఆట చివరిరోజు ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌ను ఓవర్‌నైట్ స్కోరు 150/2 వద్దే డిక్లేర్ చేసి ఛత్తీస్‌గఢ్‌కు 320 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టు 59.4 ఓవర్లలో 193 పరుగులవద్ద ఆలౌటై ఓడిపోయింది. ఆంధ్ర జట్టు ఓపెనర్ ప్రశాంత్ కుమార్ (3/21) బంతితోనూ మెరిశాడు. ప్రశాంత్‌కు నితీశ్ కుమార్ రెడ్డి (3/36), పృథ్వీరాజ్ (2/40) సహకరించడంతో ఆంధ్ర జట్టుకు గెలుపు దక్కింది. 36 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ఛత్తీస్‌గఢ్ జట్టును ఏక్‌నాథ్ కేర్కర్ (76; 8 ఫోర్లు), కెప్టెన్ అమన్‌దీప్ ఖరే (67; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆదుకున్నారు. వీరిద్దరు అర్ధ సెంచరీలు చేసి నాలుగో వికెట్‌కు 94 పరుగులు జోడించారు. క్రీజులో కుదురుకున్న ఈ జోడీని ప్రశాంత్ విడగొట్టాడు. అమన్‌దీప్‌ను ప్రశాంత్ బౌల్డ్ చేయడంతో ఛత్తీస్‌గఢ్ మళ్లీ కష్టాల్లో పడింది. ఏక్‌నాథ్‌ను కూడా ప్రశాంతే అవుట్ చేయడంతో ఆంధ్ర విజయం దిశగా సాగింది. ఎనిమిది జట్లున్న గ్రూప్ 'బి'లో నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర 15 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఫిబ్రవరి 2 నుంచి జరిగే తమ ఐదో లీగ్ మ్యాచ్‌లో బిహార్‌తో ఆంధ్ర తలపడుతుంది. బెంగాల్‌తో తొలి మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న ఆంధ్ర... రెండో మ్యాచ్‌లో ముంబై చేతిలో పది వికెట్ల తేడాతో ఓడిపోయి, మూడో మ్యాచ్‌లో అస్సాంపై పది వికెట్ల తేడాతో నెగ్గింది.

క్వార్టర్ ఫైనల్లో భారత్


మణీందర్

మస్కట్: పురుషుల హాకీ 'ఫైవ్–ఎ–సైడ్' ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత జట్టు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. జమైకాతో జరిగిన పూల్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 13–0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున మణీందర్ సింగ్ (28వ, 29వ ని.లో), మంజీత్ (5వ, 24వ ని.లో), రహీల్ మొహమ్మద్ (16వ, 27వ ని.లో), మన్‌దీప్ మోర్ (23వ, 27వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. ఉత్తమ్ సింగ్ (5వ ని.లో), రాజ్‌భర్ పవన్ (9వ ని.లో), గుర్జోత్ సింగ్ (14వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. పూల్ 'బి'లో ఆరు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన భారత జట్టు నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్‌తో తలపడుతుంది.

పట్నా పైరేట్స్‌కు ఎనిమిదో గెలుపు

పట్నా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో సొంతగడ్డపై పట్నా పైరేట్స్ జట్టు అదరగొట్టింది. గుజరాత్ జెయింట్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ జట్టు 32–20 పాయింట్ల తేడాతో నెగ్గింది. ఈ టోర్నీలో పైరేట్స్‌కిది ఎనిమిదో విజయం కావడం విశేషం. పట్నా తరఫున సందీప్ (7 పాయింట్లు), అంకిత్ (6 పాయింట్లు) రాణించారు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41–36తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. హరియాణా తరఫున శివమ్ 12 పాయింట్లు, సిద్ధార్థ్ 11 పాయింట్లు, వినయ్ 6 పాయింట్లు స్కోరు చేశారు.



పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
జైపూర్ పింక్ పాంథర్స్	16	11	2	3	66
పుణేరి పల్టన్	15	11	2	2	63
దబంగ్ ఢిల్లీ	16	10	4	2	59
పట్నా పైరేట్స్	17	8	7	2	50
హరియాణా స్టీలర్స్	16	9	6	1	50
గుజరాత్ జెయింట్స్	16	9	7	0	49
తమిళ్ తలైవాస్	16	7	9	0	40
యు ముంబా	16	6	8	2	40
బెంగళూరు బుల్స్	16	6	9	1	40
బెంగాల్ వారియర్స్	16	6	8	2	39
యూపీ యోధాస్	16	3	12	1	23
తెలుగు టైటాన్స్	16	2	14	0	16

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు

సినిమా

సరికొత్త ప్రపంచంలోకి...


చిరంజీవి

చిరంజీవి ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇందుకు కారణం.. కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రతిష్టాత్మక పద్మ విభూషణ్ అవార్డు ప్రకటించడమే. ఇదే జోష్‌లో రెట్టించిన ఉత్సాహంతో తన తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు చిరంజీవి. ఆయన హీరోగా 'బింబిసార' ఫేమ్ డైరెక్టర్ వశిష్ఠ తెరకెక్కిస్తున్న చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఓ షెడ్యూల్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ హైదరాబాద్‌లో ఆరంభం కానుంది. ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న ఈ మూవీ కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌లో భారీ ఖర్చుతో ఓ సెట్ ఏర్పాటు చేస్తున్నారట మేకర్స్. ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ సెట్ ఉంటుందని, అందుకోసం నిర్మాతలు కూడా భారీగా వెచ్చిస్తున్నారనీ తెలుస్తోంది. ఫిబ్రవరి తొలి వారం నుంచి ఈ సెట్‌లో జరిగే షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని ఫిల్మ్‌నగర్ టాక్. చిరంజీవితో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను ఈ సెట్‌లో చిత్రీకరించనున్నారని భోగట్టా. భీమవరం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపించనున్నారని సమాచారం. దొరబాబు పాత్ర నవ్వుల్ని పంచుతూనే ప్రేక్షకులను మరో కొత్త ఊహా ప్రపంచానికి తీసుకెళుతుందని తెలుస్తోంది. 2025 సంక్రాంతికి ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ప్రేమిస్తే తర్వాత అలాంటి అనుభూతి కలిగింది

– మారుతి

''ప్రేమిస్తే' అనే డబ్బింగ్ మూవీతో నా కెరీర్ ఆరంభమైంది. 'ప్రేమిస్తే' చూసి బాగుందనిపించి రిలీజ్ చేసి, హిట్ సాధించాం. ఇన్నాళ్లకు 'ట్రూ లవర్' చిత్రం చూడగానే మళ్లీ అలాంటి అనుభూతి కలిగింది. ఈ సినిమాను ప్రేమలో ఉన్నవాళ్లు, లేనివాళ్లు, ప్రేమలో పడాలనుకుంటున్న వాళ్లు.. ఇలా అందరూ చూడొచ్చు'' అని డైరెక్టర్ మారుతి అన్నారు. మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్న రవి ప్రధాన పాత్రల్లో ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'ట్రూ లవర్'. నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేశన్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పణలో దర్శకుడు మారుతి విడుదల చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ప్రభురామ్ వ్యాస్ మాట్లాడుతూ– ''ప్రేమికుల మధ్య ఉంటున్న మోడ్రన్ డే రిలేషన్స్ నేపథ్యంలో 'ట్రూ లవర్' ఉంటుంది'' అన్నారు. ''ఫిబ్రవరి 9న వస్తున్న పెద్ద సినిమాలతో మేము పోటీలో లేము. 'ట్రూ లవర్' చిన్న క్యూట్ సినిమా.. మా సినిమాని విడుదల చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని భావిస్తున్నాం'' అన్నారు ఎస్‌కేఎన్. ''మా సినిమాలోని భావోద్వేగాలు ప్రేక్షకులకు కనెక్ట్ అవుతాయని ఆశిస్తున్నాం'' అన్నారు మణికందన్.


మణికందన్, శ్రీ గౌరీప్రియ, మారుతి, ఎస్‌కేఎన్

పుష్ప కౌంట్‌డౌన్ ఆరంభం


అల్లు అర్జున్

పుష్పరాజ్ కౌంట్‌డౌన్ మొదలైంది. 200 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా పుష్ప రూల్ ఆరంభం కానుందని ప్రకటించారు మేకర్స్. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పుష్ప: ది రైజ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం 2021 డిసెంబరు 17న విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఎంతటి సంచలన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ చిత్రంలో తన నటనకుగానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును కూడా అందుకున్నారు అల్లు అర్జున్. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప: ద రూల్' తెరకెక్కుతోంది. ఇందులోనూ అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 15న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్రయూనిట్ ఇటీవల స్పష్టం చేసింది. సోమవారం మరో 200 రోజుల్లో పుష్ప రూల్ బిగిన్ కాబోతోందంటూ, 2024 ఆగస్టు 15న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు విడుదల తేదీని మరోసారి స్పష్టం చేశారు. ఫాహద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పదకొండేళ్ల క్రితమే పాన్ ఇండియా స్టార్‌ని!


శ్రుతీహాసన్

''నేను కెరీర్ ఆరంభించినప్పుడు (2009లో హిందీ చిత్రం 'లక్'తో హీరోయిన్‌గా పరిచయం అయ్యారు) సోషల్ మీడియా లేదు.. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ లేవు. ఒకవేళ ఉండి ఉంటే నటిగా నేను చేసినవి ఇంకా ఎక్కువమంది ప్రేక్షకులు చూసి ఉండేవారు. అయినప్పటికీ కెరీర్ విషయంలో, నా అప్పటి దశ పరంగా నేను హ్యాపీగా ఉన్నాను'' అని శ్రుతీహాసన్ అన్నారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాన్ ఇండియా ఫిల్మ్ గురించిన ప్రశ్న శ్రుతీకి ఎదురైంది. ఆ విషయం గురించి శ్రుతీహాసన్ మాట్లాడుతూ – ''పదకొండేళ్ల క్రితమే నేను పాన్ ఇండియా స్టార్‌ని. అప్పట్లో నేను ఇచ్చిన ఇంటర్వ్యూలు చూస్తే పాన్ ఇండియా అనే పదాన్ని నేను అప్పుడే వాడాను. నాకు పాన్ ఇండియా ఫీవర్ లేదు. అయితే అన్ని రకాల భాషల్లో సినిమాలు చేశాను. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ పోటీలో ఉన్న మేల్, ఫీమేల్ యాక్టర్లతో నన్ను నేను పోల్చుకోను. ఎందుకంటే కొన్నేళ్ల క్రితమే నేను పాన్ ఇండియా సినిమాలు చేసేశాను. కెరీర్ పరంగా నా విధానాన్ని నేను ఫాలో అయ్యాను. నన్ను ఎవరితోనైనా పోల్చితే నచ్చదు'' అన్నారు. ఇక ప్రస్తుతం శ్రుతీహాసన్ చేస్తున్న సినిమాల విషయానికి వస్తే... అడివి శేష్‌తో 'డెకాయిట్' అనే సినిమాలో నటిస్తున్నారు. ఆమె నటించనున్న ఇంగ్లిష్ మూవీ 'చెన్నై స్టోరీస్' షూటింగ్ ఆరంభం కావాల్సి ఉంది.

శివరాత్రికి భీమా


గోపీచంద్

గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా' విడుదల తేదీ ఖరారైంది. మార్చి 8న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రం ద్వారా ప్రముఖ కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెలుగుకి పరిచయమవుతున్నారు. ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ పై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించి, గోపీచంద్ సరికొత్త పోస్టర్‌ని రిలీజ్ చేసింది యూనిట్. ''యునిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'భీమా'. ఇందులో గోపీచంద్ క్రూరమైన పోలీసు అధికారిగా కనిపిస్తారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె. గౌడ, సంగీతం: రవి బస్రూర్.

చల్ చల్ గుర్రం


సమంత


గుర్రపు స్వారీ చేస్తూ...

చల్ చల్ గుర్రం.. చలాకీ గుర్రం అంటూ గుర్రపు స్వారీ చేస్తున్నారు హీరోయిన్ సమంత. మయోసైటిస్ చికిత్సలో భాగంగా ఏడాది పాటు ఆమె సినిమాలకు విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఎప్పటికప్పుడు తన ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తూ అభిమానులకు దగ్గరగా ఉంటారామె. తాజాగా గుర్రపు స్వారీ చేస్తున్న ఓ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా వైరల్‌గా మారింది. తన కెరీర్‌లో భాగంగానే ఆమె గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే క్యాప్షన్‌లో ఆమె హీలింగ్ అనే పదం కూడా వాడటంతో మయోసైటిస్ వ్యాధి నివారణ చికిత్సలో భాగంగా ఈ స్వారీ చేస్తున్నారేమో అంటున్నారు నెటిజన్లు. కాగా సమంత నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్ విడుదలకి సిద్ధంగా ఉంది.

ప్రేమ.. వినోదం...


వైశాలీ రాజ్, అభినవ్

''ఈ నగరానికి ఏమైంది, మీకు మాత్రమే చెబుతా, సేవ్ టైగర్' వంటి పలు చిత్రాల్లో హాస్యనటుడిగా నటించిన అభినవ్ గోమఠం హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా!'. 'ఈ నగరానికి ఏమైంది' చిత్రంలో అభినవ్ పాపులర్ డైలాగ్ 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' పేరుతోనే ఈ సినిమా రూపొందుతోంది. తిరుపతి రావు ఇండ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వైశాలీ రాజ్ హీరోయిన్. కాసుల క్రియేటివ్ వర్క్స్‌పై భవానీ కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ .వి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 23న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. తిరుపతి రావు ఇండ్ల మాట్లాడుతూ– ''లవ్, కామెడీ... ఇలా అన్ని భావోద్వేగాలతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. అభినవ్‌లోని కొత్త కోణాన్ని, తన నటనలోని మరో కోణాన్ని ఈ చిత్రంలో చూస్తారు. కొత్తదనంతో కూడిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,241	71,942
నిఫ్టీ ▲	385	21,738

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,525	▲	70
డోజోన్స్	38,117	▲	8
ఎఫ్‌టీఎస్ఈ 100	7,633	▼	2
డాక్స్	16,942	▲	20
షాంఘై	2,883	▼	27
నికాయ్	36,027	▲	276

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	62,515
బంగారం (99.5 స్వచ్ఛత)	62,265
వెండి (కేజీ)	71,371

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.74	83.76
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.45	107.00
€	యూరో	ఎస్‌బీఐ	89.10	91.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.56	56.81
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.89	55.81
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.74	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.46	12.53

మూడేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ

భారత్ పురోగతిపై ఆర్థికశాఖ నివేదిక



న్యూఢిల్లీ: భారత్ వచ్చే మూడేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)తో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ఆర్థికశాఖ 2024 జనవరి సమీక్షా నివేదిక పేర్కొంది. నిరంతర సంస్కరణల నేపథ్యంలో 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. పది సంవత్సరాల క్రితం భారత్ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం 1.9 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలో 10వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని వివరించింది. ఈ అంకెలు ప్రస్తుతం 3.7 ట్రిలియన్ డాలర్లకు చేరి (2023–24 ఆర్థిక సంవత్సరం అంచనాల ప్రకారం) దేశం ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పేర్కొన్నారు. మహమ్మారి సవాళ్లు, తీవ్ర ఒడిదుడుకులు ఉన్నప్పటికీ దేశం ఈ ఘనత సాధించిందని పేర్కొంది. ప్రస్తుత ప్రభుత్వం 2047 నాటికి 'అభివృద్ధి చెందిన దేశ'గా మారాలనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుందని వివరించింది. సంస్కరణల ప్రయాణం కొనసాగడంతో ఈ లక్ష్యం నెరవేరుతుందన్న భరోసాను వెలిబుచ్చింది. సమగ్ర సంస్కరణలతో జిల్లా, బ్లాక్, గ్రామ స్థాయిలలో పాలనాపరమైన మార్పులు తీసుకువచ్చినప్పుడు దేశాభివృద్ధిలో రాష్ట్రాల భాగస్వామ్యం సంపూర్ణంగా ఉంటుందని నివేదిక వివరించింది. దేశీయ డిమాండ్ పటిష్టతతో ఎకానమీ గత మూడేళ్లలో 7 శాతం వృద్ధిని సాధించిందని, 2024–25లో కూడా 7 శాతం స్థాయికి వృద్ధి చేరే అవకాశం ఉందని నివేదిక అంచనావేసింది. 25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకనామిగా కొనసాగుతోంది. ప్రపంచం మొత్తం జీడీపీలో పావుశాతం వాటాను కలిగి ఉంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)లు ఉన్నాయి.

మౌలిక రంగం అద్భుతం



కేంద్ర ప్రభుత్వం మునుపెన్నడూలేనట్లు అపూర్వమైన స్థాయిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసింది. 2014–15లో ప్రభుత్వ రంగ మూలధన పెట్టుబడి 5.6 లక్షల కోట్లు ఉంటే 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఈ పరిమాణం 18.6 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది.

– వి. అనంత నాగేశ్వరన్, చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్

ఎకానమీ... లుకింగ్ లైక్ ఏ వావ్



వైరల్ మీమ్.. జస్ట్ లుకింగ్ లైక్ ఏ వావ్... భారత ఆర్థిక వ్యవస్థ శక్తిని, ఎకానమీ ప్రస్తుత చెక్కుచెదరని స్వభావాన్ని ప్రతిధ్వనిస్తుంది. ప్రపంచంలోని అగ్ర దేశాలు నిరాశావాదంలో మునిగిపోయినప్పటికీ, భారతదేశం తిరుగులేని ఆశావాదంతో ముందుకు సాగుతోంది. ఈ విజయానికి కారణం ప్రభుత్వమే.

– కార్పొరేట్ దిగ్గజం కుమార మంగళం బిర్లా

ఐటీసీ లాభం రూ. 5,401 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతంపైగా వృద్ధితో రూ. 5,401 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 5,070 కోట్లు ఆర్జించింది. సిగరెట్లుసహా ఎఫ్ఎంసీజీ బిజినెస్ లాభాలకు దన్నునిచ్చింది. వాటాదారులకు షేరుకి రూ. 6.25 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఫిబ్రవరి 8 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. కాగా.. నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అతుల్ సింగ్, స్వతంత్ర డైరెక్టర్‌గా పుష్ప సుబ్రహ్మణ్యంను బోర్డు ఎంపిక చేసినట్లు ఐటీసీ పేర్కొంది. 2024 ఏప్రిల్ 2 నుంచి ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

ఆదాయం అప్

ప్రస్తుత సమీక్షా కాలంలో ఐటీసీ స్థూల ఆదాయం 2 శాతం పుంజుకుని రూ. 19,338 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 18,902 కోట్ల టర్నోవర్ నమోదైంది. కాగా.. మొత్తం కార్యకలాపాల టర్నోవర్ రూ. 19,484 కోట్లుగా నమోదైంది. ఆదాయంలో సిగరెట్లతోపాటు ఎఫ్ఎంసీజీ బిజినెస్ నుంచి 4.5 శాతం అధికంగా రూ. 13,513 కోట్లు లభించగా.. సిగరెట్ల నుంచి 3 శాతం వృద్ధితో రూ. 8,295 కోట్లు సమకూర్చుకుంది. ఎఫ్ఎంసీజీలో ఇతర విభాగాలు 8 శాతం ఎగసి రూ. 5,218 కోట్ల టర్నోవర్‌ను సాధించాయి. ఐటీసీ హోటళ్ల నుంచి 18 శాతం అధికంగా రూ. 872 కోట్ల ఆదాయం లభించింది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు 1.5 శాతం నష్టంతో రూ. 449 వద్ద ముగిసింది.

బీపీసీఎల్ లాభం హైజంప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 82 శాతం జంప్‌చేసి రూ. 3,181 కోట్లను దాటింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 1,747 కోట్లు ఆర్జించింది. అంచనాలకు మించిన రిఫైనింగ్, మార్కెటింగ్ మార్జిన్లు భారీ లాభాలకు దోహదం చేశాయి. అయితే ఈ ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)లో మరింత అధికంగా రూ. 8,244 కోట్ల నికర లాభం ఆర్జించిన సంగతి తెలిసిందే. ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ గత 21 నెలలుగా ఇంధన ధరల సవరణను నిలిపివేయడంతో మార్కెటింగ్ మార్జిన్లు మెరుగుపడినట్లు కంపెనీ పేర్కొంది.

ఆదాయం ఫ్లాట్

ప్రస్తుత సమీక్షా కాలంలో బ్యారల్‌కు 13.3 డాలర్ల చొప్పున స్థూల రిఫైనింగ్ మార్జిన్ల(జీఆర్ఎం)ను బీపీసీఎల్ ఆర్జించింది. మొత్తం ఆదాయం ఫ్లాట్‌గా రూ. 1.3 లక్షల కోట్లకు చేరింది. 9.86 మిలియన్ టన్నుల చమురును ప్రాసెస్ చేసింది.

బీపీసీఎల్ షేరు 4 శాతం జంప్‌చేసి రూ. 493 వద్ద ముగిసింది.

బడ్జెట్ ముందు బుల్ దూకుడు

- రాణించిన రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ
- ఆసియా, యూరప్ మార్కెట్లలో సానుకూలతలు
- 1,241 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 21,700 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: బడ్జెట్ వారాన్ని స్టాక్ మార్కెట్ భారీ లాభాలతో ఆరంభించింది. రిలయన్స్(7%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(1.53%) షేర్లు రాణించడంతో పాటు ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. మధ్యంతర బడ్జెట్‌పై ఆశావహ అంచనాలు, ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను పెంచకపోవచ్చనే ఆశలూ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఇటీవల క్యూ3 ఫలితాల ప్రకటన సందర్భంగా కంపెనీల యాజమాన్యం ఆశావహ అవుట్‌లుక్ వ్యాఖ్యలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయి. ఫలితంగా సూచీలు దాదాపు 2% ర్యాలీ చేసి నెల రోజుల్లో(డిసెంబర్ 5, 2023 తర్వాత) అతిపెద్ద ఒక రోజు లాభాన్ని ఆర్జించాయి. సెన్సెక్స్ 1,241 పాయింట్లు పెరిగి 71,942 ముగిసింది. నిఫ్టీ 385 పాయింట్లు బలపడి 21,738 వద్ద నిలిచింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంధన, ఆయిల్‌అండ్‌గ్యాస్, విద్యుత్, సర్వీసెస్, క్యాపిటల్ గూడ్స్, పారిశ్రామిక, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ ఇండెక్సులు 1.68%, 1.03% చొప్పున లాభపడ్డాయి. ఆసియాలో చైనా, సింగపూర్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు ఒకశాతం లాభపడ్డాయి. యూరప్‌లో బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలు అరశాతం పెరిగాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

సెన్సెక్స్ సుమారు 2% ర్యాలీతో బీఎస్ఈలో రూ.6.08 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.377 లక్షల కోట్లకు చేరింది.

ఇంధన షేర్లకు భారీ డిమాండ్

పశ్చిమాసియా సంక్షోభంతో ఎర్రసముద్రం నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావం కారణంగా నవంబర్ నుంచి అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్న ఇంధన రంగ షేర్లకు సోమవారం అనూహ్యంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఓఎన్‌జీసీ, క్యాస్ట్రోల్ 8%, రిలయన్స్, కోల్ ఇండియా 6%, హిందుస్థాన్ పెట్రోలియం 5%, బీపీసీఎల్, గెయిల్ 4%, ఇంధ్రప్రస్థగ్యాస్ 3%, ఆయిల్ ఇండియా, ఐఓసీ 2% షేర్లు రాణించాయి.

రి'లయన్స్' గర్జన

ఇంధన రంగ షేర్ల ర్యాలీలో భాగంగా రిలయన్స్ షేరు 7% ర్యాలీ చేసి రూ.2896 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఏడుశాతానికి పైగా లాభపడి రూ. 2905 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. షేరు భారీ ర్యాలీతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.1.25 లక్షల కోట్లు పెరిగి తొలిసారి రూ.19.59 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ సూచీలో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే. కాగా గత 3 ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు మొత్తం 9% లాభపడింది.

భారత్‌లో శామ్‌సంగ్ ల్యాప్‌టాప్స్ తయారీ



గురుగ్రామ్: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్ ఈ ఏడాది నుంచి భారత్‌లో ల్యాప్‌టాప్స్ తయారీని చేపట్టాలని నిర్ణయించింది. నోయిడాలోని ఫ్యాక్టరీలో ల్యాప్‌టాప్‌ల తయారీకి కార్యాచరణ ప్రారంభించినట్లు సంస్థ ప్రెసిడెంట్ టీఎం రోహ్ వెల్లడించారు. 'కంపెనీకి నోయిడా ఒక ముఖ్యమైన తయారీ కేంద్రం. ఇది శామ్‌సంగ్‌కు రెండవ అతిపెద్ద స్థావరం. ప్రపంచ డిమాండ్‌కు అనుగుణంగా ప్లాంట్‌ను తీర్చిదిద్దడానికి కొన్ని మార్పులు ఉండవచ్చు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి వివిధ స్థాయిలలో మద్దతు లభించింది. దేశీయంగా తయారీని బలోపేతం చేసేందుకు కంపెనీ ప్రభుత్వంతో సహకరిస్తూనే ఉంటుంది' అని స్పష్టం చేశారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత గెలాక్సీ ఎస్24 స్మార్ట్‌ఫోన్ తయారీ సైతం భారత్‌లో చేపట్టనున్నట్లు శామ్‌సంగ్ ఇటీవల ప్రకటించింది. ఇప్పటికే నోయిడా ప్లాంటులో ఫీచర్ ఫోన్స్, స్మార్ట్‌ఫోన్స్, వేరబుల్స్, ట్యాబ్లెట్ పీసీలను తయారు చేస్తున్నారు.

ఒలెక్ట్రా లాభం 77 శాతం అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్‌ల తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 77 శాతం ఎగసి రూ.27 కోట్లు సాధించింది. ఎబిటా 52 శాతం దూసుకెళ్లి రూ.56 కోట్లకు చేరింది. ఈపీఎస్ రూ.4.70 నుంచి రూ.7.69లను తాకింది. ఆదాయం 33 శాతం పెరిగి రూ.342 కోట్లు నమోదైంది. అక్టోబర్–డిసెంబర్‌లో 25 శాతం వృద్ధితో 178 ఈ–బస్‌ల డెలివరీ నమోదు చేసినట్లు ఒలెక్ట్రా సీఎండీ కె.వి.ప్రదీప్ తెలిపారు. 'తయారీ, సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంపై మా దృష్టి కొనసాగుతుంది. బలమైన ఆర్డర్ బుక్ ఉంది. 150 ఎకరాల విస్తీర్ణంలో సీతారాంపూర్ ప్లాంటు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో ఈ కేంద్రం నుండి పాక్షికంగా ఉత్పత్తిని ప్రారంభిస్తున్నాం. నూతన ప్లాంటుతో తయారీ సామర్థ్యం మరింత పెరుగుతుంది' అని వివరించారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

డీఎంహెచ్‌వో కడపలో 68 పోస్టులు

కడప జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం వైఎస్సార్ జిల్లా ఆరోగ్య సంస్థల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** జనరల్ డ్యూటీ అటెండెంట్-50,డేటా ఎంట్రీ ఆపరేటర్-04, బార్బర్-02, ధోబీ-02,జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్-04,ఓటీ అసిస్టెంట్-06.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజ్, పుట్లంపల్లి, కడప, వైఎస్సార్ జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.01.2024.
» **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in

తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఆరు నుంచి పదో తరగతిలో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 194 ఆదర్శ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో ఆరు నుంచి పదో తరగతి ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ప్రవేశ పరీక్షలో మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, సీఏ, టీపీటీ, సీఎస్ తదితర పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారు.

» **ప్రవేశాల వివరాలు:** తెలంగాణ మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్–2024.
» **అర్హత:** అడ్మిషన్ పొందాలనుకున్న విద్యార్థి 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధిత తరగతికి కింది స్థాయి తరగతి చదువుతూ ఉండాలి.
» **వయసు:** 31.08.2024 నాటికి ఆరో తరగతికి పదేళ్లు, ఏడో తరగతికి పదకొండేళ్లు, ఎనిమిదో తరగతికి పన్నెండేళ్లు, తొమ్మిదో తరగతికి పదమూడేళ్లు, పదో తరగతికి పద్నాలుగేళ్లు నిండాలి.
» **ఎంపిక విధానం:** ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు. ఇంగ్లిష్/తెలుగు మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.02.2024.
» **ప్రవేశ పరీక్ష తేది:** 07.04.2024.
» **వెబ్‌సైట్:** www.tgtwgurukulam.telangana.gov.in

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 14 టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ -సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(ప్రతిభా కళాశాలలు)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే 'తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ ఉచిత విద్య, వసతి సౌకర్యాలతో పాటు ఐఐటీ, నీట్ తదితర జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ ఇస్తారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 1140(బాలురు–660, బాలికలు–480).
» **గ్రూపులు:** ఎంపీసీ(575 సీట్లు), బైపీసీ(565 సీట్లు).
» **బోధనా మాధ్యమం:** ఇంగ్లిష్.
» **రిజర్వేషన్:** అన్ని సీట్లు ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు కేటాయించారు.
» **అర్హత:** మార్చి–2024లో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి.
» **వయసు:** విద్యార్థుల వయస్సు 31.08.2024 నాటికి 19 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** లెవల్ 1, 2 స్క్రీనింగ్ టెస్టులు, దరఖాస్తులో విద్యార్థి ఇచ్చిన ప్రాధాన్యం ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** లెవల్–1 స్క్రీనింగ్ పరీక్ష ఓఎమ్మార్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 160 మార్కులకు పరీక్ష ఉంటుంది. నాలుగు తప్పు సమాధానాలకు ఒక మార్కు చొప్పున కోత విధిస్తారు. ఎంపీసీ–ఇంగ్లిష్(20 మార్కులు), మ్యాథ్స్(60 మార్కులు), ఫిజిక్స్(40 మార్కులు), కెమిస్ట్రీ(40 మార్కులు) సబ్జెక్టుల్లో; బైపీసీ ఇంగ్లిష్ (20 మార్కులు), మ్యాథ్స్(20 మార్కులు), ఫిజిక్స్(40 మార్కులు), కెమిస్ట్రీ(40 మార్కులు), బయాలజీ(40 మార్కులు) సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం తెలుగు/ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**05.02.2024
» **లెవల్–1 స్క్రీనింగ్ పరీక్ష తేది:** 18.02.2024.
» **లెవల్–2 స్క్రీనింగ్ పరీక్ష తేది:** 10.03.2024.
» **వెబ్‌సైట్:** http://ttwreiscoe.cgg.gov.in

ఉన్నత విద్యకు 'ఎంట్రెన్స్'!



» ఇంజనీరింగ్ నుంచి లా వరకు పలు ఎంట్రన్స్‌లు
» వీటిలో స్కోర్‌తో సంబంధిత కోర్సుల్లో ప్రవేశం
» ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో చదువుకునే అవకాశం
» ఉజ్వల భవిష్యత్తుకు మార్గంగా ప్రవేశ పరీక్షలు

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులకు అనేక ఉన్నత విద్య అవకాశాలు. ఇంజనీరింగ్, మెడిసిన్ మొదలు లా, బీఆర్క్, బీఫార్మసీ వరకూ.. వివిధ కోర్సుల్లో చేరే వీలుంది. అందుకోసం ఆయా ఎంట్రెన్స్ టెస్టుల్లో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో మరికొద్ది రోజుల్లో లక్షల మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకోనున్నారు. ఈ నేపథ్యంలో.. ఇంటర్మీడియెట్ తర్వాత అందుబాటులో ఉన్న ముఖ్యమైన ఎంట్రెన్స్ టెస్టులపై ప్రత్యేక కథనం...

జేఈఈ–మెయిన్

జాతీయ స్థాయిలో..ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీఈ/బీటెక్,బీఆర్క్,బీప్లానింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష జేఈఈ మెయిన్. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు అర్హులు. మొత్తం మూడు విభాగాల్లో(ఫిజిక్స్,మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ) 300 మార్కులకు ఈ ఆన్‌లైన్ టెస్ట్ పరీక్ష ఉంటుంది. జేఈఈ–మెయిన్ పేపర్ 2లో ర్యాంకు ఆధారంగా ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశాలు లభిస్తాయి. పేపర్ 2లో మ్యాథమెటిక్స్; ఆప్టిట్యూడ్ టెస్ట్, డ్రాయింగ్ టెస్ట్ విభాగాల్లో నైపుణ్యాలను పరీక్షిస్తారు. పేపర్–2బి పేరుతో బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మ్యాథమెటిక్స్, ఆప్టిట్యూడ్ టెస్ట్, ప్లానింగ్ బేస్డ్ ప్రశ్నలు అడుగుతారు.

- వెబ్‌సైట్: https://jeemain.nta.nic.in

జేఈఈ–అడ్వాన్స్‌డ్

దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐటీల్లో బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష... జేఈఈ అడ్వాన్స్‌డ్. జేఈఈ–మెయిన్ పేపర్–1లో ప్రతిభ ఆధారంగా 2.5 లక్షల మందిని జేఈఈ–అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తారు. ఈ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం మూడు గంటలు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలో మంచి స్కోర్ ఆధారంగా ఐఐటీలే కాకుండా.. ఐఐఎస్‌టీ, ఐఐఎస్‌సీ తదితర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో కూడా ప్రవేశాలు పొందొచ్చు. జేఈఈ -అడ్వాన్స్‌డ్ -2024ను మే 26న నిర్వహించనున్నారు. ఇందుకోసం దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 21 నుంచి 30 వరకు అందుబాటులో ఉండనుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.jeeadv.ac.in

ఈఏపీసెట్

రాష్ట్ర స్థాయిలోని కాలేజ్‌ల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు అందుబాటులో ఉన్న మార్గం.. టీఎస్ ఈఏపీసెట్ , ఏపీ ఈఏపీసెట్.

- ఆంధ్రప్రదేశ్‌లో ఈఏపీ(ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ)సెట్, తెలంగాణ రాష్ట్రంలో టీఎస్ ఈఏపీసీసెట్ పేరుతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. బీటెక్‌లో చేరేందుకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పేపర్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ స్ట్రీమ్ పేపర్‌లో ఉత్తీర్ణత ద్వారా బీటెక్‌తో పాటు బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/బీటెక్(డెయిరీ టెక్నాలజీ)/బీటెక్(ఫుడ్ టెక్నాలజీ)/బీటెక్(బయో టెకాలజీ)/బీఫార్మసీ (ఎంపీసీ)/ఫార్మ్–డీ(ఎంపీసీ) కోర్సుల్లోనూ చేరొచ్చు. మొత్తం 160 మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్‌లో 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. అగ్రికల్చర్, ఫార్మసీ, మెడిసిన్ విభాగాల్లో బయాలజీ(బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 40 ప్రశ్నలు చొప్పున ఉంటాయి.

నాటా

ఎంపీసీ అర్హతతో ప్రవేశం పొందే అవకాశం ఉన్న మరో కోర్సు..బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(నాటా) పరీక్షలో స్కోర్ ఆధారంగా.. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు పొందిన కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సులో అడ్మిషన్ లభిస్తుంది. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే నాటాలో 125 ప్రశ్నలు (200 మార్కులు) ఉంటాయి. డయగ్రమాటిక్ రీజనింగ్, న్యూమరికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, ఇండక్టివ్ రీజనింగ్, సిట్యుయేషనల్ జడ్జ్‌మెంట్, లాజికల్ రీజనింగ్, అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రస్తుతం నాటా–2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. తొలి విడత పరీక్ష ఏప్రిల్ 6న నిర్వహించనున్నారు.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nata.in

నీట్–యూజీ

ఎంబీబీఎస్, బీడీఎస్.. ఇంటర్మీడియెట్ బైపీసీ విద్యార్థుల కలల కోర్సులు. వీటిలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నీట్–యూజీ పేరుతో ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా.. దేశ వ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌తోపాటు.. ఆయుష్‌గా పేరొందిన హోమియోపతి, ఆయుర్వేద, యునానీ, నేచురోపతి వంటి కోర్సులు పూర్తి చేసుకుని వైద్య వృత్తిలో స్థిరపడొచ్చు. బైపీసీ ఉత్తీర్ణులు ఈ ఎంట్రన్స్‌కు అర్హులు. నీట్–యూజీ పరీక్షను మొత్తం నాలుగు విభాగాల్లో (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ) 720 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో విభాగం నుంచి 45 ప్రశ్నలు అడుగుతారు. నీట్–2024ను మే 5న నిర్వహించనున్నారు.

- వివరాలకు వెబ్‌సైట్:https://neet.nta.nic.in

నెస్ట్

ఇంటర్మీడియెట్ ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో ప్రత్యామ్నాయం.. నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్(నెస్ట్). ఈ టెస్ట్‌లో స్కోర్ ఆధారంగా.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైసర్)–భువనేశ్వర్, యూనివర్సిటీ ఆఫ్ ముంబై–డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ప్రవేశం పొందొచ్చు. మొత్తం నాలుగు సబ్జెక్ట్‌లలో (బయలాజికల్ సైన్సెస్; కెమికల్ సైన్సెస్; మ్యాథమెటిక్స్; ఫిజిక్స్) ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉంటాయి. నెస్ట్ ఎంట్రన్స్.. నాలుగు విభాగాల్లో (మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ)లో 200 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.nestexam.in

క్లాట్–యూజీ

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో కోర్సు.. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ. న్యాయశాస్త్రంలో నైపుణ్యం సొంతం చేసుకుని లా కెరీర్‌లో రాణించాలనుకునే వారికి ఈ కోర్సు ఉపయుక్తంగా ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఉన్న నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశానికి క్లాట్–యూజీ పేరుతో ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ (22 నుంచి 26 ప్రశ్నలు); జీకే అండ్ కరెంట్ అఫైర్స్ (28 నుంచి 32 ప్రశ్నలు); లీగల్ రీజనింగ్ (28–32 ప్రశ్నలు); లాజికల్ రీజనింగ్ (22–26 ప్రశ్నలు); క్వాంటిటేటివ్ టెక్నిక్స్ (10 నుంచి 14 ప్రశ్నలు) ఉంటాయి.

- వివరాలకు వెబ్‌సైట్: https://consortiumofnlus.ac.in/clat2024

హోటల్ మేనేజ్‌మెంట్‌కు ఎన్‌సీహెచ్ఎం జేఈఈ

ఇంటర్మీడియెట్ విద్యార్థులు.. చక్కటి ఉపాధి అవకాశాలు అందుకునేందుకు వీలున్న మరో కోర్సు.. హోటల్ మేనేజ్‌మెంట్. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి హాస్పిటాలిటీ, టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాల్లో కెరీర్ అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయిలో టూరిజం శాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్ష.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్–జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్. ఈ ఎంట్రన్స్ అయిదు విభాగాల్లో(న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్; రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్; జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్;ఇంగ్లిష్ లాంగ్వేజ్;ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్) 200 ప్రశ్నలకు ఉంటుంది. ఈ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా.. టూరిజం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లు, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్‌లు, ఇతర ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లలో హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.

- వెబ్‌సైట్: https://nchmjee.nta.nic.in

సీయూఈటీ–యూజీ

ఇంటర్మీడియెట్ తర్వాత ప్రముఖ విశ్వ విద్యాలయాల్లో, సెంట్రల్ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి అందుబాటులో ఉన్న మార్గం.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్–యూజీ. ఈ ఎంట్రన్స్‌ను మూడు సెక్షన్లుగా నిర్వహిస్తారు. సెక్షన్–1ఎ(లాంగ్వేజెస్–50 ప్రశ్నలు); సెక్షన్1బి(లాంగ్వేజెస్–50 ప్రశ్నలు); సెక్షన్-2 (డొమైన్ సబ్జెక్ట్స్ 45/50 ప్రశ్నలు); సెక్షన్–3 (జనరల్ టెస్ట్– 60 ప్రశ్నలు) ఉంటాయి. సెక్షన్–1ఎలో అభ్యర్థులు 13 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు. సెక్షన్–1బిలో అభ్యర్థులు 20 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు. సెక్షన్–2 డొమైన్ సబ్జెక్ట్స్ విభాగంలో మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్స్ అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌ను, బ్యాచిలర్ డిగ్రీలో తాము చదవాలనుకుంటున్న కోర్సుకు సరితూగే సబ్జెక్ట్‌ను డొమైన్ సబ్జెక్ట్స్‌గా ఎంచుకోవచ్చు. డొమైన్ సబ్జెక్ట్స్ విభాగం నుంచి 45 లేదా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో చాయిస్ విధానం మేరకు అభ్యర్థులు 35 లేదా 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. జనరల్ టెస్ట్ విభాగంలో జీకే, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్, రీజనింగ్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. సెక్షన్–1ఎ, సెక్షన్–1బి లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఎన్‌టీఏ నిర్దేశిత జాబితాలోని లాంగ్వేజ్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రతి ప్రశ్నకు 5 మార్కులు కేటాయిస్తారు.

- వెబ్‌సైట్: https://cuet.samarth.ac.in

రాష్ట్రంలో పర్యాటకానికి పెద్దపీట వేశాం!

ఓయూలో లైటింగ్ సిస్టమ్, అథ్లెటిక్ ట్రాక్‌ను ప్రారంభించిన కిషన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో పర్యాటకానికి పెద్దపీట వేసినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఓయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన లైటింగ్, సౌండింగ్ సిస్టమ్‌ను, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. వీసీ ప్రొఫెసర్ రవీందర్ అధ్యక్షతన ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వచ్చే నెలలో వరంగల్ వేయి స్తంభాల గుడి, సంజీవయ్య పార్క్‌లో లేజర్ షోను, సాలార్‌జంగ్ మ్యూజియంలో ఎపిగ్రాఫ్ మ్యూజియం ప్రారంభించనున్నట్లు తెలిపారు. నాంపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్ల ఆధునీకరణతో పాటు చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. త్వరలో హైదరాబాద్ నుంచి యాదాద్రికి ఎంఎంటీఎస్ రైలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీకి రూ.12 కోట్లతో డైనమిక్ లైటింగ్స్, చరిత్ర తెలిపే లేజర్ షోను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సినీనటుడు సాయికుమార్ మాట్లాడుతూ, వందేళ్లు పూర్తి చేసుకున్న ఓయూ ఆర్ట్స్ కాలేజీకి వాయిస్ ఓవర్ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, మాజీ వీసీలు డీఎన్ రెడ్డి, ప్రొ.తిరుపతిరావు, వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'వ్యూహం'పై వాదనలు నేడు

దర్శకుడి పిటిషన్‌ను నిర్మాత పిటిషన్‌తో జత చేయాలన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: వ్యూహం చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) జారీ చేసిన సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఈ నెల 22న ఇచ్చిన తీర్పును కొట్టేయాలంటూ దాఖలైన పిటిషన్లపై వాదనలను మంగళవారం వింటామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం స్పష్టం చేసింది. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం సీజే ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అయితే గతంలో నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ వేసిన పిటిషన్‌ను ఈ నెల 30కి వాయిదా వేయడంతో తాజా పిటిషన్‌ను కూడా దానికి జత చేయాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.



సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ భవనంపై ఏర్పాటు చేసిన లైటింగ్, సౌండింగ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు
- పరిశ్రమలు, ఐటీ శాఖపై డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కొన్ని చిన్న, మధ్యతరగతి ఐటీ కంపెనీలు, యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్ కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించేలా బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని వెల్లడించారు. సోమవారం సచివాలయంలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖలు రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు ఆ శాఖల పనితీరుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వార్షిక సంవత్సరంలో చేపట్టే కార్యకలాపాలకు కావాల్సిన నిధులపై నివేదిక అందజేశారు.

డ్రై పోర్టులపై ఫోకస్

తెలంగాణలో పరిశ్రమల వ్యాప్తి జరుగుతున్న నేపథ్యంలో డ్రై పోర్టుల ఏర్పాటుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఉత్పత్తి చేసే వస్తువుల ఎగుమతులు పెంచుకోవడానికి డ్రై పోర్టుల ఆవశ్యకత ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు రైతుల నుంచి సేకరిస్తున్న భూమికి సముచిత పరిహారం ఇస్తామన్నారు. లిడ్‌క్యాప్ పునరుద్ధరణ, లెదర్ పార్కుల ఏర్పాటుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. రీజినల్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు మధ్యన ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు కనెక్టివిటీ పెరిగి రవాణా సమస్య లేకుండా ఉండటంతో పాటు ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఇండస్ట్రియల్ పార్కులో పారిశ్రామిక వేత్తలకు చేసే భూ కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

సూక్ష్మ, లఘు పరిశ్రమలకు కొత్త పాలసీ : మంత్రి శ్రీధర్‌బాబు

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా నూతన ఎంఎస్ఎంఈ పాలసీని తెస్తున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. చిన్నస్థాయి నుంచి మధ్యస్థాయి ఉండే పారిశ్రామిక వేత్తలను ఆదుకోవాలంటే ఎంఎస్ఎంఈ పాలసీలో ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తొమ్మిది జిల్లాల్లో నూతనంగా ఇండస్ట్రియల్ జోన్స్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఫైనాన్స్ జాయింట్ సెక్రటరీ హరిత, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే రాష్ట్ర అభివృద్ధి : శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: మహిళా సాధికారతతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. మహిళల క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించకుంటే వారు ప్రపంచంతో పోటీపడటంలో అవరోధాలు ఎదురవుతాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా భాగస్వామ్యంతో 'స్టార్ట్ ఎక్స్'పేరిట 13 వారాలపాటు ''వీ హబ్' నిర్వహించే ప్రీ ఇంక్యుబేషన్ కార్యక్రమానికి సంబంధించి సోమవారం మంత్రి శ్రీధర్‌బాబు, ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్‌గ్రీన్ సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు బాగున్నాయని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలనే ప్రభుత్వ ఆలోచనను ఫిలిప్‌గ్రీన్ ప్రశంసించారు.



ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్‌గ్రీన్‌తో మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో జయేశ్

సోదర రాష్ట్రాలతో పోటీపడటం లేదు

రాయదుర్గం: తెలంగాణ కేవలం దేశంలోని సోదర రాష్ట్రాలతో పోటీపడటం లేదని ఐటీ శాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో నార్డిక్స్, ఎస్టోనియా, పశ్చిమ యూరప్‌లకు చెందిన 12 మంది ప్రతినిధులతో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన రాష్ట్ర పరిమాణంలోని దేశాలతో పోటీపడుతోందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ అత్యంత పిన్న రాష్ట్రమైనప్పటికీ, అత్యుత్తమ రాష్ట్రమన్నారు. తెలంగాణలో అందరూ ముందుకొచ్చి పెట్టుబడులు పెట్టాలని, సదుపాయాల కల్పనలో ముందుంటామన్నారు. ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ టెక్ కంపెనీలు హైదరాబాద్‌ను ఇష్టపడటానికి కారణం టాలెంట్‌పూల్ అందుబాటులో ఉండటమే అన్నారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలు ఇతర నగరాల్లో లేవని, తాము బెంగళూరు, చెన్నై, పుణే, గుర్గావ్ వంటి నగరాలతో పోటీపడుతున్నామన్నారు.

రైల్వే ప్రాంతాల భద్రతకు మరిన్ని చర్యలు

- అదనపు సిబ్బందిని కేటాయిస్తాం
- రైల్వే ప్రాంతాల భద్రతపై డీజీపీ రవిగుప్తా సమీక్ష



సమీక్షలో పాల్గొన్న డీజీపీ రవి గుప్తా

సాక్షి, హైదరాబాద్: రైల్వే భద్రతకు అదనపు సిబ్బంది కేటాయింపు, రైల్వే పోలీస్‌స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు, భద్రతాపరమైన సామగ్రి పెంపుపై తగిన చర్యలు తీసుకుంటామని డీజీపీ రవిగుప్తా తెలిపారు. రాష్ట్రంలోని రైల్వేస్టేషన్ల పరిధిలోని ప్రాంతాల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై డీజీపీ సోమవారం సమీక్షించారు. రైల్వేస్, రోడ్డుభద్రత అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ఆధ్వర్యంలో డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్), జీఆర్‌పీ (గవర్నమెంట్ రైల్వే పోలీస్), ఇంటెలిజెన్స్ బ్యూరో, రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్ర పరిధిలో 12 గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్లు, 17 రైల్వే ఔట్ పోస్టులు పనిచేస్తున్నాయని చెప్పారు. వీటిలో అవసరం మేరకు సిబ్బంది పెంపుపై చర్చిస్తామన్నారు. హైదరాబాద్‌కు దేశంలోనే అత్యధిక సీసీటీవీలు ఉన్న రాజధానిగా పేరు ఉందని, తదనుగుణంగా రైల్వేస్టేషన్లలోనూ సీసీటీవీ కెమెరాల సంఖ్య పెంచాలని డీజీపీ అభిప్రాయపడ్డారు. పండుగ రోజులు, సెలవు దినాల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న సందర్భాల్లో అదనపు భద్రతపై చర్యలు చేపట్టాలని సూచించారు. రైల్వే ట్రాక్‌లపై జరుగుతున్న ప్రమాదాలన్నింటిపై రైల్వే పోలీసులు విచారణ జరపాలని ఆదేశించారు. ప్రయాణికులు అనుమానాస్పద వ్యక్తుల కదలికపై డయల్ 100 లేదా 139 లేదా 1512లో సమాచారం ఇవ్వాలని చెప్పారు. రైలు ప్రయాణ సమయంలో మొబైల్ ఫోన్లు చోరీకి గురైతే ప్రయాణికులు సమీప రైల్వే పోలీస్‌స్టేషన్ లేదా www.ceir.gov.in.కు ఫిర్యాదు చేయాలని డీజీపీ సూచించారు. మహేశ్ భగవత్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా సికింద్రాబాద్, కాజీపేట రైల్వేజంక్షన్లలో స్నిఫర్ డాగ్స్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్!

రాష్ట్ర స్థాయి మాదిరిగా జిల్లా స్థాయిలోనూ ప్రత్యేక పోలీస్‌స్టేషన్

సాక్షి, హైదరాబాద్: నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాల కట్టడికి తెలంగాణ పోలీసులు ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహాలు రూపొందిస్తూనే ఉన్నారు. అదే తరహాలో ఇప్పుడు రాష్ట్రస్థాయిలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. సైబర్ నేరగాళ్లు పాల్పడే తీవ్ర ఆర్థిక నేరాలు, సంచలన కేసుల దర్యాప్తు త్వరితగతిన చేపట్టేలా ఈ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. బాధితులు ఈ మధ్య కాలంలో కోట్ల రూపాయలు సైతం సైబర్ నేరగాళ్ల చేతిలో పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి తీవ్ర ఆర్థిక నేరాల దర్యాప్తు చేపట్టేందుకు రాష్ట్రస్థాయి సైబర్ పోలీస్ స్టేషన్ అవసరమని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా సైబర్ వేధింపులు, ఇతర తరహాలోని నేరాల్లో సంచలన కేసులను ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో దర్యాప్తు చేపట్టేలా యోచిస్తున్నారు. అయితే రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసే ఈ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసే కేసులు ఏ కోర్టు పరిధిలోకి వస్తాయన్న అంశంపై నిర్ణయం కోసం ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారుల నుంచి న్యాయాధికారులకు వివరాలు వెళ్లినట్టు తెలిసింది.

వాళ్లను ఎస్టీలుగా గుర్తించొద్దన్న పిటిషన్‌పై విచారణ వాయిదా

బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించొద్దంటూ గోండ్వానా సొసైటీ పిటిషన్



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ ఉత్తర్వులు (సవరణ) చట్టం- 1976 ప్రకారం తెలంగాణలో బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆరువారాలపాటు విచారణ వాయిదా వేసింది. గోండ్వానా వెల్ఫేర్ సొసైటీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం విచారించింది. తెలంగాణలో నూతన ప్రభుత్వం వచ్చిందనీ, పాలసీ మేటర్ అయినందున కొంత సమయం కావాలనీ విచారణ ఆరు వారాలపాటు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది శ్రావణ్‌కుమార్ కోరారు. ఇప్పటికే కొంటరు దాఖలు చేసినందున విచారణ త్వరగా చేపట్టాలని కేంద్రం తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోరారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ ఇంకా కౌంటరు దాఖలు చేయలేదని, ఆయా రాష్ట్రాలు కౌంటరు వేస్తే అన్నింటిపై కలిపి రిజాయిండర్ దాఖలు చేస్తామని గోండ్వానా సొసైటీ తరఫు న్యాయవాది దామా శేషాద్రి నాయుడు కోరారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.